

ఆంధ్రప్రభ

Estd 1938

www prabhanews com

Journalism first!



సంపుటి: 56 • సంచిక: 121 • శుక్రవారం 11 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ చవితి రా. 10.45 వరకు; అనంతరం పంచమి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 6.12 వరకు; అనంతరం ఉత్తరాభాద్ర; అమృతకాలం: రా. 1.25 నుండి 3.00 వరకు; వర్జ్యం: మ. 3.48 నుండి 5.23 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుండి 9.08 వరకు; మ. 12.32 నుండి 1.23 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 3.00 నుండి 4.30 వరకు

"నాగార్జున సాగర్ జలకళతో వైష్ణవ ఆలయంలాగా కళకళలాడుతుంటే... ఎస్సారెస్పీ మాత్రం ఆలనా పాలనా లేని శివాలయం లాగా వెలవెలపోతున్నది"

ఎస్సారెస్పీ పునరుజ్జీవం నా రెండు దశాబ్దాల కల


ఎస్సారెస్పీ పునరుజ్జీవానికి శ్రీకారం

నా జన్మ ధన్యమైంది

సీఎం కేసీఆర్ భావోద్వేగం


బహిరంగ సభకు హాజరైన అశేష ప్రజానీకం

జనసంద్రమైన పోచంపాడ్

భారీగా తరలివచ్చిన ఆయకట్టు రైతాంగం

15కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్ ఇబ్బందులపై సీఎం ఆగ్రహం

25 నిమిషాల్లోనే ప్రసంగం ముగింపు

ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి కేటీఆర్

అడుగడుగునా అడ్డుతగులుతున్న కాంగ్రెస్ నేతలను నిలదీయండి


ప్రజలకు సీఎం కేసీఆర్ పిలుపు

• ఉత్తర తెలంగాణలో నాలుగు సజీవ జీవధారలు సృష్టిస్తాం • మహిళలందరికీ వడ్డీలేని రుణాలిస్తాం • వేసవి నుంచి రైతులందరికీ 24 గంటల పాటు త్రీఫేజ్ కరెంటిస్తాం • పోచంపాడు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు

(పోచంపాడు నుండి ఆంధ్రప్రభ ప్రతినిధి)

ప్రజల బతుకులు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రగతి ప్రాజెక్టులకు కేసులు వేసి అడుగడుగునా అడ్డుపడుతున్న కాంగ్రెస్ నాయకులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. గురువారం నిజామాబాద్ జిల్లా బాల్కొండనియోజకవర్గంలోని పోచంపాడు వద్ద ఎస్సారెస్పీ పునరుజ్జీవపథకానికి శంఖుస్థాపన చేసిన ఆయన ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ నాయకులు టిఆర్ఎస్ ప్రభుత్వం చేసే పనులకు అడ్డుతగులుతూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. సుందిళ్ళ, అన్నారం ఇలా అన్ని బ్యారేజీలపై కేసులు వేశారని, పాములపర్తి దగ్గర తాము కొండపోచమ్మసాగర్ మొదలుపెడితే 99శాతం భూసేకరణ జరిగినంక కూడా కేసు వేయించారన్నారు. 4,600ఎకరాల భూసేకరణ అవసరమైన ప్రాజెక్టులో 4,510ఎకరాల భూసేకరణ జరిగిందని, మిగిలిన 90 ఎకరాలు అక్కడి కాంగ్రెస్ నాయకులవి అన్నారు. హైదరాబాద్ నుండి ఆ నాయకులకు భూములియ్యవద్దని ఫోన్‌చేసి దానిపై కేసులు వేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లెక్కలేనన్ని కేసులు వేశారని, 20రోజుల్లోనే ఆరు కేసులు వేవారంటే.. వీటి వెనుక జరుగుతున్న కుట్రను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

శ్రీరాంసాగర్ పునరుజ్జీవన ప్రాజెక్టుతో తన జన్మధన్యమైందని, ఇలాంటి అదృష్టం ఎవరికీ రాదని ముఖ్యమంత్రి కెసిఆర్ ఉద్వేగంగా అన్నారు. 1996లో తాను, గుత్తాసుఖేందర్ రెడ్డి కలిసి ఎస్సారెస్పీ కట్టను సందర్శించామని, ఆ సమయంలో కట్ట పరిస్థితిని చూసి తాను తీవ్ర ఆవేదన చెందానన్నారు. ఆంధ్రాపాలకులు ఏం చేసినా తమ ప్రయోజనాలు ఆశించి చేశారు తప్ప తెలంగాణ ప్రాజెక్టులపై ప్రేమతో కాదన్నారు. ఆంధ్రావాళ్ళకు ⇨ 2వ పేజీలో...



పచ్చదనంలో నంబర్ వన్

రెండేళ్లలో 54.97 కోట్ల మొక్కలు నాటిన తెలంగాణ

7.53 హెక్టార్లలో కొత్తగా మొక్కలు నాటిన ఏకైక రాష్ట్రం 10

డోక్లాం-సిక్కిం సరిహద్దుల్లో గ్రామస్తుల తరలింపు

8లో

నేరెళ్ల ఘటనలో ఎస్ఐ రవీందర్ అత్యుత్సాహమే కారణం



10

డీజీ నివేదికతో సస్పెన్షన్

రామగుండం ఫ్యాక్టరీకి రిలయన్స్ గ్యాస్

హైదరాబాద్‌లో సహజ వాయువు సరఫరాకు రూ.500 కోట్లు • బీజేపీ నేతల భేటీ తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటన • కేంద్ర మంత్రులతో తెలంగాణ బీజేపీ నేతల వరుస భేటీలు 3

కలవని దారులు!

నిష్క్రమిస్తూ...అన్సారీ నిష్ఠూరాలు

ఆగమేఘాల మీద వెంకయ్య ఖండన మండనలు

"భారత దేశంలోని మైనారిటీలలో అభద్రతా భావం పెరిగింది. ఇక్కడ వారు నివసించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇతరుల అభిప్రాయాలను ఆమోదించడమనే ప్రవృత్తి ఎక్కడా కనిపించడం లేదు."

– ఉపరాష్ట్రపతిగా ఆఖరి రోజున టీవీ చానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హమీద్ అన్సారీ

"భారత దేశంలో ముస్లింలకు అభద్రత అనేది రాజకీయ అవసరాల కోసం మాట్లాడే మాట. మైనారిటీలు అభద్రతా భావంతో ఉన్నారని కొందరు అంటున్నారు. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లోనే మైనారిటీలకు వారికి దక్కాల్సింది దక్కుతోంది."

– ఉపరాష్ట్రపతిగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్న వెంకయ్యనాయుడు

హన్సారీ మనోభావాలు - ఎడిట్ పేజీలో


న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన హమీద్ అన్సారీకి వీడ్కోలు సభలో కొత్త ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఔరా..!



బేగంపేట మానవబాంబు పేలుడు కేసులో ఆధారాల్లేవ్

9 మంది నిందితులు నిర్దోషులే

కేసు కొట్టేసిన నాంపల్లి కోర్టు

పన్నెండేళ్ల తర్వాత తీర్పు

ఇన్నేళ్లు జైల్లో ఉన్నవారికి మీరేం చెబుతారు? • అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్న 3లో


తీర్పు తర్వాత 'థ్యాంక్ గాడ్' అంటూ నేలతల్లికి నమస్కరిస్తున్న నిందితుడు


కార్పొరేట్ స్థాయిలో గాంధీ ఆసుపత్రి

నా ట్రీట్‌మెంట్ ఇక ఇక్కడే

ఇది పేదలది మాత్రమే కాదు...

అందరి ఆసుపత్రి: గవర్నర్ నరసింహన్ • ఆధునిక సౌకర్యాల పరిశీలన 3లో


గాంధీ ఆస్పత్రిలో ఆధునిక మార్పులను అడిగి తెలుసుకుంటున్న గవర్నర్



బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

సాగునీటి రంగంలో మరో చరిత్రకు నాంది పడింది. గోదావరి నీరు కరువై వెలవెలబోతున్న శ్రీరాంసాగర్‌కు పూర్వవైభవం తీసుకువచ్చే బృహత్తర పథకానికి మైలురాయి పడింది. ఉనికిని కోల్పోతున్న బహుళార్థ సాధక ప్రాజెక్టుకు ఇకపై మంచి రోజులు రానున్నాయి. కాళేశ్వరం నుంచి గోదావరి, ప్రాణహిత నీటిని ఎగువ ప్రాంతానికి మళ్లించి శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పునర్జన్మనిచ్చే మహత్తరమైన శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం శంకుస్థాపన చేశారు. సాంప్రదాయ బద్ధంగా సరిగ్గా 11గంటల 5 నిమిషాలకు పైలాన్ ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. రూ.1061కోట్ల వ్యయంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 60టిఎంసీల నీటిని మళ్లించేందుకు నిర్మిస్తున్న రివర్స్ పంపింగ్ పనులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. గెస్ట్‌హౌజ్ నుంచి ప్రత్యేక వాహనంలో శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌లోని వరదకాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద నిర్మించిన పైలాన్ వద్దకు ముఖ్యమంత్రి చేరుకున్నారు. పూజ కార్యక్రమాలను వేదపండితుల సమక్షంలో నిర్వహించి పనులను ప్రారంభించారు. స్వయంగా ముఖ్యమంత్రే గడ్డపారాతో మట్టిని తవ్వి పారతో తీసి పునరుజ్జీవ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక వాహనంలో బయలు దేరిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టు కట్టపై నుంచి పైలాన్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడికి వెళ్తున్నంత సేపు ప్రాజెక్టును ముఖ్యమంత్రి ఆసాంతం పరిశీలించారు. మంత్రి హరీష్‌రావు, ఎంపీ కవిత, జిల్లా మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డిలు పూజలో పాల్గొని పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ నాటికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వచ్చే విధంగా వేగంగా పనులు జరపాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులకు అక్కడే ఆదేశాలను, సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రులు మహమూద్‌అలీ, కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, నాయిని నర్సింహరెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జోగురామన్న, రాజ్యసభ సభ్యులు డి.శ్రీనివాస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నేతలను నిలదీయండి

మీ ఆశీర్వాదం ఉన్నంతవరకు బ్రహ్మాండంగా ముందుకు పోతా...

నా జన్మ ధన్యమైంది

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగపడే నాగార్జునసాగర్ ప్రాజెక్టు వైష్ణవాలయంలా, తెలంగాణ ప్రాజెక్టులు కట్టలు సరిగా లేక.. గేట్లు సిలుం పట్టి ఆలనా పాలనాలేని శివాలయాల్లా ఉన్నాయని, తెలంగాణ వస్తేనే ఈ పరిస్థితి మారుతుందని అపుడే అన్నానన్నారు. తాను బతికుంటే.. దేవుడు సహకరిస్తే ఖచ్చితంగా అందుకు నేనే నాయకత్వం వహిస్తానని చెప్పానని, ఆ కట్టమీద తీసుకున్న దీక్ష.. తర్వాత కార్యరూపం దాల్చి ముఖ్యమంత్రి హోదాలో దానిని బాగుచేసుకునే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. ఈ పునరుజ్జీవన పథకంతో తన జన్మ ధన్యమైందన్నారు. తెలంగాణ రాగానే.. ముందుగా తక్కువ వ్యయంమె, పెద్దగా డిజైన్లు అవసరం లేని మిషన్ కాకతీయ పథకం చేపట్టామని, ఆరు నుండి..8మాసాలు కష్టపడి తర్వాత ప్రాజెక్టులను తెలంగాణ ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు.

నాలుగు జీవధారలు

హైదరాబాద్ నుండి ఉత్తరం వైపు చూస్తే నాలుగు జీవధారలు కనిపించాలని, అందుకోసమే తన తపనన్నారు. ఆదిలాబాద్ తెలంగాణ కాశ్మీరమని, ఇప్పటికే సుద్దవాగు, వట్టివాగు, స్వర్ణవాగు వంటి పలు వాగులతో పాటు లోయర్ పెన్‌గంగ కూడా చేపట్టామని..వీటితో ఆ పూర్వ జిల్లాకు ఢోకా ఉండదన్నారు. ఎస్సారెస్పీతో నిర్మల్, మంచిర్యాల ప్రాంతాలు సస్యశ్యామలమవు తాయన్నారు. వీటితో ఆదిలాబాద్ జీవధారగా మారుతుందన్నారు. గోదావరి నదిమీద నిర్మించే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ, తుపాకులగూడెం, తదితర బ్యారేజీలతో 70 నుండి 80టిఎంసిల నీరు ఎల్లపుడూ నిల్వ ఉండి 200కిమీ మేర గోదావరి సజీవంగా ఉంటుందన్నారు. గోదావరి దాటితో వరదకాల్వ ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిజామాబాద్ నుండి మహబూబాబాద్, తుంగతుర్తి దాకా మరోవైపు సస్యశ్యామలం అవుతాయన్నారు. మిడ్‌మానేరు, లోయర్‌మానేరు, రంగనా యకసాగర్, సింగూరు, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్, బస్వాపూర్, నిజాంసాగర్ వీటి ద్వారా ఇంకో జీవధార ప్రవహిస్తుందన్నారు. ఇవన్నీ సాకారం చేసేందుకు, భవిష్యత్తును అద్భుతంగా మార్చేందుకు శ్రమిస్తున్నామన్నారు. పోచంపాడును సినిమా షూటింగ్‌లు జరుపుకునేవిధంగా అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఎండ ఇసిరిఇసిరి కొడుతున్నా...

ఇయ్యాల ఎండ ఇసిరి..ఇసిరి కొడుతున్నా.. ఓపికగా శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం శంఖుస్థాపన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారని, ప్రజల ఆశీర్వాదం ఉంటే తాము బ్రహ్మాండంగా ముందుకుపోతామని సిఎం కెసిఆర్ అన్నా రు. ఎస్సారెస్పీ ఎన్నడూ 5లక్షల ఎకరాలకు మించి పారలేదని, కాల్వలు తవ్వి కాంట్రాక్టర్లు డబ్బులు తీసుకున్నారే రైతుల పొలాలకు నీళ్ళు రాలేదన్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టు బ్రహ్మాం డంగా బాగుపడాలన్నారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్‌లో ఇప్పటికే నిల్వ ఉన్న 8టిఎంసిల నీరు మాత్రమే ఉందని, ఈ ఏడాది చుక్క నీరు కూడా ప్రాజెక్టులోకి రాలేదన్నారు. ఈ దుస్థితి పోగొట్టాలనే కాళేశ్వరం నుండి రివర్స్ పంపింగ్ ద్వారా ఈ పథకానికి శ్రీకారం చుట్టానన్నారు. ఎస్సారెస్పీకి 54ఏళ్ళ క్రితం పునాదిరాయి పడితే ఇప్పటికీ స్టేజ్-1, స్టేజ్-2, వరదకాల్వ ఏదీ సరిగాలేదని, అదే నాగార్జునసాగర్‌ను 12ఏళ్ళలో పూర్తిచేసుకున్నారన్నారు. తాము చేపట్టిన ఈ పథకం ద్వారా ఎస్సారెస్పీ ఎపుడూ నిండుగా ఉంటుందన్నారు. బాల్కొండ కింద మెట్‌పల్లి, దానికింద ఉన్న వేములవాడ, దానికింద ఉన్న మానకొండూరు నియోజకవర్గాలు కలిపి మొత్తం 110కిమీ ఎపుడూ నిండునీటితో వరదకాల్వ కళకళలాడుతూ ఉంటుందని, 365రోజులూ ఇదే పరిస్థితి ఉంటుందన్నారు.

వరదకాల్వను జలాశయంగా మారుస్తూ.. శ్రీరాంసాగర్ పనులు చేపడుతున్నామన్నారు. మోతె గ్రామం పెట్టిన మొగ్గను తానని, వచ్చే ఏడాది శ్రీరాంసాగర్ ప్రాజెక్టును కాళేశ్వరం నీళ్ళతో నింపుతామన్నారు. జూన్ నుండి ఆగస్టులోగా ప్రాజెక్టులోకి నీరు నింపుతామని, ఆ తర్వాత నుండి ఫిబ్రవరిలోనే 90టిఎంసిల సామర్థ్యం గల ప్రాజెక్టును పూర్తిగా ముందే నింపి పెడతామన్నారు. శ్రీరాంసాగర్ ద్వారా నిజామా బాద్, నిర్మల్, సూర్యాపేట, నల్గొండ, తుంగతుర్తి దాకా నీరు చేరుతందన్నారు.



సీఎంను సన్మానిస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

24గంటలు.. త్రీఫేజ్ కరెంట్

రైతాంగానికి వేసవి నుండి 24గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ ఇస్తామని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. 35ఏళ్ళ కరెంట్ గోస రెండేళ్లలోనే తీర్చామన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు త్వరలోనే అందిస్తామన్నారు. సభకు మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి అధ్యక్షత వహించగా, డిప్యూటీసిఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు ఈటల రాజేందర్, హరీష్ రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మహేందర్ రెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు

ట్రాఫిక్‌లో మంత్రి కేటీఆర్

- సెల్ఫీలు దిగిన అభిమానులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్‌లో చిక్కు కన్నారు. నిజామాబాద్ జిల్లా పోచంపాడులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవన్ కార్యక్రమానికి శంకుస్థాపన అనంతరం సీఎం కేసీఆర్ బహిరంగ సభలకు వెళ్ళే వాహనాలతో ఆ రహదారులన్నీ రద్దీగా మారాయి. సభాస్థలికి వెళుతున్న కేటీఆర్ వాహనం అక్కడి ట్రాఫిక్‌లో చిక్కుకుంది. ఈ పరిస్థితుల్లో చివరకు కేటీఆర్ సభాస్థలికి చేరుకోలేకపోయినట్టు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కేసీఆర్ సభకు వెళుతున్న జనం కేటీఆర్ వాహనాన్ని గుర్తించి ఆయనకు షేక్‌హ్యాండ్స్ ఇస్తూ సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు.



ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం

- నిజామాబాద్ ఎంపీ కవిత..

శ్రీరాంసాగర్ పునరుజ్జీవనం పథకం ద్వారా ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలం గాణ ప్రాజెక్టులను అప్పటి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆమె విమర్శించారు. జగిత్యాల నుంచి పోచంపాడు వద్ద జరిగే పునరుజ్జీవన సభకు ట్రాక్టర్ల ద్వారా రైతులు వెళ్లారు. ఈ ట్రాక్టర్ల ర్యాలీని ఎంపీ కవిత జెండా ఊపి ప్రారం భించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పునరు జ్జీవన సభను విజయవంతం చేసేందుకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల ఐదు జిల్లాల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. రైతు లకు సాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. సర్కార్ తీసుకున్న నిర్ణయంతో రైతులకు మంచి రోజులు వస్తున్నాయన్నారు. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నిమోజక వర్గాల నుంచి పెద్ద ఎత్తున రైతులు వస్తున్నట్లు తెలిపారు.



ఎస్సారెస్పీ పైలాన్ వద్ద ఎంపీ కవిత సెల్ఫీ

శంకుస్థాపనకు కాళేశ్వరం జలాలు

- ప్రత్యేక పూజలు చేసి తీసుకెళ్లిన మంథని ఎమ్మెల్యే మధు



మహాదేవపూర్, కెఎన్ఎన్: తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పోచంపాడు పునరు జ్జీవ శంకుస్థాపన పనులను తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రారంభించనున్న సంద ర్భంగా. ఆ పనుల ప్రారంబోత్సవానికి మూడునదులు కలయికైన త్రివేణీ సంఘమ గోదావరి నది జలాలను గురువారం మంథని ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీసు కెళ్లారు. వేదపండితులతో గోదావరి మాతకు ప్రత్యేక పూజ లు నిర్వహించిన అనంతరం కలశాలల్లో నది జలాలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం కాళేశ్వరం నది జలాలతో శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి అభిషేకించే పవిత్ర జలాలతో ఉత్తర తెలంగాణను ఆకుపచ్చ తెలంగాణగా మార్చే ప్రాజెక్టు పనులను ప్రారంభించడనికి తీసుకుపొవడం ఎంతో సంతోషం అన్నారు. ఆ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి ఆశీష్యులు కూడా ప్రాజెక్టు పనులు పై ఉండి త్వరితగతిన పూర్తి కవాలని ఆకాంక్షించ్చారు.

'ట్రాఫిక్'పై సీఎం సీరియస్

నిజామాబాద్, కెఎన్ఎన్ బ్యూరో : ఒక భృహత్తర కార్యానికి శ్రీకారం చుడుతున్న వేళ ఎన్నో ఆశలు, అంచనాలతో గురువారం తలపెట్టిన భారీ బహిరంగ సభకు ఆశించిన మేరకు జనసమీకరణ నిర్ణీత సమయానికి రాకపోవడం టీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా సభ మొదలవ్వడానికి రెండు గంటల ముందు తలెఎత్తిన ట్రాఫిక్ ఇబ్బందులపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 11 గంటల నుంచే రైతులు పోటెత్తారు. అంతా అనుకున్నట్లే జనసమీకరణ జరుగుతుందని టీఆర్ఎస్ వర్గాలు సంబరపడ్డాయి. కానీ పైలాన్ ఆవిష్కరణ తర్వాత ముఖ్యమంత్రి గెస్ట్‌హౌస్ చేరుకుని భోజనం చేశాక 1 గంటకు గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన సభా వేదికకు రావాల్సి ఉంది. ఆ మేరకు ముఖ్యమంత్రి తన కార్యాచరణను రూపొందిం చుకు న్నారు. కానీ 12 గంటల ప్రాంతంలో మొదలైన ఇబ్బందులు ఏకంగా ముఖ్య మంత్రి దృష్టికి వెళ్లాయి. వందలాది వాహనాలు పోచంపాడ్ క్రాస్‌రోడ్డుకు ఇరువైపుల నిలిచిపోయి ముందుకు కదలలేని పరిస్థితిలో ఉన్నాయని తెలుసుకున్న ముఖ్యమంత్రి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాదిగా రైతులు తరలివస్తారని ముందే తెలిసినా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయక పోవడంపై టీఆర్ఎస్ వర్గాలు సైతం నిప్పులు కక్కుతున్నాయి. అందుకే ముఖ్య మంత్రి సభా వేదికకు నిర్ణీత సమయానికన్నా గంటన్నర ఆలస్యంగా వచ్చారు. ట్రాఫిక్‌లో చిక్కుకపోవడంతో వేలాది మంది రైతులు సభా ప్రాంగణానికి చేరుకోలేకపోతున్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి వారి కోసం గంట పాటు గెస్ట్‌హౌజ్‌లోనే ఆగిపోయారు.

కేసీఆర్ మహత్తర ఆలోచనే...


ఎస్సారెస్పీ పునరుజ్జీవం



ఆంధ్రప్రభ ప్రతినిధి, ఉత్తర తెలంగాణ : బృహత్తరమైన శ్రీరాంసాగర్‌ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకురావాలన్న కెసీఆర్ ఆలోచనల పుట్టిన మహత్తరమైన పథకం ఎస్సారెస్పీ పునరుజ్జీవం అని రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరూ హరీష్‌రావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాన్ని భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి మీ అందరి ముందు ప్రమాణం చేసి చెబుతున్నా.. తప్పకుండా రాత్రింబవళ్లు పని చేసి12 నెలల్లో పునరుజ్జీవ పథకం పూర్తి చేసి ఎస్సారెస్పీకి నీళ్లు తీసుకువచ్చి మీ అందరి రుణం తీర్చుకుంటామని హరీష్‌రావు అన్నారు. నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లోని శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు వద్ద గురువారం ముఖ్యమంత్రి కెసీఆర్ పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. సమైఖ్య పాలనలో తెలంగాణ ప్రాజెక్టులు తీవ్ర నిర్లక్ష్యానికి, వివక్షకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అత్యంత వివక్ష గురి కావడం వల్లనే ఏ ఒక్క సంవత్సరం కూడా పూర్తి ఆయకట్టుకు నీరందించలేని దుస్థితికి చేరిందన్నారు. ముఖ్యమంత్రి కెసీఆర్‌కు సాగునీటి రంగంపై పూర్తి పట్టు ఉండడంతోనే తెలంగాణ ప్రాజెక్టులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నారని మంత్రి హరీష్‌రావు అన్నారు. తెలంగాణ వచ్చిందంటే ఏం లాభమని అనేక మంది ప్రశ్నించారని, తెలంగాణ వచ్చింది పునరుజ్జీవ పథకాలతో ప్రతి గుంటకు సాగునీరు అందించేందుకని ప్రత్యక్షంగా ప్రజలు చూస్తున్నారని చెప్పారు. రైతు బిడ్డగా, ఉద్యమనేతగా తెలంగాణ ప్రజల కష్టనష్టాలు తెలిసిన కెసీఆర్ ముఖ్యమంత్రి కావడం వల్లనే మూడేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో, సంక్షేమ పథకాలలో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని హరీష్‌రావు స్పష్టం చేశారు. పునరుజ్జీవంతో పోచంపాడ్ ప్రాజెక్టుకు ప్రాణం పోయడమంటే ఉత్తర తెలంగాణ రైతుల ఊపిరిని నిలబెట్టినట్లేనని అన్నారు. ఈ సభలో ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, హోంమంత్రి నాయిని నర్సింహరెడ్డి, వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అటవీ మంత్రి జోగు రామన్న, ఎంపీ కవిత, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సీఎం సభలో సర్పంచ్ హల్‌చల్

- రోడ్డు వేయాలని సీఎం కటౌట్ ఎక్కిన సర్పంచ్



నిర్మల్, కెఎన్ఎన్ : నిజామాబాద్ జిల్లా, పోచంపాడ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తుండగానే నిర్మల్ జిల్లాలోని కడెం మండలం గంగాపూర్ గ్రామ సర్పంచ్ చంద్రహాస్ సీఎం కేసీఆర్‌కటౌట్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా సభా ప్రాంగణం గందరగోళంలో పడిపోయింది. హుటాహుటీనా పోలీసులు మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి కేసీఆర్ కటౌట్ వద్దకు చేరుకుని సర్పంచ్‌ను కిందికి దిగాలని అడుగగా, సర్పంచ్ చంద్రహాస్ తాను గ్రామసర్పంచ్‌గా ఎంపికై మూడున్న ర సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటి వరకు తమ గ్రామంలో ఒక్కరోడ్డు కూడా మంజూరీ చేయలేదని, గ్రామంలో తలెత్తుకుని తిరుగలేక పోతున్నానని తన ఆవే దన వ్యక్తం చేశారు. సీఎం జోక్యం చేసుకుని రోడ్డు వేస్తానని హామీ నిస్తేనే కిందికి దిగుతానని చెప్పడంతో వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్యమంత్రికి చెప్పి రోడ్డు వేయిస్తామని హామీనివ్వడంతో పోలీసుల సహకారంతో చంద్రహాస్ కిందికి దిగాడు.

సభకు వెళ్లివస్తూ వ్యక్తి మృతి

నిజామాబాద్ అర్బన్, కెఎన్ఎన్ : ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన బహిరంగ సభకు వెళ్లి తిరుగు ప్రయాణంలో అంకాపూర్ వద్ద లారీ ముందు చక్రం విరిగి ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం బాల్కొండ మండలం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వర్ని మండలం శంకోరా గ్రామానికి చెందిన రైతులు లారీలో వెళ్లి తిరుగు ప్రయాణంలో అంకాపూర్ వద్ద లారీ ముందు చక్రం విరిగడంతో చందర్ అనే రైతు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

పోచంపాడ్..జనసంద్రం

- 15 కి.మీ.మేర స్తంభించిన ట్రాఫిక్
- రంగంలోకి దిగిన నాయిని.

ట్రాఫిక్ కంట్రోల్ చేసిన హోంమంత్రి

ఆంధ్రప్రభ ప్రతినిధి, ఉత్తర తెలంగాణ : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శ్రీరాంసాగర్ పునరుజ్జీవ కార్యక్రమానికి జనం భారీగా తరలివచ్చారు. బహుళార్ధక ప్రాజెక్టు ముందు ఏర్పాటు చేసిన సభ ప్రాంగణం జనసంద్రంగా మారింది. అంచనాలకు మించి ఆయకట్టు రైతాంగం ఎంతో ఆశతో పోచంపాడ్‌కు ఉదయం 11 గంటలలోపే భారీగా తరలివచ్చారు. ఉత్తర తెలంగాణ అవిభక్త జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్‌తో పాటు రంగారెడ్డి, మెదక్ జిల్లాల నుండి వాహనాలలో తరలివచ్చారు. సభ ప్రాంగణం మొత్తం మధ్యాహ్నం 12 గంటలకు నిండిపోయింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక రోజు ముందుగానే బుధవారం సాయంత్రం 5న్నరకు పోచంపాడ్ గెస్టు హౌజ్‌కు చేరుకున్నారు. దీంతో సమయం ప్రకారం కార్యక్రమాలను చేపట్టారు. 10.30 నిమిషాలకే అతిథిగృహం నుండి పైలాన్ ఆవిష్కరణకు ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్లారు. సరిగ్గా 2. 15 నిమిషాలకు సభాస్థలికి చేరుకున్నారు. అప్పటికే సభ ప్రాంగణం ప్రజలతో కిక్కిరిసిపోయింది. అంచనాలకు మించి ప్రజలు రావడంతో పోలీసులకు ట్రాఫిక్ కంట్రోల్ చేయడం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. స్థానికంగా ఒక్క బాల్కొండ నియోజకవర్గం నుండే 60 వేలకు పైగా ప్రజలు హాజరైనట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న గ్రామాభివృద్ధి కమిటీలు, రైతు సంఘాలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. 3 గంటలకే ముఖ్యమంత్రి ప్రసంగం పూర్తికాగా జనాలు తిరుగు ప్రయాణం చేపట్టారు.దీంతో జాతీయ రహదారి 44పై పోచంపాడ్ నుండి బాల్కొండ దాటి 15 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

ఇదిలా ఉంటే ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ఏకంగా హోం మంత్రి నాయిని నర్సింహరెడ్డి రంగంలోకి దిగాల్సి వచ్చింది. సుమారు గంటకు పైగా నాయిని నర్సింహరెడ్డి ట్రాఫిక్‌ను నియంత్రిస్తు వాహనాలను పంపించారు. హోం మంత్రి స్వయంగా రంగంలోకి దిగడంతో పోలీసులు ఒక్కసారిగా బిత్తరపోవాల్సి వచ్చింది.

'రామగుండం'కు రిలయన్స్ గ్యాస్

• హైదరాబాద్‌లో సహజ వాయువు సరఫరాకు రూ.500కోట్లు • బీజేపీ నేతలతో భేటీ అనంతరం ధర్మేంద్ర ప్రదాన్ • పలువురు కేంద్రమంత్రులతో రాష్ట్ర బీజేపీ నేతల వరుస భేటీలు • రాష్ట్ర ప్రాజెక్టులు, సమస్యలపై మంతనాలు • తెరాస ప్రభుత్వంపై కేంద్రానికి ఫిర్యాదులు



కేంద్రమంత్రి సురేష్‌ప్రభుకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర బీజేపీ నేతలు డా.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, మురళీధర్‌రావు, చింతల తదితరులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణ బీజేపీ నేతల బృందం హస్తినబాట పట్టింది. వరుసగా నలుగురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులు, సమస్యలు, పెండింగ్ అంశాలపై చర్చించింది. కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ నేత త్వంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డా. లక్ష్మణ్, శాసన సభ పక్ష నేత కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్ర రావు, సీనియర్ నేతలు బద్దం బాల్ రెడ్డి, నల్లు ఇంద్రసేనా రెడ్డి తదితర ప్రతినిధుల బృందం తొలుత కేంద్ర ఎరువులు మరియు రసాయనాల శాఖ మంత్రి అనంత్ కుమార్‌ను కలిసింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ విషయంలో ఆయనకు కృతజ్ఞతలు తెలిపి, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల ఎరువుల అవసరాలు తీర్చేలా అక్కడ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ నేతలు కోరారు. అలాగే నిరుపేదలు, సామాన్యులకు అందుబాటులో లేని ఔషధాల ధరలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ వ్యాప్తంగా జన్ ఔషధి స్టోర్లను మంజూరు చేయాల్సిందిగా కేంద్ర మంత్రిని కోరారు. దీంతో పాటు హైదరాబాద్ నగరంలోని ఐడీపీఎల్ సంస్థ ఆధీనంలో ఉన్న 900 ఎకరాల స్థలంలో కొంత భాగాన్ని రహదారిగా వినియోగించుకునేందుకు అవకాశమివ్వాలని కోరారు.

అనంతరం రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభును కలిశారు. హైదరాబాద్ నగరంలో ఎంఎంటీఎస్ 2వ దశతో పాటు పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. సికింద్రాబాద్ - కాజీపేట ట్రిప్లింగ్, సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ డబ్లింగ్, రాఘవాపురం - మందమర్రి ట్రిప్లింగ్ వంటి కొత్త ప్రతిపాదనలను ఆయన ముందుంచారు. అలాగే 2016-17 బడ్జెట్లో ప్రతిపాదించిన వరంగల్ రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త లైన్ల ప్రతిపాదనల్లో మణుగూరు - రామగుండం, మాచర్ల - నల్లగొండ, భద్రాచలం రోడ్ - సత్తుపల్లి, అక్కన్నపేట - మెదక్, కొండపల్లి - కొత్తగూడెం, భద్రాచలం రోడ్ - కొవ్వూరు వంటి పనులున్నాయి. పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని సురేష్ ప్రభు అధికారులను ఆదేశించారు. అలాగే త్వరలో తెలంగాణ రాష్ట్రప్రాజెక్టుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

ఉజ్వల పథకాన్ని ప్రారంభించాలి

తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అయితే తెలంగాణలో ఇప్పటికే 90 శాతం వంట గ్యాస్ వాడకం ఉందని, హైదరాబాద్‌లో పూర్తిగా వంట గ్యాస్ వినియోగిస్తున్నారని మంత్రి వారికి వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా వంట చెరకుపైనే ఆధారపడ్డవారు ఉన్నారని బీజేపీ నేతలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అలాగే హైదరాబాద్ నగరంలో సహజవాయు సరఫరా కోసం ఏర్పాటు చేసిన భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్‌ను మరింత విస్తరించాలని కోరారు. సహజవాయు పైప్ లైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై స్పందించిన మంత్రి రూ. 500 కోట్లతో హైదరాబాద్ నగరంలో సహజవాయు పంపిణీ పనులను విస్తరిస్తామని తెలిపారు. సెప్టెంబర్ నెలలోనే హైదరాబాద్ వచ్చి ఉజ్వల పథకాన్ని ప్రారంభించడంతో పాటు, సహజవాయు సరఫరాకు సంబంధించిన విస్తరణ పనులను చేపడతామని తెలిపారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ క్షేత్రాల నుంచి సహజవాయువును తరలిస్తున్న రిలయన్స్ పైప్‌లైన్ నుంచి రామగుండం ఎరువుల కర్మాగారానికి అవసరమైన గ్యాస్ అందజేస్తామని ప్రధాన్ తెలిపారు.

ప్రీమియం లేక పంట బీమా లేదు

ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అనంతరం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఆయనకు ఫిర్యాదు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి తెలంగాణ రైతులు నోచుకోలేకపోతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. భేటీ అనంతరం రాధామోహన్ సింగ్, లక్ష్మణ్ ఇద్దరూ మీడియాతో మాట్లాడారు.


పంట బీమా పథకాన్ని మరింత సరళతరం చేసి, పరిధిని పెంచినప్పటికీ రైతులు వినియోగించుకోలేకపోతున్నారని లక్ష్మణ్ అన్నారు. బీమా సంస్థలకు అటు కేంద్రం, ఇటు రైతులు ప్రీమియం చెల్లిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద చెల్లించాల్సిన ప్రీమియం చెల్లించకపోవడం వల్లనే బీమా ప్రయోజనాలు అందడం లేదని అన్నారు. దీనిపై కేంద్ర మంత్రి రాధామోహన్ సింగ్ మాట్లాడుతూ తాను రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని అన్నారు. అలాగే తెలంగాణాలో కూడా మట్టి పరీక్షలు నిర్వహించి సాయిల్ హెల్త్ కార్డులు అందజేస్తామని అన్నారు. సాయిల్ హెల్త్ కార్డుల విషయంలోనూ తెలంగాణ వెనుకబడి ఉందని గ్రహించిన ఆయన, ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

భారత్‌లో ముస్లింల అభద్రత ఒట్టిమాట



న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతిగా హమీద్ అన్సారీ ఆఖరి రోజున రాజకీయ వివాదానికి ఆయన తెరతీసారు. పదేళ్లపాటు పదవిలో ఉన్న అన్సారీ ఎన్నడూ ముస్లింల అభద్రతా భావం గురించి మాట్లాడలేదు. ఉపరాష్ట్రపతి పదవికి కాంగ్రెస్, బీజేపీలు గోపాలకృష్ణగాంధీ, వెంకయ్యనాయుడును నిలబెట్టినప్పుడూ ఆయన మౌనంగానే ఉన్నారు. తీరా పదవిలో ఆఖరి రోజున టీవీ చానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మైనారిటీలు అభద్రతా భావంతో ఉన్నారని, భారత్‌లో నివసించడానికి ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గతంలో ఇదే అన్సారీ ముస్లింలకు రిజర్వేషన్లపై స్పందిస్తూ, రిజర్వేషన్లు కోరితే వారు ఎదగడానికి అవకాశం ఉండదని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి ఇప్పుడిలా మాట్లాడడం పూర్తిగా రాజకీయ అవసరాల కోసమేనని విమర్శకుల భావన. శుక్రవారమే పదవీ బాధ్యతలు స్వీకరించనున్న వెంకయ్యనాయుడు అన్సారీ పేరు ప్రస్తావించకుండానే ఆయన వ్యాఖ్యలను ప్రస్తావించి, దానిని రాజకీయ ప్రచారంగా కొట్టిపారేసారు. హమీద్ అన్సారీ తమ ప్రత్యర్థి పార్టీ మనిషని చెప్పకనే చెప్పారు. పైగా ప్రపంచంలోని చాలా దేశాలకంటే భారత్‌లోనే మైనారిటీలు సంతోషంగా ఉన్నారని, వారికి దక్కాల్సింది దక్కుతోందని వ్యాఖ్యానించారు. అన్సారీ వ్యాఖ్యలపై వీహెచ్‌పీ నేరుగానే స్పందించింది. అన్సారీ వ్యాఖ్యలు రాజకీయమేనని విమర్శించింది. బీజేపీ నేత షానవాజ్ హుస్సేన్, ముస్లిములకు భారత్‌కంటే గొప్ప దేశమూ, హిందువుల కంటే పెద్ద మిత్రులూ ఉండరని అన్నారు. ఇటీవల జరుగుతున్న గో హత్యపై వ్యతిరేకత, గోవుల కోసం మనుషులను కొట్టి చంపడం వంటి విషయాలపై అన్సారీ అభిప్రాయాన్ని ఒక టీవీ చానల్ విలేకరి అడగ్గా, అన్సారీ మైనారిటీల అభద్రతా భావం గురించి వ్యాఖానించారు. దక్షిణ, ఉత్తర భారత దేశాల్లో తాను మైనారిటీల అభద్రతా భావం గురించి తనకు వార్తొస్తున్నాయని అన్సారీ చెప్పారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు ప్రీతీ గాంధీ కూడా మాట్లాడారు. హిందువులు మెజారిటీ ఉన్న దేశంలో అన్సారీని పదేళ్ల పాటు ఉపరాష్ట్రపతిగా కూర్చోబెట్టారని ఆయన గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించారు. అయితే.. అన్సారీ ఈ సందర్భంగా ముస్లిములకు ఒక సలహా కూడా ఇచ్చారు. కాల, మాన, పరిస్థితులను బట్టి వ్యవహరించాలని అన్నారు. బాగా చదువుకుంటే పోటీ తత్వం అలవర్చుకుంటే ఆటంకాలను అధిగమించచ్చని చెప్పారు.

ఇంకా మహాకూటమిలోనే ఉన్నా



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి),కాంగ్రెస్‌లతో కలిసి జనతాదళ్(యు) ఏర్పాటు చేసిన మహాకూటమిలో తాను ఇప్పటికీ కొనసాగుతున్నానని జనతాదళ్(యు) సీనియర్ నాయకుడు శరద్ యాదవ్ గురువారంనాడు స్పష్టం చేశారు. ఆయనపై జనతాదళ్ నాయకత్వం చర్య తీసుకునే అవకాశం ఉందంటూ వార్తలు వెలువడిన నేపథ్యంలో ఆయన ఈ స్పష్టీకరణ చేయడం గమనార్హం. మహాకూటమికి ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తూట్లు పొడిచి బీజేపీతో జతకట్టడంతో పదకొండు కోట్ల మంది బీహార్ ప్రజలు ఆగ్రహంతో ఊగిపోతు న్నారని శరద్ యాదవ్ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారనీ,నితీశ్ ఇప్పుడు బీజేపీతో జతకట్టి ప్రజల తీర్పును వమ్ము చేశారని శరద్ యాదవ్ విమర్శించారు.

మూడు రోజుల పాటు రాష్ట్రం అంతటా పర్యటించేందుకు ఆయన బయలుదేరి వెళ్తూ విలేఖరులతో మాట్లాడారు. అన్ని ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని తాజా పరిణామాల గురించి వివరిస్తానని ఆయన చెప్పారు. ఆయన పర్యటనలో జనతాదళ్(యు) నాయకులు,కార్యకర్తలు ఎవరూ ఆయనను కలవొద్దని పార్టీ నాయకత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.తాను ఇప్పటికీ రాజ్యసభలోపార్టీ నాయకునిగా ఉన్నానని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్ర పర్యటన క్రమశిక్షణ ఉల్లంఘన అంటూ నితీశ్ కుమార్ వర్గం చేసిన విమర్శపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు. శరద్ యాదవ్ ముజఫర్‌పూర్,దర్భంగా,మధుబని, తదితర జిల్లాల్లో ఈనెల12వ తేదీ వరకూ పర్యటిస్తారు.ఆయనకు పార్టీ ఎంపీలు వీరేందర్‌కుమార్,ఆలీ అన్వర్ అన్సారీలు మద్దతు ప్రకటించారు. కాగా, శరద్ యాదవ్ రాష్ట్ర పర్యటనతో జనతాదళ్ (యు)కి ఎటువంటి సంబంధం లేదని నితీశ్ వర్గానికి చెందిన వశిష్ఠ నారాయణ్ సింగ్ ప్రకటించారు.

తీర్పు కాపీ అందలేదు: సీసీఎస్ డీసీపీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బేగంపటే టాస్క్‌ఫోర్స్ ఆఫీస్‌లో జరిగిన మానవబాంబు పేలుడు కేసును నాంపల్లి కోర్టు కొట్టివేసింది. టాస్క్‌ఫోర్స్ ఆఫీస్‌లో పేలుడు కేసుపై కోర్టు తీర్పు కాపీ అందలేదని సీసీఎస్ డీసీపీ అవినాష్ మహంతి అన్నారు. న్యాయ సలహా తీసుకుని అప్పీల్‌కు వెళతామని సీసీఎస్ డీసీపీ అవినాష్ మహంతి స్పష్టం చేశారు.

కార్పొరేట్ స్థాయిలో గాంధీ ఆసుపత్రి



నా ట్రీట్‌మెంట్ ఇక ఇక్కడే

• అది పేదలది కాదు.. అందరి ఆసుపత్రి • అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు • ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేస్తాం: గవర్నర్ నరసింహన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి కేవలం పేదలకు మాత్రమే కాదని, అది అందరిదీ అని తాను కూడా అందులోనే చికిత్స చేయించుకుంటానని తెలుగు రాష్ట్రా ల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ అన్నారు. గతంలో లాగా గాంధీ ఆసుపత్రి లేదని, ఇప్పుడు కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా సౌకర్యాలను కల్పిస్తున్నట్టు గవర్నర్ స్పష్టం చేశారు. గాంధీ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ బ్లాక్‌లో 65 పడకల అత్యాధునిక ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియు)ను గవర్నర్ నరసింహన్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. పరికరాలు, వాటి వినియోగం, వాటికి ఎంత ఖర్చు అయిందో తదితర విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గవర్నర్, మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, జిహెచ్ఎంసి మేయర్ బొంతు రాంమోహన్, డిఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి, ప్రభుత్వ డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి ప్రవీణ్, ఆర్ఎంవో డాక్టర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో తాను గాంధీ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశానని అప్పుడు పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని అదే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని గవర్నర్ చెప్పారు. సీఎం అసెంబ్లీలోనే ఈ విషయాన్ని ప్రస్తావించి వెంటనే చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే పలు సౌకర్యాలను కల్పించినట్టు తెలిపారు. ఇప్పుడు ఐసీయులో 65 పడకల బ్లాక్‌ను అత్యాధునిక సౌకర్యాలతో ప్రారంభించామని చెప్పారు. గాంధీ, ఉస్మానియా వంటి ఆసుపత్రులకు ఎక్కువ మంది రోగులు వస్తుంటారని వారికి తగ్గట్టుగా సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పిపిపి) విధానాన్ని ప్రభుత్వ ప్రజా భాగస్వామ్యం(జిపిపి)గా మార్చాల్సిన అవసరం ఉంద న్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలు తమదే అని సొంతం చేసు కునేలా ఉండాలన్నారు. రానున్న రెండేళ్లలో తెలంగాణ లో వైద్య రంగం ముఖచిత్రమే మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్యుల పోస్టులతోపాటు, సిబ్బందిని భర్తీ చేయ నున్నట్టు చెప్పారు. మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లోని పేద రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించ డానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునికసౌకర్యాలను కల్పిస్తున్నట్టు తెలిపారు.

వేతనాలు పెంచండి

గాంధీ ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది విజ్ఞప్తి

గాంధీ ఆసుపత్రిలో పనిచేస్తున్న 4 తరగతి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ వేతనాలు పెంచాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమాన పనికి, సమాన వేతనాన్ని తమకు కూడా అమలు చేసి వేతనాలను పెంచాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మిపతి ఇతర నేతలు మంత్రిని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనాలు కూడా ప్రతి నెలా తమకు 5వ తేదిలోపు ఇవ్వడం లేదని, 15వ తేది నుంచి మరుసటి నెల 1వ తేదిలోపు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సరోగసీ వివరాలు

ప్రభుత్వానికి సమర్పించండి

సాయికిరణ్ ఆసుపత్రికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : హైదరాబాద్, బంజారాహిల్స్ లోని సాయి కిరణ్ ఆసుపత్రి , కిరణ్ సంతాన సాఫల్య కేంద్రంలో సరోగసీ తల్లులు ఎవరి కోసం పనిచేశారో వారి వివరాల్ని వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలని హైకోర్టు సాయికిరణ్ ఆసుపత్రిని హైకోర్టు ఆసుపత్రిని ఆదేశించింది. అప్పుడే ప్రభుత్వం జన్మించిన శిశువులను పొందుగోరుతున్న తల్లిదండ్రులకు అప్పగించే విషయంలో నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోగల్గుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ , జస్టిస్ జె.ఉమాదేవి తో కూడిన డివిజన్ బెంచ్ ఈ ప్రజాహిత వ్యాజ్యంపై గురువారం మరో సారి విచారణ చేపట్టి , ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ కిరణ్ ఆసుపత్రికి షో కాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను సవాలు చేస్తూ కిరణ్ ఆసుపత్రికి హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే హక్కు రాష్ట్రప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. .అద్దె గర్భంతో ఉన్న తల్లుల, పిల్లల గోప్యతకు ఎలాంటి భంగం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు హైకోర్టు మరో సారి స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో మీడియా నియంత్రణ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు అభిప్రాయపడింది.కిరణ్ సంతాన సాఫల్య కేంద్రంలో వెలుగు చూసిన 48 మంది అద్దె గర్భంతో ఉన్న పేద మహిళల పరిస్థితి పై పత్రికల్లో వచ్చిన కథనాల్ని చూసి చలించిపోయిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్ కుమార్ కైత్ రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి విచారణకు స్వీకరించి విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ తరపు ప్రభుత్వ న్యాయవాది బీఎస్.ప్రసాద్ వాదనలు వినిపిస్తూ సరోగసీ ఓ నేరం కానప్పటికీ, డాక్టర్లు పూర్తిగా వ్యాపారంగా మార్చి వేశారన్నారు. కిరణ్ ఆసుపత్రి తరపు న్యాయవాది రంజన్ ముఖర్జీ వాదనలు వినిపిస్తూ ... ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసిందని, వేధిస్తోందని తెలిపారు...కోర్టు సూచనల మేరకు ఆ కేంద్రంలో సరోగసీ తల్లులక ు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఆల్ట్రా సౌండ్ యంత్రాన్ని అందుబాటులో ఉంచామన్నారు. ..నిబంధనలన్నింటికి లోబడే ఆసుపత్రిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అక్కడున్న తల్లులకు , పిల్లలకు వైద్య సేవలు అందించించడంతో పాటు పౌష్టికాహారం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆసుపత్రి వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. సరోగసీ తల్లులు ఎవరి తరఫున పనిచేస్తున్నారో, వారి వివరాలను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

బేగంపేట ఆత్మాహుతి దాడి కేసులో

ఆధారాల్లేవ్




9 మందిని నిర్దోషులుగా ప్రకటించిన న్యాయస్థానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లోని బేగంపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద మానవ బాంబు దాడి కేసులో పది మంది నిందితుల్లో తొమ్మిది మంది నిందితులను నాంపల్లి కోర్టు నిర్దోషులుగా తేల్చింది. 12 ఏళ్ల తర్వాత న్యాయస్థానం తీర్పును వెలువరించింది. ప్రాసిక్యూషన్ ఆధారాలు చూపలేకపోవడంతో తొమ్మిది మంది నిందితులపై కేసును న్యాయస్థానం కొట్టివేసింది. మొత్తం 20 మంది నిందితులను గుర్తించగా 10 మందిని అరెస్టు చేశారు. ముగ్గురు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. కోర్టు తీర్పును డిఫెన్స్ లాయర్ స్వాగతించారు. ప్రాసిక్యూషన్ సాక్ష్యాధారాలు చూపకపోవడంతో నిందితులను నిర్దోషులుగా కోర్టు తేల్చిందని చెప్పారు. నిందితుల్లో కొందరు 11 ఏళ్లుగా జైలులో ఉన్నారని, మరికొందరు ఏడేళ్లుగా కారాగారవాసం గడుపుతున్నారని తెలిపారు. తీర్పు పూర్తిపాఠం చదివిన తర్వాత భవిష్యత్ కార్యాచరణ నిర్ణ యిస్తామని చెప్పారు. కాగా, తీర్పుపై ప్రాసిక్యూషన్ హైకోర్టుకు వెళ్లే అవ కాశాలున్నాయని తెలుస్తోంది. కోర్టు హాల్‌లో నిందితులు విక్టరీ సింబల్స్ చూపుతూ బయటికి వచ్చారు. బంగ్లాదేశ్‌కు చెందిన దాలిన్ ఉగ్రవాద సంస్థ హుజీ ఇక్కడికి తీసుకువచ్చి మానవబాంబుగా మార్చి ఈ దాడికి పాల్పడిందని దర్యాప్తు బృందం తేల్చింది. రెండేళ్లు పరిశోధించాక పదిమందిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. నిందితులపై కోర్టులో అభియోగ పత్రాలు సమర్పించి, విచారణ మొదలు పెట్టారు. వివిధ దశల అనంతరం గురువారం న్యాయస్థానం తుదితీర్పు వెల్లడిచేసింది.


అసలేం జరిగింది?

అక్టోబర్ 12, 2005న నగరంలోని బేగంపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో జరిగిన మానవ బాంబు పేలుడు కేసు 12 ఏళ్ల పాటు విచారణ సాగింది. 2006లో సిట్ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు పాకిస్థాన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఈ దాడి హర్కతుల్ జిహాదీ ఇస్లామీ బంగ్లాదేశ్ సంస్థ పనిగా సిట్ నిర్ధారించింది. ఈ ఘటనలో బంగ్లాదేశ్‌కు చెందిన దాలిన్ మానవబాంబుగా మారాడు. మానవబాంబు డాలిన్‌ను టాస్క్‌ఫోర్స్ ఆఫీసుకు మహ్మద్ అబ్దుల్ ఖలీల్ తీసుకొచ్చాడు. పాకిస్థాన్‌లో ఉంటున్న టెర్రరిస్టు షాహిద్ సోదరుడు మహ్మద్ అబ్దుల్ జాహెద్. ఉగ్రవాదులకు లాజిస్టిక్ సపోర్ట్ చేసిన జాహెద్. ఉగ్రవాదులకు పేలుడు పదార్థాలను అందజేసిన మహ్మద్ షకీల్, పాతబస్తీలో ఓ ఇంట్లో పేలుడు పదార్థాలను దాచిన షకీల్. జైష్ మహ్మద్ ఉగ్రవాది సయ్యద్ హాజీ, ఉగ్రవాదులకు బీదర్‌లో స్థావరం ఏర్పాటు చేసిన అలీఖాన్, బీదర్‌లో అజ్మత్ అలీ ఇంట్లోనే బాంబులు తయారీ, బీదర్‌లో బాంబుల తయారీకి అవసరమైన జిలెటిన్‌స్టిక్స్ సరఫరాచేసిన మహ్మద్ బరూద్‌వాలా. మహ్మద్ ఖాజా, మహ్మద్ హిలాలుద్దీన్, నఫీజ్ ఉల్ బిశ్వాస్ ఉగ్రవాదులకు ఆర్థిక సహకారం అందించారు. ఈ కేసు ఏసీపీ దివాకర్ సమక్షంలో దర్యాప్తు జరిగింది.

ఇన్నాళ్లూ జైల్లో ఉన్న వారికి ఏం సమాధానం చెబుతారు?




బేగంపేట పేలుళ్ల కేసులో కోర్టు తీర్పుపై ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. 10 మంది నిందితులపై కేసులు పెట్టి పదేళ్లు జైల్లో పెట్టారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. కేసును కోర్టు కొట్టివేసిందని ఇన్నాళ్లూ జైల్లో ఉన్నవారికి ఏం సమాధానం చెబుతారని అస దుద్దీన్ ప్రశ్నించారు. దీనికి దర్యాప్తు చేసినవారే బాధ్యత వహించాలన్నారు. ఘటనా స్థలంలో సేకరించిన పేలుడు పదార్థానికి పోలీసులు అందజేసిన పదార్థానికి మ్యాచ్ కాలేదని అన్నారు. ఈ కేసులో అడ్వకేట్ల బృందానికి అసదుద్దీన్ ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు.



71వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే పరేడ్ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ దళం గురువారం గోల్కొండ కోటలో రిహార్సల్స్ చేస్తున్న దృశ్యం

పరిటాల శ్రీరామ్ నిశ్చితార్థం

హాజరైన పలువురు టీడీపీ నేతలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి పరిటాల సునీత కుమారుడు శ్రీరామ్ నిశ్చితార్థం మాదాపూర్ ఎన్‌కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ అసెంబ్లీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, సుప్రసిద్ధ నటుడు, తెదేపా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కాల్వ శ్రీనివాసులు, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, పీతల సుజాత, శాసనసభ్యులు పయ్యావుల కేశవ్, పార్థసారధి, అయ్యన్న పాత్రుడు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులు హాజరయ్యారు. ఏవీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఆలం వెంకటరమణ, సుశీలమ్మల కుమార్తె జ్ఞానవితో అక్టోబర్ 1న శ్రీరామ్ వివాహం జరగనుంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 11ఆగస్టు 2017

మంచిమాట స్త్రీలకు మిత్రులుండరు, వారికి పోటీదార్లు మాత్రమే ఉంటారు. ● ఎడ్మండ్ గాండినెట్


అసమానతలు పెరిగిపోవడంతో ఆనాటి యోధుల త్యాగాలు ఫలించలేదు. మహాత్మాగాంధీ కలలుగన్న సురాజ్యం ఇప్పటికీ సుదూరమైన కలగానే మిగిలింది. ఇందుకు బాధ్యులైన వారిని విమర్శించడం కన్నా నవభారత నిర్మాణం కోసం నూతన సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మోడీ వెలిబుచ్చే అభిప్రాయాలనే ఉపరాష్ట్రపతిగా కొద్ది గంటల్లో ప్రమాణం చేయనున్న ఎం. వెంకయ్యానాయుడు మూడు సీలను వదిలి నాలుగు సీ ల కోసం మనమంతా ప్రతినబూనుదామన్నారు. క్యాష్ (ధనం), క్యాస్ట్ (కులం), కమ్యూనిటీ (మతం)లకు బదులు కాలిబర్, కేరక్టర్, కెపాసిటీ, కాండక్ట్‌లను పెంపొందించుకుందామని అన్నారు.

సాధిస్తామన్నదే ఇప్పటి నినాదం కావాలి

క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవాన్ని మొక్కుబడిగా కాకుండా, ఆనాటి ఉద్యమ స్ఫూర్తితో సమకాలీన సమాజంలో రుగ్మతలను పారద్రోలడానికి కృషి చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు సందర్భోచితంగానే ఉంది. ఏటా ఆగస్టు నెల రాగానే స్వాతంత్ర్య దినోత్సవాన్నీ, జనవరిలో గణతంత్ర దినోత్సవాన్ని మొక్కుబడిగా జరుపుకోవడానికి అలవాటు పడిన మనకు ఈ ఏడాది క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవాన్ని వినూత్న తరహాలో జరుపుకోవాలన్న మోడీ ఆలోచన అభినందించదగిందే. ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యంలో అవిద్య, నిరక్షరాస్యత, అసమానతలు పెరిగిపోవడంతో ఆనాటి యోధుల త్యాగాలు ఫలించలేదు. మహాత్మాగాంధీ కలలుగన్న సురాజ్యం ఇప్పటికీ సుదూరమైన కలగానే మిగిలింది. ఇందుకు బాధ్యులైన వారిని విమర్శించడం కన్నా నవభారత నిర్మాణం కోసం నూతన సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మోడీ వెలిబుచ్చే అభిప్రాయాలనే ఉపరాష్ట్రపతిగా కొద్ది గంటల్లో ప్రమాణం చేయనున్న ఎం. వెంకయ్యనాయుడు మూడు సీలను వదిలి నాలుగు సీ ల కోసం మనమంతా ప్రతినబూనుదామన్నారు. క్యాష్ (ధనం), క్యాస్ట్ (కులం), కమ్యూనిటీ (మతం)లకు బదులు కాలిబర్, కేరక్టర్, కెపాసిటీ, కాండక్ట్‌లను పెంపొందించుకుందామని అన్నారు. వెంకయ్య నాయుడుకు ప్రాసలతో మాట్లాడటం అలవాటు అని తేలికగా తీసుకోకుండా, ఆయన ఇచ్చిన పిలుపును నిశితంగా పరిశీలిస్తే దాని ప్రాధాన్యం మనకు అవగతం అవుతుంది. రాజకీయాల్లో కులం, ధనం, ప్రధాన పాత్ర వహిస్తూ రావడం వల్లనే ఏడు దశాబ్దాలుగా దేశం ఎంతో అభివృద్ధి సాధించినా, ఆర్థికపరమైన, సామాజిక పరమైన అంతరాలు పెరిగిపోతున్నాయి. వాటికి బదులు వ్యక్తిత్వ వికాసం, సచ్ఛీలత, సామర్థ్యం, మెరుగైన నడవడిక పెంచుకోవాలన్న ఆయన పిలుపు ఎంతో విలువైనది. అలాగే, క్విట్ ఇండియా ఉద్యమం అనేది పరాయి పాలకులకు వ్యతిరేకంగా సాగినట్టిది. ఇప్పుడు మన ప్రభుత్వాన్ని మనమే నడుపుకుంటున్నాం కనుక, ఆనాటి నినాదమైన సాధిస్తాం లేదా ప్రాణాలైనా అర్పిస్తామన్నది ప్రస్తుత సందర్భానికి వర్తించదు. సాధిస్తాం, చేసి చూపిస్తామన్నదే ఇప్పుడు మనం అందుకోవల్సిన నినాదం. దేశం నుంచి బ్రిటిష్ వారిని తరిమి వేసినట్టే, అవినీతి, లంచగొండితనం, కుల, మతతత్వాలను తరిమి వేయగలిగితే మన దేశానికి తిరుగులేదు. సహజ వనరులు, మానవ వనరుల్లో, మేధా సంపత్తిలో భారత్‌కు ఏ దేశమూ సాటిరాదు. మన ఇంజనీర్లు, శాస్త్రజ్ఞులు, అధ్యాపకుల సేవలను ఇతర దేశాల వారు ఉపయోగించుకుంటున్నారు. వంతెనలు, ఆనకట్టల నిర్మాణంలో మన ఇంజనీర్లు ప్రదర్శిస్తున్న ప్రతిభ విదేశీయులను ఆకట్టుకుంటోంది. అలాగే, వైద్య రంగంలో భారతీయ వైద్యులు నెలకొల్పుతున్న రికార్డుల గురించి వేరే చెప్పనవసరం లేదు. ఇన్ని వనరులు, ఇంత ప్రతిభ ఉన్నా ఎందుకు మనం అగ్రరాజ్యం స్థాయికి చేరలేకపోతున్నామని ప్రతిపౌరుడు తనకు తాను ప్రశ్నించుకుంటే, పైన పేర్కొన్న రుగ్మతలే కారణాలుగా ఎవరికైనా కనిపిస్తాయి. అందుకే వాటిని పారద్రోలేందుకు ఇలాంటి సందర్భాల్లో ప్రతినబూనడం అత్యవసరం. స్వాతంత్ర్య సమరం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. అప్పుడు మనం పరాధీనంలో ఉన్నాం. కనుక, సాధించలేమేమోనన్న అనుమానం పీడించేది. స్వతంత్ర భారతంలో అటువంటి అనుమానాలకూ, సందేహాలకూ తావు లేదు. కావల్సిందల్లా దృఢ సంకల్పం. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పదవీ విరమణ సందర్భంగా చేసిన ప్రసంగంలో దేశానికి తాను చేసిన దానికన్నా దేశం తనకు ఎక్కువ ఇచ్చిందంటూ నిజాయితీగా ప్రకటించారు. ఐదేళ్ళ పాటు దేశ ప్రథమ పౌరునిగా అందరి మన్ననలను పొందే రీతిలో బాధ్యతలను నిర్వహించిన ప్రణబ్ ముఖర్జీ మాటలు ఇప్పుడు ప్రస్తుతమే. ప్రతి వారిలో ఆ ఆత్మసంతృప్తి భావం నెలకొంటే, సొంతం కోసం కాకుండా, దేశం కోసం చేయాలనే భావం అందరిలో కలుగుతుంది. అది మొలకలెత్తితే నవభారత్ నిర్మాణంలో భాగస్వాములు కావడానికి అందరినీ పురికొల్పుతుంది. అలాంటి ఆత్మవిశ్వాసాన్నీ, దృఢ సంకల్పాన్నీ అందరిలో ప్రోది చేయడం కోసమే ప్రధానమంత్రి క్విట్ ఇండియా దినోత్సవ 75వార్షికోత్సవ సందర్భంగా కొత్త తరహా ప్రతినకు పిలుపు ఇచ్చారు. ఆయన కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా, నల్లధనాన్ని వెలికి తీసేందుకూ,అవినీతిని రూపుమాపేందుకు పథకం ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.

పన్ను ఎగవేతదారులపై చర్యలకు జాతీయ, అంతర్జాతీయ చట్టాలు, న్యాయస్థానాల్లో విచారణ వల్ల కొంత ఆలస్యం అవుతున్న మాట నిజమే అయినా, ప్రస్తుతం ఉన్న పరిధిలో నల్లధనాన్ని వెలికితీయడం కోసమే పెద్ద కరెన్సీ రద్దు, ఒకే దేశం, ఒకే పన్ను విధానం వంటి చర్యలను అమలు జేస్తున్నారు. వీటి వల్ల క్రమంగా సత్ఫలితాలు ఒనగూరుతాయి. అలాగే, అన్ని పథకాలకూ ఆధార్‌ని అనుసంధానం చేయడంవల్ల సబ్సిడీ సొమ్ము పక్కదారి పట్టకుండా నివారించేందుకు వీలవుతోంది. ఇదే తరహాలో ఇంకా మరిన్ని చర్యలు తీసుకుంటే మోడీ పదేపదే ప్రకటిస్తున్నట్టుగా ఐదేళ్ళలో నవభారత్ నిర్మాణం అసాధ్యమేమీ కాదు. పన్ను చెల్లింపుదారుల్లో, సమాజంలోని వివిధ వర్గాల్లో జవాబుదారీ తనాన్ని పెంచడం ద్వారా క్రమశిక్షణాయుతమైన జీవనానికి అందరూ అలవాటుపడేట్టు చేయవచ్చు. ఈ విషయంలో మోడీ చేపట్టిన ప్రయత్నాలు సఫలీకృతం కావాలనీ, నవభారత్ నిర్మాణ సాకారం కావాలని ఆకాంక్షిద్దాం.

నిష్క్రమిస్తూ.. నిష్ఠూరాలు



హమీద్ అన్సారీ.. భారత ఉపరాష్ట్రపతిగా గురువారం ఆయన పదవీకాలం ముగిసింది. తన హయాంలో ఆయన ముగ్గురు రాష్ట్రపతులు ప్రతిభా పాటిల్, ప్రణబ్ ముఖర్జీ, రామ్‌నాథ్ కోవింద్‌లను చూశారు. విద్యావేత్త అయిన అన్సారీ స్వాతంత్ర్యోద్యమంలోనూ పాల్గొన్నారు. వివిధ దేశాలకు రాయబారిగా బాధ్యతలు నిర్వహించారు. అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీకి వైస్ చాన్సలర్‌గా వ్యవహరించిన అన్సారీ ఐక్యరాజ్య సమితిలో భారత్ తరఫున శాశ్వత ప్రతినిధిగా పనిచేశారు. యూపీఏ హయాంలో ఆయనను ఉప రాష్ట్రపతి పదవి వరించింది. ఏప్రిల్ ఒకటి, 1937న కోల్‌కతాలో ఆయన జన్మించారు. 2007 ఆగస్టు 11న ఆయన భారత దేశ 12వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ పదవిలో అత్యంత ఎక్కువ కాలం పనిచేశారు. పదవీ కాలం ముగిసిన సందర్భంగా తన మనసులోని భావాలను మీడియాతో పంచుకున్నారు. అన్సారి మాటల్లోనే..

మనది సువిశాల దేశం. మన ప్రజాస్వామ్యం మహోజ్వలమైనది. గడిచిన పదేళ్ళలో కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ఎన్నో మార్పులు చూశాం. ప్రజల్లో చైతన్యంతో పాటూ వారి భాగస్వామ్యమూ పెరిగింది. ఈ విషయం ఎన్నికల్లో ఎప్పటికప్పుడు పెరుగుతున్న ఓటింగ్ శాతం సూచిస్తోంది. అదే సందర్భంలో ప్రజల్లో అసంతృప్తి కూడా పెచ్చరిల్లుతోంది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చడం లేదన్న అసంతృప్తి ప్రజల్లో ఏర్పడుతోంది.

ముస్లింలలో అభద్రతా భావం:

దేశంలో అసహన ధోరణులు పెరిగిపోతున్న మాట నిజమే. వరుసగా హింస చోటు చేసుకోవడం. గొడ్డు మాంసం నిషేధం, ఘర్‌వాపసీ వంటి కార్యక్రమాలు, ప్రచారాలు ఎంతోకాలంగా దేశంలో కొనసాగుతున్న విలువలు, సంప్రదాయాలకు భిన్నమైనవి. గోరక్షకుల దాడులు, ఘర్‌వాపసీ ఉద్యమం పేరిట మతం మార్పిడి ఒత్తిళ్ళు అల్పసంఖ్యాక వర్గాల్లో అభద్రతా భావాన్ని ఏర్పరుస్తున్నాయి. స్వాతంత్ర్యం రాకముందు నుంచి మన దేశంలో విభిన్న మతాలు, ఆహారపు అలవాట్లు, ఆచారాల వారు కలిసిమెలిసి జీవిస్తున్నారు. ఇప్పుడలాంటి పరిస్థితులకు విఘాతం కలుగుతుండటం వల్లనే అల్ప సంఖ్యాక వర్గాల్లో అభద్రతా భావం పెరుగుతోంది. గోరక్షకుల పేరిట కొందరి దాడుల గురించి ప్రధానమంత్రి వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నా. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిన మన దేశ ఔన్నత్యాన్ని కాపాడుకోవాలన్నదే నా అభిమతం.

వ్యాఖ్యలపై స్పందించను

రాజ్యసభ గురించి పలువురు బీజేపీ మంత్రులు, సీనియర్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై స్పందించను. రాజ్యసభ ఉన్నంట్టుండి ఏర్పడింది కాదు. ఎన్నో సుదీర్ఘ చర్చలూ, మథనం తర్వాత ఎగువ సభ ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు నిర్ణయించారు. భారత్‌లోని భిన్నత్వాన్ని ప్రతిబింబింపజేయడానికి రాజ్యసభ అవసరమని వారు భావించారు. వివిధ ప్రభుత్వాల హయాంలో రాజ్యసభ ఏ తీరులో పని చేసిందో రికార్డులు చూస్తే అర్థమవుతుంది. రాజ్యసభ తన విధులను సక్రమంగానే నిర్వహిస్తోంది.

వ్యవస్థాపరమైన అదుపులు

ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం అత్యంత ప్రధానమైనది. వ్యవస్థ అంతా బాగానే ఉన్నప్పటికీ, ఆచరణలోనే తేడా కనిపిస్తోంది. ఉదాహరణకు చట్టసభల సభ్యుల బాధ్యతలనే తీసుకుందాం. చట్టాలు చేయడం, ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయడం, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయడం వీటిలో ముఖ్యమైనవి. వీటన్నింటికీ తగిన వ్యవధి అవసరం. గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే, ఏభయ్యోవ, అరవయ్యోవ దశకంలో పార్లమెంటులో సాగిన కార్యకలాపాల్లో సగం కూడా ఇప్పుడు కనిపించడంలేదు. రాష్ట్ర శాసనసభల పరిస్థితి కొద్దిగా నయమనిపిస్తోంది. చట్ట సభ్యులు చర్చించే సందర్భాలు చాలా తక్కువగా ఉంటున్నాయి.

భవిష్యత్ ఆశాజనకమేనా?:

భారత్‌కు భవిష్యత్తు ఆశాజనకంగానే కనిపిస్తోంది. అపారమైన మానవ వనరులు, సహజ వనరులున్నాయి. మనోబలం, ఉత్సాహం ఉరకలు వేసే జనం ఉన్నారు. అంతా ఐక్యంగా పనిచేస్తే భారత్‌కి తిరుగుండదు. మన దేశంలో అనేక జాతులు, మతాలు, వర్గాలు ఉన్నా, అందరి కోసం ఒక్కరు, ఒక్కరికోసం అందరూ కలిసి ముందుకు సాగడంలో మన దేశప్రజలు వేరెవ్వరికీ తీసిపోరు.

సాంస్కృతిక జాతీయ వాదం గురించి:

మన దేశంలో వివిధ జాతులు, మతాలు, ఆచార, వ్యవహారాలు గలవారున్నారు. అందరి అభిప్రాయాలనూ గౌరవించాలి. అందరి అభిప్రాయాలకూ చోటుండాలి. రాజ్యాంగ రూపకల్పనలో రచయితలు వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకున్నారు. ఫెడరల్ రాజ్యాంగ రచన చేశారు. స్వాతంత్ర్య సమరంలో అంతా కలిసి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు. అప్పుడు అందరి లక్ష్యం ఒక్కటే. భిన్నత్వంలో ఏకత్వం మన విశిష్టత. ఎవరి అభిప్రాయాలు వారివయినప్పటికీ, అందరం కలిసి సహజీవనం సాగించాలి. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి కవులు, రాజకీయ నాయకులు, మేధావుల అభిప్రాయాలివి. భిన్న ధోరణులు ఉన్నప్పుడు సాంస్కృతిక జాతీయవాదం వంటివి ఆచరణలో సాధ్యం కాకపోవచ్చు. లౌకికవాదం బహుళ జనగళంగా వర్ధిల్లాలంటే, సహజీవన విధానం కొనసాగాలంటే లౌకికవాదం తప్పని సరి. ప్రపంచంలో ఉన్న మతాలన్నీ మన దేశంలో ఉన్నాయి. మనదేశంలో లేని మతాలు, ధర్మాలూ ప్రపంచంలో ఎక్కడా లేవు. మన దేశంలో అన్నింటికీ సముచిత స్థానముంది. పౌరులందరికీ సమాన అవకాశాలూ, హక్కులూ ఉన్నాయి. ఐదడుగుల ఎత్తున్న వారైనా, ఆరడుగుల వారైనా అందరూ సమానమే. ప్రజాస్వామిక సూత్రాలూ, విలువలూ అందరికీ వర్తిస్తాయి.

ఒకే దేశం ఒకే నాయకుడు, ఒకే పన్ను:

ఒకే దేశం, ఒకే నాయకుడు, ఒకే పన్ను నినాదం బాగానే ఉంటుంది. అది ఎవరిదైనా కావచ్చు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వినిపిస్తోంది. ఏ భాషలోవారు వారికి అనుగుణమైన రీతిలో నినాదాలిస్తున్నారు. మనకు జాతీయ భాష లేదు. ప్రాంతీయ భాషలెన్నో ఉన్నాయి. మనకు అధికార భాషలున్నాయి. నేను ఐక్యరాజ్యసమితిలో భారత రాయబారిగా ఉన్నప్పుడు భారత్‌లోని భిన్నత్వం గురించి అందరికీ తెలియజేశాను.

వంద నోటుని జేబులో ఉంచుకునే వాణ్ణి. అందరికీ చూపించేందుకు...భారత్‌లో ఎన్ని భాషలైతే ఉన్నాయో అవన్నీ ఆ నోటుమీదుంటాయి. మనం అంతా ఒకే ఆహారం తీసుకోం. మన ఆచార, వ్యవహారాలన్నీ ఒకటి కావు.

ప్రోటోకాల్ గురించి:

ప్రోటోకాల్ చీఫ్‌గా నాకు సుదీర్ఘమైన అనుభవముంది. దానికి భిన్నంగా నేనెన్నడూ వ్యవహరించలేదు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భారత్‌ని సందర్శించినప్పుడు చెలరేగిన వివాదం అర్థం లేనిది. దాని గురించి పెద్దగా చెప్పేదేమీ లేదు.

ఉపరాష్ట్రపతిగా పదేళ్ళు:

ఉపరాష్ట్రపతిగా పదేళ్ళ పాటు కొనసాగినంత కాలం రాజ్యాంగాన్నే ప్రామాణికంగా తీసుకున్నా. సభా నిబంధనలు తుచ తప్పకుండా పాటించా. చర్చల్లో అందరికీ అవకాశం కల్పించా. అందరి అభిమానాన్ని చూరగొన్నా. మారిన పరిస్థితుల్లో రాజ్యసభను నిర్వహణలో ఎన్నో అనుభవాలు చవిచూశా. వాటినుంచి ఎంతో నేర్చుకున్నా. మన ప్రజాస్వామ్యం విశిష్టతకు రాజ్యసభ కార్యకలాపాలు అద్దం పడతాయి. భిన్నాభిప్రాయాలను వెల్లడించే వేదికది.

ముఖ్యమైన బిల్లులు ఆగిపోవడం గురించి:

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు, లోక్‌పాల్ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులు ఆగిపోవడం బాధాకరమే. ఇందులో నా బాధ్యతేం లేదు. పార్లమెంటును రాష్ట్రపతి ప్రభుత్వ సలహాపై సమావేశపరుస్తారు. సమావేశాలు పొడిగించాల్సిన అవసరముందని ప్రభుత్వం భావిస్తే ఆ మేరకు సిఫార్సు చేస్తుంది. ఇందులో సభాధ్యక్షుని ప్రమేయమేమీ ఉండదు.

రాజ్యసభ టీవీ గురించి

రాజ్యసభ టెలివిజన్ ప్రతిపాదన నాదే. అదెలా పని చేయాలో నేను అన్నీ సమగ్రంగా తెలియజేశా. సభలో సభ్యులు వెలిబుచ్చే అభిప్రాయాలు ప్రతిబింబించాలని సూచించా. ఒకరిపై మరొకరు అరుచుకోవడం, కేకలేసుకోవడానికి అది వేదిక కాదు.

సభలో అన్ని అంశాలనూ చర్చించాలి. శాంతి లేనిదే అభివృద్ధికి తావు లేదు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన నినాదం సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ తిరుగులేనిది. సబ్‌కా సాథ్ అంటే సభాకా సాథ్ అని ఇక్కడ మనం అర్థం చెప్పుకోవచ్చు.

ఇచ్చే సలహా ఏమీ లేదు

నా తర్వాత ఉపరాష్ట్రపతి పదవిని చేపడుతున్న ఎం వెంకయ్యనాయుడు ఎంతో అనుభవమున్న పార్లమెంటేరియన్. ప్రజాజీవితంలో ఆయనకు ఎంతో అనుభవముంది. ఆయనకు అన్నీ తెలుసు.

ఇబ్బందుల్లో చక్కెర మిల్లులు

భారతదేశ వ్యాప్తంగా చక్కెర మిల్లులు సంక్షోభంలో కూరుకుపోయాయి. చెరకు రైతులను ఈ పరిణామం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుత అంచనాల ప్రకారం దేశంలో 50 శాతం మిల్లులు తెరుచుకునే పరిస్థితులు కానరావడం లేదు. మన దేశంలో చెరకు క్రషింగ్ సీజన్ ప్రతి ఏటా అక్టోబర్ 15న మొదలవుతుంది. నవంబర్ 15 నాటికి అన్ని మిల్లులు పనిచేయటం ప్రారంభిస్తాయి. నూటికి 80 శాతం మిల్లులు చెరకు రైతులకు బకాయిలు కూడా చెల్లించలేదు. ఈ కారణంగా కొత్త సీజన్ ప్రారంభానికి మిల్లులు వెనకంజ వేస్తున్నాయి. చెరకు బకాయిలపై తీవ్రంగా స్పందించిన ఉత్తరప్రదేశ్ హైకోర్టు అక్టోబర్ 31వ తేదీలోగా బకాయిలు చెల్లించాల్సిందేనని ఆదేశించింది. ఈ తీర్పుతో కంగుతిన్న 119 మిల్లుల్లో 80 శాతం ఈ సీజన్‌లో తెరిచేందుకు తమ అశక్తతను వ్యక్తంచేస్తున్నాయి. గత ఏడాది పంచదారలో 42 శాతం నిల్వలు ఉండిపోవటంతో తాము రైతులకు బకాయిలు పడినట్లు మిల్లులు పేర్కొంటున్నాయి.


దేశంలో సుమారు 450 మిల్లులుంటే అందులో 119 మిల్లులు ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే ఉన్నాయి. 2013- 14 సీజన్‌లో దేశంలో 25.5 మిలియన్ టన్నులు పంచదార ఉత్పత్తయితే అందులో 6.5 మిలియన్ టన్నులు ఉత్తరప్రదేశ్ వాటా. మన దేశానికి చక్కెర కర్మాగారాల సంక్షోభం కొత్తకాపోయినా రెండేళ్ళ నుంచి ఇటు రైతులను అటు కర్మాగారాల యాజమాన్యాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇది 2008 - 2009 నాటి సంక్షోభాన్ని మించిందని జాతీయ చక్కెర మిల్లుల సమాఖ్య (ఇస్మా) వ్యాఖ్యానించిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఏకకాలంలో గిట్టుబాటు ధర కోసం రైతులు, ఉత్పత్తి ఖర్చుల ధర కోసం కర్మాగారాల యజమానులు ఆందోళనకు దిగవలసి వచ్చింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆర్నెల్ల కిందట గత యుపిఎ ప్రభుత్వం చక్కెర కర్మాగారాలకు 7,200 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాన్ని అందచేసింది. ఈ మొత్తాన్ని రైతుల బకాయిలు తీర్చటానికే వెచ్చించాలని షరతు కూడా విధించింది. రైతులకు వివిధ రాష్ట్రాలకు చెందిన చక్కెర కర్మాగారాలు సుమారు 6,800 కోట్ల రూపాయలు చెల్లించవలసి ఉందని లెక్కతేల్చారు. సుమారు 3000 కోట్ల రూపాయలు ఉత్తరప్రదేశ్‌కు చెందినవే. ఈ ఆర్థిక సహాయం చక్కెర కర్మాగారాలను గట్టెక్కించలేకపోయింది.

దీనికి ప్రధాన కారణం చక్కెర ఉత్పత్తి ఖర్చుకీ, రాబడికీ పొంతనలేకపోవటమే. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లో కిలో చక్కెర తయారీకి కర్మాగారాలు 35 రూపాయలు ఖర్చుచేస్తే పంచదార అమ్మకం ద్వారా 31 రూపాయలు లభిస్తున్నాయి. ఈ కారణంగా బహిరంగ మార్కెట్‌లో చక్కెర ధర పెరుగుదల కోసం ఎన్‌డిఎ ప్రభుత్వం మరొక ప్రయోగం చేసింది. దీని ప్రకారం చక్కెర దిగుమతి సుంకాన్ని 15 శాతం నుండి 25 శాతానికి పెంచింది. దీనివల్ల దిగుమతులు తగ్గడంతో పాటు దిగుమతి చేసుకొన్న పంచదార ధర పెరగటం వల్ల స్థానిక చక్కెర కర్మాగారాలకు ఊరట లభిస్తుందన్నది కేంద్ర ప్రభుత్వం ఆలోచన. దీనితోపాటు చక్కెర కర్మాగారాల నుండి ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలిపే శాతాన్ని 5 నుండి 10 శాతానికి పెంచటం వల్ల కూడా కొంత ప్రయోజనం కలిగే అవకాశముంది. వాస్తవానికి చక్కెర కర్మాగారాలయితే రైతులకిచ్చే చెరకు ధర తగ్గాలని, చెరకు నాణ్యత పెరగాలని బహిరంగ మార్కెట్‌లో చక్కెర ధర కనీసం 40 రూపాయలు ఉండాలని సూచిస్తోంది. చక్కెర ఎగుమతి చేస్తే టన్నుకు 500 రూపాయలు ప్రత్యేక రాయితీ ఇవ్వాలని కూడా కోరుతోంది. దిగుమతి సుంకాన్ని 25 శాతం బదులుగా 40 శాతానికి పెంచాలని సూచిస్తోంది.

అంకెల్లో చక్కెర మిల్లులు...

భారతదేశంలో చెరకు విస్తీర్ణం 40 లక్షల హెక్టార్లు. దేశవ్యాప్తంగా 453 చక్కెర కర్మాగారాలుంటే అందులో 252 సహకార రంగానికీ, 134 ప్రైవేట్ రంగానికీ, 67 సంయుక్త రంగానికీ చెందినవి. ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి)లో 39 కర్మాగారాలు ఉండగా అందులో సహకార రంగంలో 12 ప్రైవేట్ రంగంలో 24 సంయుక్త రంగంలో మూడు ఉన్నాయి. వివిధ కారణాలవల్ల మూడు రంగాలకు చెందిన 30 కర్మాగారాలు మాత్రమే ప్రస్తుతం నడుస్తున్నాయి. నిజాం సుగర్స్, కోవూరు, జంపని, చిత్తూరు, కడప మొదలైన చక్కెర మిల్లులు మూతపడ్డాయి.

1992లో ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌కోలాలో చెరకు గిట్టుబాటు ధర ఆందోళనలో ఏకంగా ఐదుగురు రైతులు పోలీసుల కాల్పులలో మరణించారు. సకాలంలో బకాయిలందక 2014 సెప్టెంబర్ నెలలో 10మంది ఆత్మహత్య చేసుకున్నారు. 1975 నాటికి దేశంలో 250 కర్మాగారాలు మాత్రమే ఉండేవి. మొదట్లో చెరకు రైతులకు 8.5 శాతం పంచదార దిగుబడి అనే సూత్రంపై ధర చెల్లించేవారు. చక్కెర మిల్లుల లాభాల కారణంగా దానిని దరిమిలా 9.5 శాతానికి మార్చారు అంటే టన్ను చెరకుకి 95 కిలోల పంచదార దిగుబడి రావాలి. గతంలో 85 కిలోలు వస్తే సరిపోయేది. అదేవిధంగా ఇథనాల్ ధరను లీటరుకు 21 రూపాయల నుండి 27 రూపాయలకు పెంచటం చక్కెర మిల్లులకు కలిసొచ్చింది. అయినా చక్కెర మిల్లులు సంక్షోభం నుండి బయటపడలేకపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఉయ్యూరు చక్కెర కర్మాగారం మాత్రమే ఈ సీజన్‌లో టన్నుకు 2480 రూపాయల ధర ప్రకటించి నవంబర్‌లో మిల్లుని నడపటానికి సంసిద్ధత ప్రకటించింది. రాష్ట్రంలో అన్ని చక్కెర మిల్లుల పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న తరుణంలో హుద్‌హుద్ తుపాను కారణంగా శ్రీకాకుళం నుండి తూర్పు గోదావరి జిల్లా వరకు గల సింకిలి, లచ్చయ్యపేట, భీంసింగ్, చోడవరం, ఏటికొప్పాక, తాండవ, అనకాపల్లి, సామర్లకోట, చెల్లూరు తొమ్మిది కర్మాగారాలు మరింత సంక్షోభంలో కూరుకుపోయాయి. చెరకు తోటలు ధ్వంసం కావటం, చక్కెర బస్తాలు తడిసిపోవటం లాంటి నష్టాలు ఎదురయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ తెలంగాణా రాష్ట్రా లలోని 30 కి 10 మిల్లులు తరగటం కూడా కష్టమే. ఏదిఏమైనా చక్కెర మిల్లుల సంక్షోభానికి మోడీ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాల్సిన ఆవశ్యకత ఉంది.



-పుట్టా సోమన్న చౌదరి,
9440339682

కల్తీ నిరోధక చట్టం సహకరణ ఎక్కడ?

జగమంతా కల్తీ మయం జనానికి అనారోగ్యం. ఈనాడు ఎచ్చట విన్నా కల్తీ మయంగా మారింది! పీల్చేగాలి, తినే ఆహారం, తాగేనీరు, ప్రతి ఒక్కటీ కల్తీగా మారినా నేడు ప్రజానీకం ఆరోగ్యం పూర్తిగా విషమించి, శస్త్రచికిత్సల వరకు కొనసాగుతోంది! కల్తీ నిరోధక చట్టం మాత్రం నిమ్మకు నీరెత్తకుండా వున్నది! ప్లాస్టిక్ బియ్యం, ప్లాస్టిక్ కందిపప్పు ఇలా అన్ని రకాలైన పదార్థాలు ప్లాస్టిక్‌తో తయారు కావడం అవి సేవించి ప్రజలు స్లోపాయిజన్ విధానంగా మరణించడం జరుగుతుంది! ఇక నీరు మినరల్ వాటర్ అని నీటి వ్యాపారం ముమ్మరంగా సాగిపోతోంది! ఇక మానవ కోటి జీవించే మార్గానికి ఇది స్వస్తి మార్గమా? మరి చట్టం కేవలం చదువుకొనుటకు పరిమితేనా?

-కోవూరు వెంకటేశ్వర ప్రసాదరావు
కందుకూరు, ప్రకాశం జిల్లా

త్రిశంకు స్వర్గంలో పదివేల మంది

డిగ్రీ విద్యార్థుల భవిష్యత్



- సీటు వచ్చినా కాలేజీలో చేరలేని పరిస్థితి
- కోర్టు తీర్పుతో సీట్ల కేటాయింపును ఆపిన డోస్టు
- కోర్టుకెళ్లిన 48 ప్రైవేట్ కాలేజీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంటర్మీడియట్ వారికి మంచి మార్కులొచ్చాయి. డిగ్రీలో చేరడం కోసం ఆన్‌లైన్‌లో డోస్టు ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వారికి మొదటి విడత సీట్ల కేటాయింపులోనే సీటు వచ్చింది. కానీ వారు ఇప్పటి వరకు ఆయా కాలేజీల్లో చేరలేదు. కారణం ఆ కాలేజీలపై కోర్టులో తీర్పు పెండింగ్‌లో ఉంది. దీంతో మొదటి విడతలోనే సీటు పొందినప్పటికీ ఇప్పటి వరకు వారు ఆయా కాలేజీల్లో చేరలేకపోయారు. కోర్టుకెళ్లిన 48 ప్రైవేటు కాలేజీల్లో సుమారు 10వేల మంది విద్యార్థులకు మొదటి విడతలోనే సీట్లను కేటాయించారు డోస్టు అధికారులు. కానీ వారు కాలేజీల్లో చేరలేకపోతున్నారు.

కోర్టుకెళ్లిన 48 కాలేజీల్లో సీటు పొందిన విద్యార్థుల పరిస్థితి త్రిశంకు స్వర్గంలో మాదిరిగా ఉంది. 48 కాలేజీల్లో సీటు కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారికి మొదటి విడతలోనే సీటు అలాట్‌మెంట్ అయింది. కానీ విద్యార్థులు ఆయా కాలేజీల్లో చేరలేకపోయారు. కారణం 48 ప్రైవేటు కాలేజీలు తమకు డోస్టు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించాయి. ఈ విషయంలో కోర్టు తీర్పునిస్తూ ఆయా కాలేజీలకు సీట్లు కేటాయించాలని కానీ తుది తీర్పు వెలువడిన తరువాత మాత్రమే వారు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని సూచించింది. దీంతో మొదటి విడతలోనే ఆయా కాలేజీల్లో సుమారు 10వేల మంది సీట్లను పొందారు. వారు ఆయా కాలేజీల్లో చేరలేదు కాబట్టి వారికి మరొక కాలేజీలో చేరేందుకు అవకాశం లేకుండా పోయింది. వారు వేరే ఏ కాలేజీలోనైనా చేరాలంటే మొదటి విడతలో సీటు పొందిన కాలేజీలో జాయినింగ్ రిపోర్ట్ ఇస్తేనే వారి సీటు పొందినట్టు అవుతుంది. కానీ వీరు కాలేజీలో జాయినింగ్ రిపోర్టు ఇవ్వలేదు కాబట్టి వారికి మరో విడతలో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం లేదు. దీంతో మరో కాలేజీలో సీటు పొందే అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు ఆయా 48 కాలేజీల్లో సీట్లు పొందిన విద్యార్థుల పరిస్థితి ఇటు వేరే కాలేజీలో చేరలేక, ఆయా కాలేజీలో చేరక త్రిశంకు స్వర్గంలో ఉన్నట్టుగా మారింది.

కోర్టు తీర్పు ఎప్పుడు వస్తుందో....

కోర్టు తుది తీర్పు ఎప్పుడు వస్తుందో తెలియకపోవడంతో మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే మూడు విడతల్లో సీట్ల కేటాయింపు పూర్తి అయింది. ఈ మూడు విడతల్లో సీట్లు పొందిన వారికి మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుంది. వీటి తరువాత స్పాట్ అడ్మిషన్లను ఈ ఏడాది చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే వీరు మూడు విడతల్లోనూ సీటు పొందిన కాలేజీల్లో చేరలేదు కాబట్టి వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చే పరిస్థితి లేదు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం లేదు. కాబట్టి వెంటనే ఈ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. తగిన నిర్ణయం తీసుకోకపోతే వారు డిగ్రీలో చేరే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవల్సిన అవసరం ఉంది.

మహిళా సంఘాలకు ట్యాబ్

- గ్రామైఖ్య సంఘాలకు ఇచ్చేందుకు నిర్ణయం
- వీఓఏలకు అప్పగింత



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలోని మహిళా సంఘాలకు ట్యాబ్‌లను పంపిణీ చేయాలని తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సెర్ప్ కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే మొబైల్ ద్వారా మహిళా సంఘాలు సేవలను అందిస్తున్న విషయం తెలిసిందే. మరో అడుగు ముందుకేసి ఏకంగా ట్యాబ్‌లను ఇచ్చేందుకు సన్నద్ధమౌతుంది. ముందుగా గ్రామైఖ్య సంఘాలకు ట్యాబ్‌లను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఒక్కో గ్రామైఖ్య సంఘానికి ఒక ట్యాబ్ చొప్పున పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఇప్పటికే పలుమార్లు అధికారులు చర్చించారు. ఈ ట్యాబ్‌లను గ్రామైఖ్య సంఘం సహాయకులు (వీఓఏ)లకు అప్పగించనున్నది. గ్రామైఖ్య సంఘానికి సంబంధించిన అన్ని రకాలను వివరాలు, సమాచారం, సేవలను ట్యాబ్ ద్వారా వినియోగించాలని సెర్ప్ అధికారులు ప్రతిపాదనలను తయారు చేశారు. దీంతో త్వరలోనే గ్రామైఖ్యసంఘాలను ట్యాబ్‌లను పంపనున్నట్లు తెలిసింది.

గ్రామైఖ్య సంఘాలకు ఇచ్చిన ట్యాబ్‌లకు ఇంటర్నెట్ సౌకర్యం తదితర అంశాలను స్త్రీ నిధి బ్యాంకు ద్వారా అనుసంధానం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ట్యాబ్‌లను జీపీఆర్ఎస్ వ్యవస్థను కూడా అనుసంధానం చేయనున్నారు. అంతేకాకుండా ట్యాబ్‌లకు ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చిన తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన వెబ్‌సైట్‌లను మాత్రమే అనుసంధానం చేయనున్నారు. దీంతో పాటు సంబంధిత గ్రామైఖ్య సంఘం పరిధిలోపు ఇంటర్నెట్ పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు యోచిస్తున్నారు. దీనివల్ల వీఓఏలు ఇంటర్నెట్‌ను ఇతరత్రా వాటికి వినియోగించకుండా నియంత్రించే వీలుంటుందని అధికారులు ప్రతిపాదించినట్లు సమాచారం. దీనివల్ల ట్యాబ్‌లను కేవలం మహిళా సంఘాల పనులకే వినియోగించుకునే అవకాశముంటుంది..

వీఓఏలకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవవేతం రూ.5వేలు (రూ.2వేలు గ్రామైఖ్య సంఘం) కూడా ఏప్రిల్ నుంచి ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. పైగా గత వారం దీనికి సంబంధించిన మార్గదర్శకాలతో పాటు నిధుల విడుదలకు రాష్ట్రప్రభుత్వం పరిపాలన అనుమతులను కూడా జారీ చేసింది. దీంతో వీరిని పూర్తిస్థాయిలో పనుల్లో భాగస్వామ్యం చేసేందుకు సెర్ప్ యోచిస్తుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించి గ్రామస్థాయిలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో వీఓఏలను భాగస్వామ్యం చేయాలని ఇప్పటికే సెర్ప్ ఆదేశాలు జారీచేసింది.

మూడో విడతలో 74,699 మందికి సీట్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడం కోసం మూడో విడతలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సీట్లను కేటాయించారు. మూడో విడతలో 20,416 మంది టోకెన్లు తీసుకోగా అందులో 19,447 మంది ఫీజు చెల్లించారు. వారిలో 19,238 మంది తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. వాటిలో 19,060 మంది విద్యార్థులు తమ వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. అయితే వీరే కాకుండా మొదటి విడత, రెండోవిడతలోనూ వెబ్ ఆప్షన్లు ఇచ్చి మంచి కాలేజీలో చేరడం కోసం తిరిగి వెబ్ ఆప్షన్లను ఇచ్చిన వారు కూడా ఉన్నారు. ఇలా మొత్తం కలిపి మూడో విడతలో 74,699 మందికి సీట్ల కేటాయింపును చేశారు. వారిలో గురువారం 25,049 మంది తమ కేటాయింపు లేఖనుల డౌన్‌లోడ్ చేసుకున్నారు. వారిలో 968 మంది ఆయా కాలేజీల్లో చేరినట్టు అధికారులు తెలిపారు.

తలొగ్గిన కార్పొరేట్ కాలేజీలు

- రూ. 2.17 కోట్ల బకాయిలు చెల్లించిన సంస్థలు
- ఇంటర్ బోర్డు చరిత్రలో ఇది పెద్దమొత్తం జరిమానా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని శ్రీచైతన్య, నారాయణ కార్పొరేట్ కాలేజీలు ప్రభుత్వానికి తలొగ్గాయి. గత ఏడాదిలో ఆయా కాలేజీలకు విజిలెన్స్ శాఖ విధించిన బకాయిలను ఆయా కాలేజీలు గురువారం బోర్డుకు చెల్లించాయి. శ్రీచైతన్య సంస్థ రూ. 1.55 కోట్లు, నారాయణ సంస్థ రూ. 62 లక్షలను బకాయిలుగా చెల్లించాయి. నారాయణ కాలేజీలు 13, శ్రీచైతన్య 16 కాలేజీలకు బోర్డు అనుమతి లేకుండా అదనపు క్లాసులను నిర్వహిస్తున్నందున గత ఏడాది మేలో విజిలెన్స్ శాఖ జరిమానా విధించింది. జరిమానాను ఆయా సంస్థలు ఆగస్టు 10లోపు జరిమానా చెల్లించకపోతే వారికి అనుబంధ గుర్తింపును ఇవ్వబోమని కొద్ది రోజుల క్రితం బోర్డు కార్యదర్శి అశోక్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం తుది గడువు కావడంతో ఆయా కాలేజీలకు చెందిన యాజమాన్యాలు రూ. 2.17 కోట్లను జరిమానాగా చెల్లించారు. ఇంటర్మీడియట్ బోర్డు చరిత్రలో జరిమానాగా ఇంత పెద్ద మొత్తంలో వసూలు గతంలో ఎన్నడూ లేదని బోర్డు అధికారులు చెబుతున్నారు.

మెరుగైన జీవనానికి సివిల్ ఇంజనీరింగ్

- ప్రముఖ విద్యావేత్త డా. లాల్జీసింగ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ : మానవ జీవన పరిస్థితుల మెరుగుకు సివిల్ ఇంజనీరింగ్ దోహదపడుతుందని బెనారస్ హిందూ విశ్వ విద్యాలయ మాజీ ఉపకులపతి పద్మశ్రీ డాక్టర్ లాల్జీసింగ్ అన్నారు. వాటర్ రీసోర్స్ అంశంపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన బోగారంలోని హోలీ మేరీ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రారంభించారు. శుక్రవారం కూడా సదస్సు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో హోలీ మేరీ సంస్థల కార్యదర్శి విజయ శారదారెడ్డి, వైస్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాష్‌చంద్ర అంతర్జాతీయ కన్వీనర్ డాక్టర్ ఎంఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. సివిల్ ఇంజనీరింగ్ రంగం రోజు రోజుకీ ఎన్నో కొత్త సాంకేతిక విప్లవ పరిస్థితులను ఎదుర్కొంటోందని అలాగే పర్యావరణ ఇబ్బందులను సైతం ఎదుర్కొంటుందన్నారు. సివిల్ ఇంజనీర్లు ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ సృజనాత్మకతతో ముందడుగు వేయాలన్నారు. వాటర్ రీసోర్సెస్ ఇంజనీరింగ్ విభాగం కూడా నేటి పెనుమార్పులను ప్రపంచంలోని వివిధ రకాలైన నీటి పద్ధతులను, వాటిని ఎలా మెరుగైన పద్ధతుల ద్వారా అన్ని ప్రాంతాలకు అందించవచ్చునో ఆలోచించి ఆ దిశగా అడుగులు వేయాలన్నారు.

ఏపీ ట్రాన్స్‌కో ఏఈ పరీక్ష ఫలితాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సరఫరా సంస్థలో ఖాళీల భర్తీకి సంబంధించి గత ఏప్రిల్‌లో నిర్వహించిన ఏఇ అర్హత పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను ట్రాన్స్‌కో వెబ్‌సైట్‌లో ఉంచినట్టు హైచ్ఆర్ఈడీ ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ-లెర్నింగ్‌తో పని సామర్థ్యం పెంపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆధునిక సాంకేతక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవటం ద్వారా పనిసామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలంగాణ రాష్ట్రప్రభుత్వ సలహాదారు డా.జీ.ఆర్. రెడ్డి అన్నారు. గురువారం డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఈ-లెర్నింగ్ అన్న అంశంపై వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం ప్రారంభసమావేశంలో డా.జీఆర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-లెర్నింగ్ యంత్ర పరికరాలను ఏవిధంగా ఉపయోగించుకోవాలన్న అంశంలో శిక్షణ ద్వారా సరైన అవగాహన పెంచుకోవాలన్నారు. 31జిల్లాల పరిపాలన వ్యవస్థలో ఉద్యోగులు ఈ-లెర్నింగ్‌ను అమలు చేయాలన్నారు.క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు రాబట్టేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి వృత్తి నైపుణ్యతను పెంచుకుని పనివిధానాన్ని సులభతరం చేసుకోవాలన్నారు. అంతకు ముందు డిపార్టమెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ (డీఓపిటీ) జేసీ దేవేశ్ చతుర్వేది మాట్లాడుతూ ఈ-లెర్నింగ్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఆమలు చేసేందుకు దేశంలో ఆరు రాష్ట్రాలను ఎంపిక చేసుకున్నట్టు తెలిపారు. అస్సాం, హర్యాన, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 82వేల మందికి ఈ-లెర్నింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. హెచ్ఆర్‌డీ డీజి బి.పి ఆచార్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని వివిధ శాఖలకు చెందిన 9 వేలమంది ఉద్యోగులకు ఈ-లెర్నింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. బంగారు తెలంగాణ లక్ష్యసాధనలో భాగంగా ప్రతిఒక్కరు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కేసీఆర్ ఢిల్లీ పర్యటన రద్దు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు తన ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఉప రాష్ట్రపతిగా ఎం.వెంకయ్య నాయుడు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం సంకల్పించారు. గురువారం రాత్రి ఢిల్లీ బయలుదేరాలని తొలుత నిర్ణయించుకున్నారు. అయితే అకస్మాత్తుగా తన పర్యటనను రద్దు చేసుకున్నారని ఆయన కార్యాలయ అధికారులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం నిజామాబాద్ జిల్లా పోచంపాడులో శ్రీరాంసాగర్ పునరుజ్జీవ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన అక్కడ జరిగిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. అనంతరం హైదరాబాద్ వచ్చారు. రాత్రి 8.30 గంటలకు కేసీఆర్ ఢిల్లీ వెళ్ళాల్సి ఉంది. రెండు రోజులపాటు ఢిల్లీలో ఉండాలనుకున్న కేసీఆర్ ప్రధాని మోడీని కలిసి ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించాలని ప్రతిపాదించారు. తిరిగి కేసీఆర్ ఢిల్లీకి ఎప్పుడు వెళ్ళేది ఇంకా ఖరారు కాలేదని అధికారులు తెలిపారు.

ఎస్సీ యువతకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ

- ట్రైనింగ్ తర్వాత రుణాలు ఇవ్వాలని నిర్ణయం
- దరఖాస్తులకు ప్రత్యేక వెబ్‌సైట్
- ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ యోచన

హైదరాబాద్,ఆంధ్రప్రభ : షెడ్యూల్డ్ కూలాల నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యతపై ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు స్వయం ఉపాధి హామీ పథకం కింది వివిధ రకాల యూనిట్లపై లబ్దిదారులకు రుణాలు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఆయా యూనిట్ల పనితీరుపై అవగాహన లేకపోవడం వల్ల మధ్యలోనే మానేస్తున్న సందర్భాలు ఉన్నాయని కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. ప్రభుత్వం నుంచి రుణం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఒక వైపు నిరుద్యోగ యువతకు రుణాలు విడుదల చేస్తూనే.. మరో వైపు వివిధ వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరమైన అంశాలపై శిక్షణ ఇప్పించాలని కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు. శిక్షణ కాలపరిమితి తర్వాత.. లబ్దిదారులకు రుణ సౌకర్యం కల్పించడం ద్వారా వారు మరో కొంత మందికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుందని ఆలోచన చేస్తున్నారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, వెల్డర్, కంప్యూటర్ తదితర రంగాలపై శిక్షణ తీసుకున్న ఎస్సీ నిరుద్యోగ యువత.. వారు మరి కొందరికి ఉపాధిని చూపించడానికి వీలుంటుంది. ఈ వృత్తి నైపుణ్యత శిక్షణ కార్యక్రమాలను రాష్ట్రంలోని 31 జిల్లాలలో ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నారు.

అభ్యర్థులు ఏ రంగంపైన ఎక్కువగా మక్కువ ఉంటుందో దానికి ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నారు. అంటే కార్పొరేషన్ ఎంపిక చేసిన వాటిపైనే కాకుండా దరఖాస్తు దారులకే అవకాశం ఇచ్చి.. వారి నిర్ణయం మేరకే శిక్షణ ఇప్పిస్తే బాగుంటుందని అభిప్రాయంతో ఉన్నారు. అందుకు గాను ఒక వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించి అభ్యర్థికి ఏ అంశంపైన ఇష్టమో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే విధంగా అవకాశం కల్పిస్తారు. జిల్లాల వారిగా కొన్ని యూనిట్ల వరకే పరిమితం చేయకుండా ఎంత మంది దరఖాస్తు చేసుకున్నా శిక్షణ ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. ఉదాహరణకు ఒక జిల్లా నుంచి కంప్యూటర్ పరిజ్ఞానం కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే, మరొక జిల్లాలో ఎలక్ట్రిషన్‌పై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయంటే గ్రూపుల వారిగా విడదీసి అందరికి శిక్షణ ఇప్పించనున్నారు. దీంతో వృత్తి నైపుణ్యత కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తికి శిక్షణ ఇప్పించేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయంతో ఉన్నారు. ఈ విధంగా రెండు రకాలుగా ఆలోచన చేయడం వల్ల ఏక కాలంలో ఎక్కువ సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు అవుతుందనే ఆలోచనతో కార్యాచరణ రూపొందిస్తున్నారు. వెబ్‌సెట్ ద్వారా దరఖాస్తులకు అవకాశం కల్పిస్తే రాజకీయ జోక్యం కూడా తగ్గే అవకాశం ఉంటుందని, తద్వారా అర్హులైన ప్రతి వ్యక్తికి శిక్షణ ఇప్పించడానికి వీలు ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయంపై ప్రభుత్వానికి సంబంధిత అధికారులు ఇప్పటికే ప్రతిపాదన పంపించారని తెలిసింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించాలనే యోచనలో సంబంధిత అధికారులు ఉన్నారు.



హై'డల్'

- ఒట్టిపోతున్న జలాశయాలు
- మసకబారుతున్న ఉత్పత్తి లక్ష్యాలు
- భారంగా విద్యుత్ కొనుగోళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ పాటికి రణగొణ ధ్వనులతో రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు పంచాల్సిన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు చడిచప్పిడి లేకుండా ఉస్సూరు మంటున్నాయి. వర్షాకాలం ప్రారంభమై రెండున్నర నెలలు కావస్తున్నా రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లోకి వరదనీటి చేరికలు లేకపోవటంతో జలవిద్యుత్‌ఉత్పత్తి లక్ష్యాలు మసకబారుతున్నాయి. విద్యుత్ ఉత్పత్తి రంగంలో అత్యంత తక్కవ ఖర్చుతో విద్యుత్‌ను అందచేసేది జలవిద్యుత్ రంగం ఒక్కటే. అందుకే విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్రంలో జలవిద్యుత్ రంగంపై పెద్ద మొత్తంలోనే ఆశలు పెట్టుకుని ఆ మేరకు ప్రతి యేటా విద్యత్ పంపిణీ ప్రణాళికలు రూపొందించుబకుంటూ ఉంటాయి. రాష్ట్రంలో ఉన్న జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, పోచంపాడ్, సింగూరు, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల ద్వారా జలవిద్యుత్ స్థాపిత సామర్థ్యం 2351మెగావాట్లు కాగా, జలాశయాల్లో నీటినిలువలు, ఎగువనుంచి చేరే నీటి లభ్యత తదితర అంశాల అధారంగా ఉత్పత్తికి ఉన్న అవకాశాలను బట్టి అందుబాటులోకి రానున్న జలవిద్యుత్ ప్రణాళికను రూపొందించుకుంటుటాయి. 2017-18లో రాష్ట్రంలోని అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టుల ద్వారా 1400 మిలియన్ యూనిట్ల విద్యుత్ లభిస్తుందని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు అంచనాలు వేసుకున్నాయి. రాష్ట్రంలో ప్రవహించే కృష్ణా, గోదావరి తదితర ప్రధాన నదుల పరివాహకంగా పెద్దగా వర్షాలు లేక పోవటంతో ప్రాజెక్టులు వెలవెల బోతున్నాయి. ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు గరిష్ట నీటి నిలువ సామర్థ్యాలకు మించి నీటి చేరికలు ఉన్నప్పటికీ కర్నాటక సరిహద్దులు దాటి కృష్ణా జలాలు కిందకు రావటంలేదు. అటు గోదావరినదీ జలాల పరిస్థితి అదేవిధంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది కూడా రాష్ట్రంలో జలవిద్యుత్ ప్రాజెక్టులపై పెట్టుకున్న ఆశలు ఆవిరవుతున్నాయి. రాష్ట్రంలో జలవిద్యుత్ లభ్యతను దృష్టిలో ఉంచుకుని 2015-16లో 4038 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ లభిస్తుందని లక్ష్యాలు రూపొందించుకోగా అందులో 621మిలియన్ యూనిట్లకు మించి విద్యుత్‌ను అందించలేకపోయాయి.

2016-17లో కూడ అంతకు ముందటి ఏడాది పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ లభ్యత లక్ష్యాలను తగ్గించి 3841 మిలియన్ యూనిట్లకు ప్రణాళిక రూపొందించుకున్నారు. అయితే గత ఏడాది ఎగువనుంచి నీటి ప్రవాహాలు గుడ్డిల్లో మెల్ల అన్నట్టుగా పెరగటంతో 621మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. గత రెండేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సారి జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను మరింత తగ్గించుకున్నారు. అయినప్పటికీ పరిస్థితుల్లో మార్పేమి కనిపించటంలేదు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటివరకూ రాష్ట్రలోని జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్ రెండు మిలియన్ యూనిట్లు కూడా దాటలేదంటున్నారు.

తాపకేంద్రాలే దిక్కు

రాష్ట్రంలో జలవిద్యుత్ ఉత్పత్తి, లభ్యతపై ఆశలు సన్నగిల్లుతుండటంతో విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్ర అవసరాలకోసం అధికంగా తాపవిద్యుత్ కేంద్రాలపైనే ఆధారపడుతున్నాయి. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తూ వాతవరణం కాస్త చల్లబడింది. దీంతో విద్యుత్ డిమాండ్‌పై కూడా వెసులుబాటు కలుగుతున్నట్టు విద్యుత్ పంపిణీ సంస్థలు చెబుతున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు 166.992 ఉండగా అందులో 48.025 మిలియన్ యూనిట్లు విద్యుత్ థర్మల్ కేంద్రాలనుంచే అందుతోంది. సింగరేణి నుంచి 29.328 మిలియన్ యూనిట్లు, సీజీఎస్ తదితరాల ద్వారా 41.355 మిలియన్ యూనిట్లు, ఎన్‌సీసీఎస్ తదితరాల ద్వారా 1.011మిలియన్ యూనిట్ల విద్యుత్ అందుతోంది. రాష్ట్రంలోని వ్యవసాయ, గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా మొత్తం 166.992 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను పంపిణీ చేస్తున్నట్టు విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు పేర్కొంటున్నారు.

ఆంధ్రప్రభ

శుక్రవారం 11 ఆగస్టు 2017

ముగిసిన టాటామోటార్స్, స్కోడా భాగస్వామ్య చర్చలు ఉపసంహరణ

న్యూఢిల్లీ : టాటామోటార్స్, వోక్స్‌వ్యాగెన్ గ్రూపునకుచెందిన ఆటో తయారీ కంపెనీ స్కోడా భాగస్వామ్యంలో వ్యాపారవకాశాల చర్చలకు ముగింపు పలికాయని టాటామోటార్స్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపింది. నాలుగు నెలల క్రితం ఈ రెండు కంపెనీలు భాగస్వామ్యం లో వ్యాపారాలు చేయాలని నిర్ణయించుకున్నాయి. అయితే సాంకేతికంగా చూస్తే వ్యూహాత్మకంగా చేపట్టిన భాగస్వామ్య ఒప్పందాల వల్ల ఫలితాలు ఆశించినంతగా ఉండవని నిర్ణయానికి వచ్చాయి. అయితే భవిష్యత్తులో ఇరు కంపెనీలు భాగస్వామ్యంలో వ్యాపారాలు చేసు కోవడానికి అవకాశాలు ఉంటే ముందుకు వెళతా మని టాటా మోటార్స్‌సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ గ్యుంటెర్ బట్స్‌చక్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

ప్రభుత్వానికి భారీగా తగ్గిన ఆర్‌బీఐ డివిడెండ్

- 2016-17 ఆర్థిక సంవత్సరానికి డివిడెంట్ రూ.30,659 కోట్లు
- అంతకుక్రితం ఏడాదితో పోల్చుకుంటే సగానికి సగం తగ్గాయి
- పెద్దనోట్ల రద్దుతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి



ముంబై: రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తమ వద్ద అదనంగా ఉన్న నిధులను సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రభుత్వానికి బదలీ చేస్తూ ఉంటుంది. అయితే గత ఆర్థిక సంవత్సరం 2016-17లో కేవలం రూ.30,659 కోట్లు మాత్రమే బదలీ చేయగలిగింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే సగానికి సగం తగ్గింది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ ప్రభుత్వానికి రూ.65,876 కోట్లు బదలీ చేసింది.

ప్రభుత్వానికి తక్కువ మొత్తంలో డివిడెండ్ చెల్లించడానికి గల కారణాలను ఆర్‌బీఐ వివరించలేదు. అయితే ఆర్థిక వేత్తల అంచనా ప్రకారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ నవంబర్ 8 అర్ధరాత్రి నుంచి పెద్దనోట్లు రూ.500, రూ.1,000 కరెన్సీ నోట్ల చలామణిని చట్టబద్ధంగా రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనికి బదులుగా కొత్త కరెన్సీ నోట్ల ముద్రణకు పెద్దమొత్తంలో ఆర్‌బీఐ వ్యయం చేసి ఉంటుందని చెబుతున్నారు.

ఆర్‌బీఐ అత్యంత తక్కువ డివిడెండ్ చెల్లించింది 2011-12 ఆర్థిక సంవత్సరంలో ఆ ఏడాది ఆర్‌బీఐ వద్ద అదనంగా ఉన్న నిధులను రూ.16,010 కోట్లను ప్రభుత్వఖాతాకు బదలీ చేసింది. అలాగే 2012-13 ఆర్థిక సంవత్సరంలో రూ.33,010 కోట్లు వరకు ప్రభుత్వ ఖాతాకు బదలీ చేసింది. ఇదిలా ఉండగా రిజర్వుబ్యాంకు ఆర్థికసంవత్సరం జులై నుంచి జూన్ వరకు ఉంటుంది. కాగా గురువారం నాడు రిజర్వు బ్యాంకు బోర్డు సమావేశమై ఈ ఖాతాలను క్లియర్ చేసిన తర్వాత వచ్చే వారం వార్షిక నివేదక ముద్రించే అవకాశాలున్నాయి.

2012-13 ఆర్థికసంవత్సరంలో వై హెచ్ మలేగాం కమిటీ రిజర్వుబ్యాంకు వద్ద ఉన్న అదనపు నిధులను ప్రభుత్వానికి బదలీ చేయాలని సిఫారసు చేసింది. అప్పటి నుంచి ఆర్‌బీఐ తమ వద్ద ఉన్న అదనపు నిధులను ప్రభుత్వఖాతాకు బదలీ చేస్తూ వస్తోంది. కాగా 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.52,679 కోట్లు, 2014-15 లో రూ.65,896 కోట్ల వరకు ప్రభుత్వ ఖాతాలో జమచేసింది.

ఈ ఆర్థిక సంవత్సరం 2017-18 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఆర్‌బీఐతో పాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి రూ.74,901 కోట్ల వరకు డివిడెండ్ వస్తుందని ప్రభుత్వం ఆశించింది. అటు తర్వాత అధికారులు వీటిలో ఆర్‌బీఐ వాటా రూ.58,000 కోట్ల వరకు ఉంటుందని ప్రకటించారు.

ఇదిలా ఉండగా రిజర్వుబ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఈ ఏడాది జులైలో పార్లమెంటరీ ప్యానెల్ ముందు హాజరై.. పాత నోట్ల లెక్కింపు ఇంకా పూర్తి కాలేదని అన్నారు. అదే సమయంలో రద్దు చేసిన పెద్దనోట్లు ఆర్‌బీఐకి రాలేదంటే.. దానికి ఆర్‌బీఐ బాధ్యత వహించాల్సి ఉంటుంది కాబట్టి ఆ మొత్తాన్ని డివిడెండ్ రూపంలో ప్రభుత్వ ఖాతాకు జమచేయలే మని చెప్పారు. కేంద్రబడ్జెట్లో ఆర్‌బీఐ పెద్దనోట్ల తర్వాత పెద్దమొత్తంలో ప్రత్యేక డివిడెండ్ వస్తుందని భావించలేదు. అయితే కొంత మంది ఆర్థికవేత్తలు మాత్రం పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రభుత్వానికి లక్షలాది కోట్ల రూపాయలు డివిడెండ్ రూపంలో వస్తుందని అంచనా వేశారు. దీని గురించి వివరించి చెప్పాలంటే ప్రభుత్వం నల్లధనాన్ని వెలికితీయడానికి పెద్దనోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. చలామణిలో ఉన్న మొత్తం నగదులో కొన్ని లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులో జమ కావని ప్రభుత్వం భావించింది. తీరా చూస్తే ఎంతైతే వ్యవస్థలో చలామణిలో ఉన్న మొత్తం డబ్బు బ్యాంకుల్లో జమ అయ్యింది. కేవలం కొన్ని వేల కోట్ల రూపాయలు బ్యాంకుల్లో జమ కాలేదు. దీన్నే నల్లధనం అంటారు. బ్యాంకులో జమకానీ మొత్తం ప్రభుత్వం పరం అవుతుంది. మొత్తానికి చెప్పాల్సిందేమిటంటే ప్రభుత్వం లెక్కతప్పిందని చెప్పవచ్చు. మోడీ అనుకుందొకటి .. వాస్తవంగా జరిగింది మరోటి.

ప్రభుత్వానికి తక్కువ మొత్తంలో డివిడెండ్లు రావడంతో ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోలేదని కేర్ రేటింగ్స్ ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్‌నీవస్ అభిప్రాయపడ్డారు. డివిడెండ్‌లు తగ్గడంతో ద్రవ్యలోటు జీడీపీలో 3.2 శాతం నుంచి 3.4 శాతానికి పెరగవచ్చునని చెబుతున్నారు.

బ్యాంకుల వద్ద ఉన్న అదనపు ద్రవ్యాన్ని (సుమారు రూ.5 లక్షల కోట్ల)వరకు ఉంటుందని అంచనా.. దానిపై రిజర్వు బ్యాంకు 6 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పెద్దనోట్ల రద్దు తర్వాత సరాసరి రోజుకు ఆర్‌బీఐ వద్ద రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో ద్రవ్యం వచ్చే చేరింది. ఆర్థికవేత్తల అంచనా ప్రకారం డాలర్ మారకంతో రూపాయి బలపడ్డంతో రూపాయి ప్రాతిపదికన చూస్తే రాబడి తగ్గిందని... ఆర్‌బీఐ వద్ద ఉన్న విదేశీ ద్రవ్యం ప్రకారం చూస్తే ఈ ఏడాది జనవరి నుంచి డాలర్ మారకంతో రూపాయి ఆరు శాతం వరకు పెరిగింది కాబట్టి దీనిపై పెద్ద రాబడి ఉండదని ఆర్థికవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. కాబట్టి ప్రభుత్వానికి పెద్దమొత్తంలో డివిడెండ్ రూపంలో జమచేయలేకపోయిందని వివరిస్తున్నారు.

హెరిటేజ్ వాటాల విభజన

నోవాండీ ఎస్ఎన్‌సీతో గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్



హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ బోర్డు రూ.10 ముఖ విలువ కలిగిన షేర్లను రెండుగా విభజించింది. దీంతో స్టాక్ మార్కెట్లో షేరు విలువ పెరుగుతుందని, చిన్న ఇన్వెస్టర్లు కూడా షేర్లు కొనుగోలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ తంతు ముగియడానికి కనీసం రెండు నెలల సమయం పడుతుంది. ఫ్యూచర్ రిటైల్‌తో చట్ట ప్రకారం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రూ.2 ముఖ విలువ కలిగిన 1,78,47,420 వాటాలను హెరిటేజ్‌కు కేటాయించింది. ఇదిలా ఉండగా కంపెనీ రిలయన్స్ రిటైల్‌కు చెందిన డెయిరీ వ్యాపారాన్ని టేకోవర్ చేసినట్లు హెరిటేజ్ ఫుడ్స్ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ భువనేశ్వరి బీఎస్ఈకి సమాచారం అందించింది.

ఇక అసలు విషయానికి వస్తే జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికరలాభం బాగా తగ్గి రూ.10.37 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.17.10 కోట్లని తెలియజేసింది. అయితే రెవెన్యూ మాత్రం బాగా పెరిగి రూ.618.27 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.468.39 కోట్లను నమోదు చేసింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్స రానికి కంపెనీ నికరలాభం రూ.69.50 కోట్లకు ఎగబాక గా.. రెవెన్యూ రూ.1898.75 కోట్లు నమోదు చేసింది.

ఫ్రాన్స్ కంపెనీతో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు: ఇదిలా ఉండగా హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ బోర్డు ఫ్రాన్స్‌కు చెందిన నోవాన్‌డీ ఎన్ఎన్‌సీతో కలిసి ర్యు డే లా రిపబ్లికా మారోమీ ఫ్రాన్స్‌లో భాగస్వామ్యంలో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. 50:50 భాగస్వామ్యంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు రూ.1 కోటి అధీకృత మూలధనంతో ఫ్రూట్, ఫ్లేవర్డ్ యోగార్ట్స్ (పెరుగు) తయారు చేసి మార్కెట్ చేస్తారు. దీంతో పాటు పాశ్చాత్యదేశాల్లో లభించే మిఠాయిలు కూడా తయారు చేసి మార్కెట్ చేస్తుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు రెండు కంపెనీలు కలిసి ఇద్దరేసి డైరెక్టర్లను నామినేట్ చేస్తాయి. మొదటి ప్లాంట్‌కు రూ.16 కోట్లు పెట్టుబడులు పెడతారు. వచ్చే ఏడాది నుంచి వాణిజ్యపరంగా లావాదేవీలు మొదలుపెడుతుందని అంచనా.

సహారాకు సుప్రీంకోర్టు షాక్

- ఆంబేవ్యాలీ వేలం స్టేకు నిరాకరణ

న్యూఢిల్లీ : సహారాగ్రూపు చీఫ్ సుబ్రతారాయ్‌కు సుప్రీంకోర్టులో ఎలాంటి ఊరట లభించలేదు. సహారా తరపున గురువారం నాడు కపిల్‌సిబాల్ ఆంబేవ్యాలీ వేలాన్ని నిలిపివేయాలని కోర్టును కోరారు. అయితే దీనిపై కోర్టు శుక్రవారం నాడు స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఇదిలా ఉండగా సహారా శుక్రవారం నాడు ఒక ప్రకటనలో రూ.5,000 కోట్లు ఇన్వెస్టర్లకు చెల్లిండచానికి గట్టి ప్రయత్నాలు చేస్తోందని తెలిపింది. అలాగే రూ.11వేల కోట్లతో ఆంబేవ్యాలీని అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. కాగా సుప్రీంకోర్టు వేలం పాట స్టేకు నిరాకరించడంతో ఈ నెల 14న ఆంబేవ్యాలీ వేలం నోటీసు విడుదల అవుతుంది.

దేశవ్యాప్తంగా ఎల్‌విబి విస్తరణ

- లక్ష్మీవిలాస్ బ్యాంకు ఎండి ముఖర్జీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రైవేట్ రంగ బ్యాంకులలో ఒకటైన లక్ష్మీవిలాస్ బ్యాంకు దేశవ్యాప్తంగా ప్రత్యేకమైన కమర్షియల్ బ్యాంకింగ్ శాఖలను ప్రారంభించనున్నదని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పి.ముఖర్జీ తెలిపారు. తొలిదశలో ఈ ప్రత్యేకమైన శాఖలను కర్నాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ప్రారంభించిన అనంతరం దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన చెప్పారు. ఈ శాఖలు భారీ కార్పోరేట్స్, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలతో పాటుగా ప్రభుత్వరంగ సంస్థల అవసరాలను పూర్తిగా తీర్చనున్నాయని చెప్పారు. కమర్షియల్ బ్యాంకింగ్ వ్యాపారంలో భాగంగా ఎంఎస్ఎంఈలకు పూర్తిస్థాయిలో బ్యాంకింగ్ ఉత్పత్తులు, సేవలను అందిస్తుందన్నారు. రైతులకు ట్రాక్టర్ల కొనుగోలుకు, అలాగే చిన్న మొత్తంలో బంగారు, వ్యాపార రుణాలను కూడా అందిసామన్నామని ముఖర్జీ చెప్పారు.

విస్తరణబాటలో బ్రిడ్జ్‌స్టోన్


హైదరాబాద్ : ప్రపంచంలోనే అతి పెద్ద టైర్ల కంపెనీ బ్రిడ్జ్‌స్టోన్, పూనెలోని చకాన్, ఇండోర్‌లోని ఖేదా ప్లాంట్‌లో 304.3 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టి విస్తరించబోతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది నుంచి వచ్చే ఐదేళ్ల వరకు ఈ పెట్టుబడుల వరద కొనసాగుతుంది. దేశంలో రోజు రోజుకు పెరిగిపోతునన టైర్ల డిమాండ్‌ను తీర్చేందుకు ఈ పెట్టుబడులు తోడ్పడతాయని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కజుతోషి ఒయామా పేర్కొన్నారు.

సిండికేట్ బ్యాంక్ బిల్డర్స్ మీట్

హైదరాబాద్ : సిండికేట్ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం నాడు ఖైరతాబాద్‌లోని ఆర్ఎంఎల్‌సీ కార్యాలయంలో బిల్డర్స్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి 50 మంది బిల్డర్స్ హాజరయ్యారు. వీరికి జనరల్ మేనేజర్ కెవీఎస్ మణి స్వాగతం పలికారు. ప్రాంతీయ జనరల్ మేనేజర్ పళనిస్వామి సిండికేట్ బ్యాంకు అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. హోమ్‌లోన్; ఎంఎస్ఎంఈ రుణాలు వీలైనంత త్వరగా విడుదల చేస్తున్నట్లు చెప్పారు. బిల్డర్స్ సందేహాలను బ్యాంకు సిబ్బంది నివృత్తి చేశారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటాచలం ఆర్ఎంఎల్‌సీ, స్వామినాథరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌తో పాటు సిబ్బంది హాజరయ్యారు.

నష్టాల్లోనే మార్కెట్లు

- యూఎస్-ఉ.కొరియాల సెగ
- వరుసగా నాలుగో రోజు అదే సీన్?




ముంబై: అమెరికా - ఉత్తర కొరియాలు కయ్యానికి కాలుదువ్వడంతో ఇన్వెస్టర్లు నష్టపోతున్నారు. వరుసగా గత నాలుగు రోజుల నుంచి మార్కెట్లు నష్టాల్లో కూరుకుపోతున్నాయి. బీఎస్ఈ సూచి ఒక నెల కనిష్ఠానికి దిగి వచ్చింది... 267 పాయింట్లు పతనమైంది. నిఫ్టీ 9,900 మార్కు కంటే ఎక్కువే దిగివచ్చింది. ఇటీవల కాలంవరకు స్టాక్ మార్కెట్లు సరికొత్త రికార్డు బద్దలు కొడుతూ ముందుకు దూసుకుపోతుంటే తాజాగా యూఎస్ - ఉ. కొరియాల వల్ల రివర్స్‌గేర్‌లో పయనిస్తున్నాయి. మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి డొల్ల కంపెనీలపై కొరడా ఝుళిపించడంతో ఇప్పటికే డీలా పడ్డాయి. తాజాగా అమెరికా - ఉ.కొరియాల మధ్య ఉద్రికత్త స్టాక్ మార్కెట్లను నష్టాల్లోకి నెట్టివేసింది. గురువారం మార్కెట్లు నష్టాలతో మొదలయ్యాయి. అటు తర్వాత మరింత కిందికి అంటే 31,422.80 మార్కుకు దిగివచ్చి మార్కెట్ ముగిసే నాటికి 266.51 పాయింట్లు నష్టపోయి చివరగా 31,360.63 వద్ద ముగిసింది. వరుసగా గత మూడు రోజుల నుంచి 527.57 పాయింట్లు క్షీణించింది.నిఫ్టీ 87.80 పాయింట్లు నష్టపోయి 9,820.25 వద్ద ముగిశాయి. బీఎస్ఈలో నష్టపోయిన షేర్ల విషయానికి వస్తే డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా,సిప్లా, ఎస్‌బీఐ, లూపిన్, పవర్‌గ్రిడ్‌లు 4.77 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్‌లులాభాలను చవిచూసాయి. డాలర్ మారకంతో రూపాయి బలహీనపడ్డమే కారణం.

మూడు రోజుల్లో రూ.5 లక్షల కోట్ల సంపద ఊఫ్

స్టాక్ మార్కెట్లు వరుసగా గత మూడు రోజుల నుంచి నష్టాల్లో మునిగిపోవడంతో మదుపరుల సంపద ఏకంగా రూ.5 లక్షల కోట్ల వరకు మంచులా కరిగిపోయింది. బీఎస్ఈ 700 పాయింట్లు నష్టపోయింది. గ్లోబల్ మార్కెట్ల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ సోమవారం నాడు రూ.133,28,547 కోట్ల నుంచి గురువారం తిరిగి చూసే సరికి రూ.127,98,957 కోట్లకు దిగివచ్చింది. మొత్తానికి రూ.529,590 కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరం అయ్యింది. వరుసగా గత మూడు ట్రేడింగ్ సెషన్‌లలో టాటామోటార్స్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లు రూ.10వేల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ నష్టపో యాయి. ఐటీసీ, భారత్‌పెట్రోలియం కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, కోల్ ఇండియా, మారుతి సుజుకి ఇండియా, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, క్యాడిలా హెల్త్‌కేర్‌ల మార్కెట్ క్యాప్ రూ.7,000 కోట్ల నుంచి రూ.10,000 కోట్ల వరకు నష్టపోయాయి.

ప్రభుత్వ మూలధనం వ్యయం పెంపు

- 2019-20 నాటికి రూ.3.9 లక్షల కోట్లకు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2019-20 ఆర్థికసంవత్సరం నాటికి మూలధనం వ్యయం 25 శాతం పెంచి రూ.3.9 లక్షల కోట్లు చేస్తుందని, రక్షణ రంగంపైనే ఏకంగా 22 శాతం పెంచే అవకాశం ఉందని శుక్రవారం నాడు పార్లమెంటులో జరిగిన అర్ధసంవత్సరం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మూలధనం వ్యయం రూ.3,09,801 కోట్లుగా కేటాయించగా.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.3,41,000 కోట్లకు అటు తర్వాత అంటే 2019-20 నాటికి రూ.3,90,000 కోట్లకు చేరుతుందని అంచనా. రక్షణరంగానికి 30 శాతం కేటాయింపులు ఉంటాయి. ఈ ఆర్థిక సంవత్సరం రూ.91,580 కోట్ల నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.1,01,137 కోట్లకు 2019-20 నాటికి రూ.1,11,706 కోట్లకు పెంచుతారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం రెవెన్యూ వ్యయం ప్రాజెక్టులపై ప్రభుత్వం మొత్తం వ్యయం రూ.21.46 లక్షల కోట్లు వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.23.4 లక్షల కోట్లు, 2019-20 నాటికి రూ.25.95 లక్షల కోట్లకు ఎగబాకుతుంది.వాటిలో ఎరువుల సబ్సిడీ రూ.70వేల కోట్లకు వరకు ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి 2019-20 వరక ఇదే స్థాయిలో ఉంటుంది. ఆహార సబ్సిడీ వచ్చే ఆర్థికసంవత్సరానికి రూ.1.75 లక్షల కోట్లు. ఆపై వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.2 లక్షల వరకు ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆహార సబ్సిడీ రూ.1.45 లక్షల కోట్లు కేటాయింపులు జరిగాయి. పెట్రోలియం సబ్సిడీ వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.18వేల కోట్లకు దిగివస్తాయి. కాగా ఈ ఆర్థిక సంవత్సరం రూ.25వేల కోట్లు, 2019-20 నాటికి రూ.10వేల కోట్లకు దిగివస్తాయి. ప్రభుత్వం క్రమంగా పెట్రోలియం ఉత్పత్తులపై సబ్సిడీ ఎత్తివేస్తోంది.

ద.మ.రైల్వేలో 12 శాతం వృద్ధి

ద.మ.రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉద్యోగులు బాధ్యతతో కూడిన సహకారాన్ని అందించడం వల్లనే భారత రైల్వేలో దక్షిణ మధ్య రైల్వే అగ్రగామిగా నిలిచిందని జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ వెల్లడించారు. గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు అందించిన తోడ్పాటు అనిర్వచనీయం అన్నారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ 47వ వార్షిక సర్వసభ్య సమావేశంలో జనరల్ మేనేజర్ పాల్గొన్నారు. జోన్ ఆర్థిక పురోగతిని ఈ సందర్భంగా కార్మికులకు తెలియచేశారు. ఏప్రిల్ 2017 నుండి జూలై వరకు 12 శాతం వృద్ధి రేటును సాధించామని ప్రకటించారు. రూ. 4,320 కోట్లు ఆర్జించామన్నారు. సరకు రవాణా, ప్రయాణికుల రవాణా ఇటీవలి కాలంలో బాగా పెరిగిందన్నారు. ఈ వృద్ధి రేటు సాధించడంలో ఉద్యోగులు కీలక భూమిక పోషించారని అభినందించారు. గుర్తింపు కార్మిక సంఘం లేవనెత్తే అంశాలు రైల్వేల ప్రగతికి, ఉద్యోగుల ప్రయోజనాలకు దోహదపడుతున్నాయని వివరించారు. రైల్వే ఉద్యోగుల సంక్షేమం విషయంలో సానుకూలంగా వ్యవహరించడం జరుగుతుందని జనరల్ మేనేజర్ వెల్లడించారు. పదోన్నతులు కల్పించడంలో ఎలాంటి జాప్యం కనబర్చడం లేదని, ఉద్యోగులు సకాలంలో ప్రయోజనం పొందే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని వివరించారు. ఉద్యోగులు, వారి కుటుంబాల వైద్య సేవల కోసం రైల్వే ఆసుపత్రులను ఆధునీకరించడం, అవసరమైన మేరకు డాక్టర్లు, సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. మేరుగైన వైద్య సేవల కోసం రిఫరల్ ఆసుపత్రుల సంఖ్యను పెంచుతున్నామని వివరించారు. పాస్‌పోర్టు మేళా, జాబ్‌మేళాకు మజ్దూర్ యూనియన్ అందించిన సహకారం అభినందనీయం అన్నారు. యూనియన్ నాయకులు శివగోపాల్ మిశ్రా, శంకర్‌రావు, కె.శ్రీనివాస్ తదితరులు మాట్లాడిన వారిలో ఉన్నారు.

స్వచ్ఛ భారత్ హాకథాన్‌కు సలహాలివ్వండి

గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూప్రసాద్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ హ్యాకతాన్‌కు సలహాలు, సూచనలు ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూ ప్రసాద్ కోరారు. స్వచ్ఛ భారత్ హ్యాకతాన్‌కు అన్ని రకాల వ్యక్తులు, సంస్థలు, నిపుణులు వారి ఆలోచనలు పంపించవచ్చునని తెలిపారు. సంబంధిత ఆలోచనలను కేంద్ర ప్రభుత్వం వెబ్‌సైట్‌కు ఈనెల 25వ తేదీలోగా తమ ఆలోచనలను పంపించాలని కోరారు. సెప్టెంబర్ 7వ తేదీన నిపుణుల కమిటీ పరిశీలిస్తుందని, సెప్టెంబర్ 8న ఉత్తమ సలహాలు, సూచనలను ఎంపిక చేసి తుది జాబితాను ప్రకటిస్తారని తెలిపారు. పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల వినియోగం పెంచుటకు, వివిధ పద్ధతులు, సాంకేతిక పరిష్కారములు, ఆలోచనలు పంపించాలని కోరారు. వీటిలో ఆరు ప్రధాన కార్యక్రమాలపై పంపించాలని తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ, వాడకము పర్యవేక్షణ, మూల్యాంకనం చేయడం, మరుగుదొడ్ల వాడకం పెరిగేందుకు వ్యక్తుల స్వభావం, అల వాట్లు మార్చుకోవడం, మరుగుదొడ్ల నిర్మాణంలో నేల, వ్యక్తులు నివసిస్తున్న ప్రాంతాలు, మరుగుదొడ్డి నిర్మించేందుకు సాంకేతిక పరమైన సలహాలు, పాఠశాలల్లో ఉండే మరు గుదొడ్లను విద్యార్థులు పూర్తిగా వినియోగించుకోవడం, వాటి నిర్వహణ, పర్య వేక్షణకు తగి న సూచనలు, వ్యర్థాలను సురక్షితంగా తొలగించుట, పర్యావరణానికి ఎలాంటి హాని లేకుం డా ఉండేందుకు సాంకేతికపరమైన పరిష్కార మార్గాలు, మరుగుదొడ్లు, ఇతర పద్ధతు ల్లో వ్యర్థాలను సాంకేతిక పద్ధతుల్లో తొలగించేందుకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు.

తెలంగాణ అమరుల స్ఫూర్తి యాత్ర

హైదరాబాద్,ఆంధ్రప్రభ : టీజేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న తెలంగాణ అమరుల స్ఫూర్తి యాత్రను నాలుగో విడతగా సీఎం చంద్రశేఖర్‌రావు కుమార్తె ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్‌లో రెండు రోజులు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు మూడు విడుతలుగా చేపట్టిన స్ఫూర్తియాత్ర విజయవంతం కావడంతో.. నాలుగో విడత కార్యక్రమం అంతకంటే ఎక్కువగా విజయవంతం చేసేందుకు టీజేఏసీ కసరసత్తు చేస్తోంది. శుక్రవారం ఉదయం గన్‌పార్కు వద్ద తెలంగాణ అమరుల స్థూపం వద్ద టీజేఏసీ చైర్మన్ కోదండరామ్‌తో పాటు నాయకులు నివాళులు అర్పించి నిజామాబాద్ జిల్లాకు బయలుదేరుతారు. మొదటి రోజు బస్వాపూర్, కామారెడ్డి, లింగంపేట్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, రెండో రోజు బీర్కూర్, కోటగిరి, రుద్రూర్, నవిపేట్, సారంగాపూర్ తర్వాత నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నారు. అయితే ఇప్పటి వరకు టీజేఏసీ మూడు విడతలుగా చేపట్టిన అమరుల స్ఫూర్తి యాత్ర కేసీఆర్ కుటుంబం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాల్లోనే నిర్వహించిన విషయం తెలిసిందే. మొదటి విడత సంగారెడ్డి నుంచి మంత్రి హరీశ్‌రావు ప్రతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలో సభను నిర్వహించారు. రెండో విడత మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లను ఎంచుకోగా మూడో విడత ఏకంగా సీఎం కేసీఆర్ నియోజక వర్గమైన గజ్వేల్‌లోనే భారీ సభను నిర్వహించారు. ఇప్పుడు కవిత ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ లోక్‌సభపై టీజేఏసీ దృష్టి పెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నర్సంపేటను జిల్లా కేంద్రం చేయండి

ఎస్పీసింగ్‌కు వినతి పత్రం సమర్పించిన తెదేపా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నర్సంపేటను వరంగల్ రూరల్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తెదేపా నాయకులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్‌ను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం గత 10 నెలల క్రితం నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలు, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలను కలుపుకుని వరంగల్ జిల్లా రూరల్‌గా ప్రకటిందన్నారు. కానీ జిల్లా కేంద్రం ఎక్కడ అనేది స్పష్టమైన ప్రకటన చేయలేదని ఎస్పీసింగ్‌కు ఇచ్చిన వినతి పత్రంలో తెదేపా సీనియర్ నాయకుడు రావూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.15 రోజుల క్రితం ప్రభుత్వం గీసుగొండు మండలం మొగిలిచర్ల గ్రామంను జిల్లా కేంద్రంగా ప్రతిపాదన తీసుకవచ్చిందన్నారు. కాని మొగలిచర్ల గ్రామం వర్ధన్నపేటకుగానీ, పరకాలకుగానీ, నర్సంపేటకుగాను సముచిత స్థానం కాదని తెలిపారు. ఈ నేపథ్యంలో నర్సింపేట్‌ను వరంగల్ రూరల్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడమే అన్ని విధాలుగా మంచదని సూచిస్తూ వినతి పత్రం సమర్పించారు.

తండాలు..పంచాయతీలు కావా?

బీజేపీ ఎస్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ బిక్షునాయక్



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఐదు వందల జానాభా ఉన్న తండాలను గ్రామపంచాయతీలుగా చేస్తామన్న ప్రభుత్వ హామీని అమలు చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ బిక్షునాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 3400 తండాలకు, గూడాలకు రహదారులు లేవని, కాలినడకతోనే ప్రయాణం కొనసాగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 40 శాతం గిరిజన మహిళలు అక్షరాస్యతకు దూరంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఫసల్ బీమా యోజన పథకాలు ప్రజలకు అందడం లేదన్నారు. హైదరాబాద్‌లో గిరిజన భవన్‌కు శంకుస్థాపన చేసి ఏడాది దాటిన ఇప్పటి వరకు పురోగతి లేదని ఆయన విమర్శించారు. హాస్టళ్లలో విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తండాలకు రహదారుల విషయంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు.

ఏపీలో జపాన్ పరిశ్రమ

సీఎంతో జపాన్ బృందం భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధికి పెట్టుబడులు వెల్లువలా తాకుతున్నాయి. రాష్ట్రంలో రూ.1540 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి జపాన్ కంపెనీ టోరే రూ.1000 కోట్లు, హీరో మోటార్ కార్పొరేషన్ కంపెనీ రాక్‌మన్ ఇండస్ట్రీస్ రూ.540 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి. ప్రధాని నరేంద్రమోడీ మేడిన్ ఇండియా పిలుపు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మేకిన్ ఆంధ్రప్రదేశ్ పిలుపు తర్వాత పరిస్థితిని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మీదట ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించినట్లు టోరే కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యమంత్రి పిలుపుతో శ్రీసిటీని తాము తమ పెట్టుబడికి, వ్యాపార విస్తరణకు గమ్యస్థానంగా నిర్ణయించుకున్నట్లు వివరించారు. శ్రీసిటీలో టెక్నికల్ టెక్స్‌టైల్ ఉత్పాదక పరిశ్రమను నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా 100 మందికి, పరోక్షంగా 300 నుంచి 400 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి టోరే గ్రూప్ ఆఫ్ కంపెనీ వార్షిక టర్నోవరు 20.3 బిలియన్ డాలర్లని తెలిపారు. ప్రపంచంలోని 25 దేశాల్లో తమ సంస్థకు పరిశ్రమలు ఉన్నాయని, ఓవర్సీస్ నెట్‌సేల్స్ 9.5 బిలియన్ డాలర్లని తెలిపారు. తమ సంస్థల్లో 46,248 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. టోరే గ్రూప్ ఫైబర్ టెక్స్‌టైల్స్, కార్బన్‌ఫైబర్, లైఫ్ సైన్స్, రసాయన, పర్యావరణం, ఇంజనీరింగ్ రంగాలలో వ్యాపారం చేస్తోందని వివరించారు. భారత్‌లో తన వ్యాపార విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసిన టోరే కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో టోరే ఇండియా విభాగం కంపెనీ ప్రతినిధులు, రాక్‌మెన్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో సమావేశమయ్యారు. టోరే ఇండియా గ్రూప్ కంపెనీ శ్రీసిటీలో తన యూనిట్‌కు వచ్చే ఏడాది జనవరిలో శంకుస్థాపన చేసి 2020కి ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించనున్నది. చిత్తూరు జిల్లా దక్షణ భారతదేశానికే లాజిస్టిక్‌హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అటు చెన్నయ్ నగరానికి, ఇటు కృష్ణపట్నం పోర్టుకు దగ్గరగా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల సంస్థ నుంచి శ్రీసిటీకి భూమిని బదలాయిస్తుందన్నారు. నెలాఖరులోగా ఈ పక్రియ పూర్తవుతుందన్నారు.



రాక్‌మెన్ ఇండస్ట్రీస్ పెట్టుబడులు రూ.540 కోట్లు

ఇదిలా ఉంటే హీరో మోటో కార్ప్ గ్రూప్‌నకు అనుబంధంగా ఉన్న రాక్‌మెన్ ఇండస్ట్రీస్ ఆంధ్రప్రదేశ్‌లో రూ.540 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. రూ.2105 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగిన ఈ గ్రూప్ తన ఉత్పాదక ప్లాంటును చిత్తూరు జిల్లాలో నెలకొల్పనుంది. హీరో మోటార్ కార్ప్, ఫోర్డ్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ అవసరాలు తీరుస్తోంది. ఈ ఉత్పాదక ప్లాంటు ఏర్పాటయితే 4000 ఉద్యోగావకాశాలు కలుగుతాయని కంపెనీ డైరెక్టర్ వీరరాఘవన్ సీఎంకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ ఉత్పాదక యూనిట్ ద్విచక్రవాహనాలకు, నాలుగు చక్రాల వాహనాలకు కావలసిన అల్యూమినియం డైకాస్ట్ భాగాలను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ ప్రాజెక్ట్‌ను 3 దశలలో నెలకొల్పుతామన్నారు. మొదటి దశలో 2019 నాటికి రూ.300 కోట్ల పెట్టుబడులతో 600 నుంచి 700 ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వివరించారు. చిత్తూరులో నెలకొల్పే తమ యూనిట్ ద్వారా రూ.600 కోట్ల వార్షిక టర్నోవరు ఉండగలదని అంచనా వేస్తున్నట్లు కంపెనీ డైరెక్టర్ వీరరాఘవన్ సీఎంకు తెలిపారు.చంద్రబాబు స్పందిస్తూ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ జాస్తి కృష్ణకిషోర్, టోరే ఇండి యా విభాగం కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ షిజెకరు సెవెంగా, టోరే భారత విభాగం వైస్ ప్రెసిడెంట్ అజయ్ సింగ్ సిరోహి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యుకిషి దెగుషి, డైరెక్టర్ కట్సుయుకి యమదే, రాక్‌మెన్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ వి. వీరరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

సోమన్ గుర్తిలో వృద్ధాశ్రమాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి

పూడూర్, కెఎన్ఎన్ : పూడూర్ మండలంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ సోమన్‌గుర్తిలో వృద్ధాశ్రమాన్ని ప్రారంభించి అనంతరం చిన్న బండ తాండలో హరితహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా ప్రతినిధులతో కానీ, మీడియాతో కానీ మాట్లాడలేదు. ఎన్నో ఆశలతో ఈ ప్రాంత ప్రజలు ఉప ముఖ్యమంత్రి పర్యటనపై ఆశలు పెట్టుకోగా ఉప ముఖ్యమంత్రి నోరు మెదపక పోవడం ఆశ్చర్యం కలిగించింది. రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దివ్య, ఎస్‌పీ అన్నపూర్ణతో కలిసి మొక్కలు నాటారు. మండలానికి ఉప ముఖ్యమంత్రి హోదాలో ఏవైనా నిధులు కేటాయిస్తారన్న ఆశలు అడియాశలయ్యాయి. ఉప ముఖ్యమంత్రి వచ్చే సమయానికి సరిగ్గా వర్షం ప్రారంభం కావడంతో చాలా మంది ఆయన కోసం ఎదురు చూశారు. చిన్న బండ తాండాలో మొక్కలు నాటారు. ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీలక్ష్మీ, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే సంజీవరావు, మాజీ డిప్యూటీస్పీకర్ హరీశ్వర్‌రెడ్డి, జాయింట్



కలెక్టర్ సురేశ్ పొద్దార్, ఆర్డీఓ విశ్వనాథం, పరిగి మార్కెట్ చైరమ్‌న్ ఆంజనేయులు, పూడూర్ ఎంపీడీఓ సుధారాణి, ఎస్ ఐ ఆంజనేయులు, తహశీల్దార్ కిషన్, వైస్ ఎంపీపీ మాణిక్యం గౌడ్, శుభ ప్రద్ పటేల్, శ్రీని వాస్ గుప్తా, హాజీం, మల్లేశం, ఎంపీటీసీలు సురేందర్, రవి, విశ్వనాథం, సర్పంచులు పెంటయ్య, నవీన్ కుమార్, మధుసుదన్, ఉప సర్పంచ్ నరేందర్, పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ యువతకు డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా శిక్షణ ఇచ్చేందుకు నేషనల్ స్కిల్ డెవప్‌మెంట్ కార్పొరేషన్, నాస్కామ్‌కు చెందిన స్కిల్ కౌన్సిల్, విప్రి టెక్నాలజీస్ సొల్యూషన్ ఒక అవగాహనకు వచ్చాయి. డేటా ఎంట్రీలో రికగ్నిషన్ ఫర్ ప్రియర్ లెర్నింగ్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఈ మేరకు సంయుక్తంగా కార్యాచరణను ప్రకటించాయి. భవిష్యత్‌లో ఉపాధి పొందేందుకు యువతకు ఈ టెక్నాలజీ ఎంతో దోహద పడుతుందని, తద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కలుగుతుందని విప్రి టెక్నాలజీ పేర్కొంది. దీనికి సంబంధించి ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, దీన్ని మునిసిపల్ పరిపాలనా డైరెక్టర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి ప్రారంభించనున్నారు.

పక్కింటి తవ్వకాలకు కూలిన ప్రహరీ

నల్లకుంట, కెఎన్ఎన్ : అపార్ట్‌మెంట్ పిల్లర్ల నిర్మాణం కోసం తవ్వడంతో పక్కనే ఉన్న ఇంటిగోడ కూలిపోయిన సంఘటన నల్లకుంటలో జరిగింది. లూజ్ సాయిల్ ఉండడంతో పిల్లర్‌ల నిర్మాణం కోసం భారీగా తవ్వడంతో బుధవారం రాత్రి ఒక్కసారిగా పక్కనే ఉన్న బిజెపి నాయకుడు రాంజగదీశ్ ఇంటి ప్రహరిగోడ కూలిపోయింది. దీనితో భవన నిర్మాణదారులు తవ్విన దానిని రాత్రికి రాత్రే కొంత పూడ్చి వేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఓ బిల్డర్ సెల్లార్ కోసం తవ్వడంతో పక్కనే ఉన్న ఇంటి గోడ కూలిపోయి ఇళ్ళు బీటలు వారాయి. దీంతో జిహెచ్‌ఎంసి అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని అపార్ట్‌మెంట్ మంజూరు పత్రాలను పరిశీలించారు. నల్లకుంట డివిజన్ మయూరిలేన్‌లో ఇంటి నెంబర్ 2-1-434-1 స్థలంలో ఓ బిల్డర్ నాలుగు అంతస్థుల అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టాడు. దీనిలో భాగంగా లూజ్ సాయిల్ కావడంతో పిల్లర్ల నిర్మాణం కోసం భూమి లోపలికి తవ్వారు. దీంతో పక్కనే ఉన్న బిజెపి నేత రాంజగదీశ్ ఇంటి ప్రహరిగోడ కూలిపోయింది. దీంతో అతను జిహెచ్‌ఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న డిఎంసి శ్రీనివాసరెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసిపి సాంబయ్య ఇతర సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే నిర్మాణపనులను నిలిపివేశారు. వర్షాకాలంలో మూడు నెలలపాటు సెల్లార్‌ల నిర్మాణం పనులు చేపట్టవద్దని గతంలోనే జిహెచ్‌ఎంసి ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. వర్షాకాలంలో సెల్లార్ల కోసం తవ్వితే ప్రమాదాలు జరుగుతాయనే నిలిపివేశామని అయినా నిబంధనలకు విరుద్ధంగా ఎలా తవ్వారని అధికారులు బిల్డర్‌ను ప్రశ్నించారు. జిహెచ్ఎసి టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు అక్రమ



నిర్మాణాలపట్ల చూసిచూడనట్టు వ్యవహరిస్తుండడంతో అంబర్‌పేట నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చుట్టు ప్రహరిగోడ నిర్మించకుండానే తవ్వకం పనులు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుక నోటీసులు ఇచ్చామంటూ చేతులు దులుపుకుంటున్నారు. సదరు బిల్డర్‌కు నోటీసులు ఇచ్చినట్టు డిఎంసి శ్రీనివాసరెడ్డి, ఏసిపి సాంబయ్య తెలిపారు. చుట్టు ప్రహరిగోడలు నిర్మించిన తరువాతనే నిర్మాణం పనులు చేపట్టాలని ఆదేశించినట్టు తెలిపారు. దెబ్బతిన్న ఇంటికి ప్రహరిగోడ నిర్మించి, మరమ్మతులు చేయించాలని కోరినట్టు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎంఎల్ఎ జి. కిషన్‌రెడ్డి సందర్శించారు.

పునరుజ్జీవం పేరుతో మళ్లీ దగా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవం పేరుతో తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు చేపట్టిన కార్యక్రమాన్ని మరో దగాగా తెలంగాణ పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అభివర్ణించారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శల వర్షం కురిపించారు. అది



ఎస్సారెస్పీ పునరుజ్జీవం కాదు, కేసీఆర్ రాజకీయ పునరుజ్జీవమని పొన్నాల ఎద్దేవా చేశారు. చెప్పిన హామీలన్నీ గాలికొదిలేసిన కేసీఆర్, ఇప్పుడు పునరుజ్జీవం పేరుతో మరోసారి జనాన్ని దగా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ''60 టీఎంసీల నీటితో 32 లక్షల ఎకరాలకు నీరు అందించడం సాధ్యమా'' అని ఆయన ప్రశ్నించారు. నీటి పారుదల రంగానికి సంబంధించిన నిపుణులతో చర్చించకుండా కేసీఆర్ తనకు తోచినట్టు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రాజెక్టుల విషయంలో పిచ్చోడి చేతిలో రాయిలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రాత్రికి రాత్రి గీతలు గీసి ప్రాజెక్టులంటున్నారని పొన్నాల ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులపై ఇప్పటికైనా దమ్ముంటే తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేవలం సొంత ప్రయోజనాల కోసమే పునరుజ్జీవం అంటున్నారని, ఏమాత్రం పారదర్శకంగా వ్యవహరించడం లేదని పొన్నాల లక్ష్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగురాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత 24 గంటల్లో పడ్డ వర్షపాత వివరాలను పరిశీలిస్తే తిరువూరులో 13, చిత్తూరులో 13, రాయచోటిలో 12, చిన్నమండ్యంలో 11సెంటీమీటర్ల వంతున వర్షపాతం నమోదైంది. పాకాలలో 11,శ్రీహరికోటలో 10, పుత్తూరులో 9, అవనిగడ్డలో 8, ఆరోగ్యవరంలో 6, పెనగలూరు,రాజంపేట, అనకాపల్లి, ఆత్మకూరు కేంద్రాల్లో 6 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది.తెలంగాణ రాష్ట్రంలో కొణిజర్లలో 11, సూర్యాపేటలో 7, కూసుమంచిలో 7 ఖానాపూర్‌లో 6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. యాచారం, మల్యాల , ఇబ్రాన్ పల్లిలో 5 సెంటీమీటర్ల వంతున వర్షపాతం నమోదైంది. వికారాబాద్, ఇబ్రహింపట్నం, కమ్మర్ పల్లిలో 4 సెంటీమీటర్ల వంతున వర్షం కురిసినట్టు అధికారులు వెల్లడించారు.

భెల్‌లో చేనేత మెగా వస్త్ర ప్రదర్శన ప్రారంభం



భెల్ కాలనీ, ఆగస్టు10 (కెఎన్ఎన్) : భెల్ టౌన్‌షిప్‌లో గల స్త్రీ సంక్షేమ కేంద్రంలో విశ్వకళాభారతి చేనేత మెగా వస్త్రప్రదర్శనను గురువారం స్త్రీ సంక్షేమ కేంద్రం ఆధ్యక్షురాలు అర్జిత్ కౌర్‌నారంగ్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత రంగాల ఉత్పత్తులపైన శ్రద్ధచూపించాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తులకన్నా చేనేత వస్త్రాలు నాణ్యత, తక్కువ దరలో లభిస్తాయన్నారు. విశ్వకళాభారతి చేనేత మెగా ఎక్స్‌పో ఆధ్యక్షురాలు కల్పన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న పేరు గాంచిన సూమారు 30 నుండి 35 వీవర్స్ వారి నాణ్యతమైన ఉత్పత్తులతో ఈ ప్రదర్శనలో స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆదే విదంగా హ్యాండిక్రాఫ్ట్ వస్తువులు సైతం ప్రదర్శనలో విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 17 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో ఎంతో నాణ్యమైన వస్త్రాలను అందరికి అందుబాటు దరలో విక్రయిస్తున్నామని కల్పన తెలిపారు. స్త్రీ సంక్షేమ సభ్యులు మీనాక్షీ, సుమతి, వడ్డెపల్లి లక్ష్మీనారాయణ, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

స్ట్రక్చర్ పూర్తికాగానే ఆక్యూపెన్సీ ఇవ్వండి

శేరిలింగంపల్లి, కెఎన్ఎన్ : నిర్మాణంలో ఉన్న భవనం స్ట్రక్చర్ పూర్తి కాగానే ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని, ఈ మేరకు త్వరలో ప్రభుత్వానికి వినతిపత్రం ద్వారా విన్నవించనున్నట్లు వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మెన్ మిరియాల రాఘవరావు కోరారు. వెస్ట్‌జోన్ బిల్డర్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిల్డర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిల్డర్స్ అసోసియేషన్ ప్రముఖులు రాఘవరావు, ముప్పా సుబ్బయ్య, ప్రేమ్‌కుమార్‌లు మాట్లాడతూ కొనుగోలుదారుల శ్రేయస్సు కోసం కొనుగాలు దారులకు ఉపశమనం కోసం జీహెచ్‌యంసీ, హెచ్‌యండిఏ అధికారులు ఆక్యూపెన్సీ సర్టిఫేకేట్ స్ట్రక్చర్, బ్రిక్ పనులు పూర్తి ఇవ్వాలని కోరారు.

లబ్ధిదారులకు చరవాణిలో సమాచారం

● అక్టోబర్ నాటికి అన్ని చౌకధర దుకాణాల్లో ఈ-పాస్: సీవీ ఆనంద్




హైదరాబాద్, ఆంధ్రప్రభ: రేషన్ సరుకులకు సంబంధించి సమాచారాన్ని లబ్ధిదారులకు ఎస్ఎంఎస్ రూపంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మీదట రేషన్ డీలరుకు గోదాము నుండి సరుకులు అందగానే లబ్ధిదారుని చరవాణికి మీకు రేషన్ సరుకులు వచ్చాయి అనే సంక్షిప్త సమాచారం చేరవేయడం జరుగుతుంది. లబ్ధిదారుని చరవాణి నెంబర్‌ను రేషన్ కార్డుకు అనుసంధానం చేసే ప్రక్రియ ఇప్పటికే 43 శాతం పూర్తయింది. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని పౌర సరఫరాల కమిషనర్ సి.వి. ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నాటికి తెలంగాణలోని అన్ని రేషన్ షాపుల్లో ఈ పాస్ విధానం అమలులోకి రానుంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని 1545 దుకాణాలతో పాటు మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని 5,775 రేషన్ షాపుల్లో ఈ పాస్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 19 నాటికి వరంగల్ (అర్బన్, వరంగల్ (రూరల్), జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, జనగాం, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్ జిల్లాల్లోని 4,159 రేషన్ షాపుల్లో ఈ పాస్ యంత్రాలను ఏర్పాటు చేసే ప్రక్రియ పూర్తి కాబోతుంది. జాయింట్ కలెక్టర్లు ఈ పాస్ యంత్రాల ఏర్పాటు పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పాస్ విధానం, బియ్యం సేకరణ, దీపం పథకం అమలు తదితర అంశాలపై పౌరసరఫరాల కమిషనర్ సి.వి. ఆనంద్ జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గోదాముల్లో వేబ్రిడ్జిల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అప్పటి వరకు అందుబాటులో ఉన్న వేబ్రిడ్జిలకు తగిన రుసుము చెల్లించి వంద శాతం తూకంతో బియ్యాన్ని అందించవలసి ఉందన్నారు.

ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రాత్రి ఇక్కడికి వచ్చారు. శుక్రవారం ఉదయం జరిగే ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. అనంతరం రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, రాజ్‌నాథ్ సింగ్, ఉమాభారతి, ప్రకాశ్ జవదేకర్‌లతో పాటు మరికొంతమందిని కలిసి చర్చించనున్నారు. ఢిల్లీ వచ్చిన చంద్రబాబుకు రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఘనంగా పలికారు. తిరిగి శుక్రవారం రాత్రి విజయవాడ బయలుదేరి వెళతారు.

అయేషా హత్య కేసు పునర్ దర్యాప్తు

హైకోర్టుకు నలుగురు సభ్యుల జాబితా



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా హత్య కేసును పునర్ దర్యాప్తు జరిపేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో సభ్యుల వివరాలను ఏపీ హోంశాఖ గురువారం హైకోర్టుకు సమర్పించింది. విశాఖపట్నం రేంజ్ డీఐజీ సీహెచ్ శ్రీకాంత్ నేతృత్వంలో పనిచేసే ఈ సిట్‌లో సభ్యులుగా డీఎస్పీలు డి.హిమవతి, శ్రీలక్ష్మి, నున్న ఇన్‌స్పెక్టర్ సహీరున్నిసా బేగం ఉంటారని పేర్కొంది. ఆ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పూర్తి వివరాలతో ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని ఏపీ హోంశాఖను ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. అయేషా మీరా హత్య కేసులో సత్యంబాబును నిర్దోషిగా ప్రకటిస్తూ గత మార్చి 31న హైకోర్టు తీర్పు ఇచ్చినందువల్ల అసలు దోషులను శిక్షించే నిమిత్తం ఈ కేసును పునర్ దర్యాప్తు జరిపేలా అధికారులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఉస్మానియా విశ్రాంత ప్రొఫెసర్ రమా ఎస్ మేల్కోటే, పాత్రికేయురాలు కె.సజయ, సామాజిక ఉద్యమకారిణి వల్లూరుపల్లి సంధ్యారాణి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

మరో వైపు తమ కుమార్తె హత్య కేసు దర్యాప్తును సిట్‌కు అప్పగించి హైకోర్టు పర్యవేక్షణలో హైకోర్టు పర్యవేక్షించాలని, లేదా సీబీఐకి అప్పగించాలని అభ్యర్థిస్తూ అయేషా తల్లిదండ్రులు శంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఈ రెండు పిటిషన్లను కలిపి గురువారం విచారించింది.

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల పిటిషన్లపై

ముగిసిన వాదనలు... తీర్పు వాయిదా

హైదరాబాద్,ఆంధ్రప్రభ : కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై వాదనలు పూర్తయ్యాయి. అయితే హైకోర్టు తన నిర్ణయాన్ని మాత్రం వాయిదా వేసింది. ఈ నెల 16న తీర్పును వెలువరించే అవకాశం ఉంది. ఈ వ్యాజ్యాలపై ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్ రావు గురువారం మరో సారి విచారణ చేపట్టారు. కాకినాడ నగరపాలకసంస్థకు ఎన్నికలు నిర్వహించేనిమిత్తం, సీట్ల నిర్ధారణ, వార్డుల ఏర్పాటు, రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి పురపాలకశాఖ ఈ నెల 2న జారీ చేసిన జీవోను, తదనుగుణంగా , ఈనెల 3న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల ప్రకటనను సవాలు చేస్తూ..హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ సందర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ ..ఓ సారి ఎన్నికల ప్రకటన వెలుపడ్డాక ఆ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై న్యాయస్థానం విచారణ జరపాల్సిన అవసరం లేదన్నారు. హైకోర్టు ఆదేశాలతో రెండు వార్డులకు ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. గురువారం 3 గంటలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగుస్తుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తరపున న్యాయవాది ప్రభాకరరావు వాదనలు వినిపిస్తూ ..ఎన్నికల ప్రకటన జారీ చేశాక వ్యాజ్యాలపై విచారణ జరపకుండా చట్ట నిబంధనల్లో నిషేధం ఉందని తెలిపారు. పిటిషనర్ల తరపున న్యాయవాదులు ఎమ్మెస్ ప్రసాద్, సి.నాగేశ్వరరావు, న్యాయవాది శాంసన్ బాబు తమ వాదనలు వినిపించారు.

ఉమ్మడి భవన్‌లో వరుస చోరీలపై అధికారుల దృష్టి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఢిల్లీలోని తెలంగాణ భవన్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలంగాణా భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్ కుమార్ అన్నారు. ఉమ్మడి భవన్, క్యాంటీన్ పరిసర ప్రాంతాల్లో మఫ్టీలో పోలీసులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జేబుకు జాతీయ జెండాలు పెట్టే నెపంతో కొందరు దొంగలకు సహకరిస్తున్నారన్న సమాచారం ఉందని చెప్పారు. తెలంగాణ భవన్, నర్సింగ్ హాస్టల్స్‌లో అరవింద్ కుమార్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకొని నర్సింగ్ హాస్టల్‌లోని అధికారుల క్వార్టర్స్‌ని ఆయన పరిశీలించారు. శిథిలావ్యవస్థలో ఉన్న భవనాలు, క్వార్టర్స్‌లో సమస్యలను ఆర్సీ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. క్వార్టర్స్‌లో మరమ్మతులు చేపట్టేందుకు త్వరలోనే అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యలను తీర్చడం తమ బాధ్యతని అరవింద్ కుమార్ పేర్కొన్నారు. ఇంకా పూర్తి స్థాయిలో క్వార్టర్ల విభజన జరగనందు వల్ల రెండు ప్రభుత్వాలు కలిసి మరమ్మతులు చేపట్టేలా చర్యలు చేపడదామని ఆయన ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్‌ను కోరారు. లేదంటే కనీసం తెలంగాణ ఉద్యోగులు నివాసముంటున్న భవనాలకు అయినా మరమ్మతులు చేయిస్తామని ఆయన వెల్లడించారు.

గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల నిర్వహణకు రూ.1.95కోట్ల నిధులకు రాష్ట్రప్రభుత్వం పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. ఈ మేరకు ముఖ్యకార్యదర్శి వికాశ్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.1.95కోట్ల నిధులను ప్రణాళికేతర విభాగం నుంచి విడుదల చేసేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించారు.



విలీనానికి ఓకే!

- ఈపీఎస్-ఓపీఎస్ వర్గీయుల సమ్మతి
- పన్నీర్ సెల్వంకు డిప్యూటీ సీఎంపదవి

చెన్నై: తమిళనాట అధికారపార్టీ అన్నాడీఎంకేలో నెలకొన్న సంక్షోభం ఎట్టకేలకు ముగింపుదశకు చేరింది. పార్టీ విచ్ఛిన్నానికి, సంక్షోభానికి కారకులైన వారిని వెలేయడం ద్వారా ఈపీఎస్ (ఎడప్పడి పళనిస్వామి), ఓపీఎస్ (ఒ.పన్నీర్ సెల్వం) వర్గాలు తిరిగి ఒక్కటవుతున్నాయి. దివంగత ముఖ్యమంత్రి జయలలిత మరణం తర్వాత, శశికళ కుట్రలతో ఛిన్నాభిన్నమైన పార్టీ ఆమె ఆనవాళ్లను చెరిపేయడం ద్వారా మునుపటి అన్నాడీఎంకేగా పునరేకీకరణ అవుతోంది. ఈ మేరకు ఈపీఎస్, ఓపీఎస్ వర్గాల మధ్య సయోధ్య చివరిదశకు చేరింది. ఒకటీ అరా కీలక డిమాండ్ల కారణంగా ఇదివరకు స్తంభించిన విలీన ప్రక్రియలో కీలక ముందడుగు పడిందని మంత్రి జయకుమార్ తెలిపారు. పన్నీర్ సెల్వంకు డిప్యూటీ సీఎం పదవితోపాటు ఆర్థిక, పీడబ్ల్యూడీ వంటి కీలక మంత్రిత్వశాఖలను కేటాయించేందుకు పళనిస్వామి అంగీకరించారని ఆయన చెప్పారు. ఆగస్టు 15 లోగా విలీనం పూర్తవుతుందన్నారు. అదేవిధంగా సెమ్మలాయ్, పాండియరాజన్ లకు కేబినెట్ పదవులు లభించనున్నాయని జయకుమార్ స్పష్టం చేశారు.

ఇదిలావుండగా, దివంగత ముఖ్యమంత్రి జయలలిత మృతిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలన్న తమ ప్రధాన డిమాండ్‌తోపాటు, శశికళను పార్టీ నుంచి బహిష్కరించాలన్న డిమాండ్‌కు స్పష్టత లభిస్తేనే విలీనానికి అంగీకరిస్తామని పన్నీర్‌సెల్వం వర్గం నేతలు కేపీ మునుస్వామి, మనోజ్ పాండియన్ వ్యాఖ్యానించారు. పన్నీర్‌సెల్వం శనివారం ఢిల్లీకి వెళ్తున్నారని, తిరిగొచ్చిన తర్వాత స్పష్టత లభిస్తుందని చెప్పారు. ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణ స్వీకార వేడుకకు ఈ ఇద్దరూ ఢిల్లీకి వెళ్తున్న క్రమంలో అక్కడ రహస్య మంతనాలు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరికొద్ది నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉన్నందున, ఈలోగా రెండు వర్గాలు ఒక్కటైతే, డీఎంకేను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని అన్నాడీఎంకే (అమ్మ) పక్షం భావిస్తోంది.

దినకరన్‌పై వేటు

అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి పదవి నుంచి టీటీవీ దినకరన్‌ను తొలగిస్తూ పార్టీ తీర్మానించింది. ఆయన నియామకం చెల్లదని ఈ సందర్భంగా పార్టీ పేర్కొంది. అయితే శశికళ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆమె బంధువుపై వేటువేస్తూ చర్య ముఖ్యమంత్రిగా పళనిస్వామి చర్య తీసుకోవడం ఇదే తొలిసారి. ''దినకరన్ నియామకం పార్టీ నిబంధనలకు విరుద్ధం. అంతకు మునుపు ఆయన పార్టీ పదవిలో లేరు. కనీసంగా ఐదేళ్ల పార్టీ సభ్యత్వమూ లేదు. ఆయన నియామకంపై ఎన్నికల కమిషన్ వద్ద కేసు కూడా పెండింగ్‌లో ఉంది' అని పార్టీ కార్యవర్గం తీర్మానంలో పేర్కొంది. అంతేకాకుండా పార్టీ పదవులను సొంతంగా భర్తీ చేయడం ద్వారా శ్రేణులను గందరగోళానికి గురిచేశాడని, అలాంటి నియామకాలన్నీ రద్దు చేయాలని నేతలు చేసిన ప్రతిపాదలను పార్టీ ఆమోదించింది. కాగా, విలీన కథనాల నేపథ్యంలో పరిస్థితులను బీజేపీ ఎప్పటికప్పుడు ఆరా తీస్తోంది.

త్వరలో శశికళపై కూడా...

జయ మరణం తర్వాత అన్నాడీఎంకే పార్టీని చెప్పుచేతల్లోకి తీసుకుని నియంతలా వ్యవహరించిన శశికళను కూడా త్వరలోనే సాగనంపడం ఖాయమని తెలుస్తోంది. పన్నీర్ సెల్వం ప్రధాన డిమాండ్లలో శశి బహిష్కరణ కూడా ఉండటం, స్థానిక ఎన్నికలు దగ్గరపడుతున్నందున చిన్నమ్మను పార్టీకి దూరం పెట్టడమే మంచిదన్న అభిప్రాయానికి ఈపీఎస్ వర్గం వచ్చినట్లు సమాచారం.

డొక్లాం-సిక్కిం సరిహద్దులో గ్రామస్తుల తరలింపు

న్యూఢిల్లీ/బీజింగ్: డొక్లాం వివాదం మళ్లీ రాజుకుంటూనే ఉంది. ఆ ప్రాంతంలో తన సైనిక బలగాలను చైనా 800 వరకూ పెంచగా, సరిహద్దులోని ఒక గ్రామాన్ని భారత్ ఖాళీ చేయించింది. దీంతో సైనిక చర్యకు చైనా సిద్ధమవుతుంటే, భారత్ అందుకు ప్రతిగా సన్నద్ధమవుతున్నట్లు ఉంది. ఈ నేపథ్యంలోనే భారత్, భూటాన్ మంత్రులు సమావేశమవుతారని వార్తలు వస్తుండగా, డొక్లాంలో చైనా రోడ్డు నిర్మిస్తున్న ప్రాంతం తమదేనని, చైనా చెబుతున్నట్లు ఆ దేశానికి కాదని భూటాన్ ప్రకటించింది. డొక్లాం ప్రాంతం తమది కాదని భూటాన్ అంగీకరించిందని, ఆ విషయాన్ని దౌత్య వర్గాల ద్వారా తమకు తెలిపిందన్న చైనా మాటలు నిజం కాదని తేలిపోయింది. తాము చైనాకు డొక్లాం తమది కాదని చెప్పామన్న మాటను కూడా భూటాన్ తాజాగా ఖండించింది. దీంతో భూటాన్ తరపున తాము చైనాను అడ్డుకున్నామన్న భారత్ వాదనకు బలం లభించినట్లయింది. భూటాన్ తగవును తీరుస్తూ, ఈశాన్య రాష్ట్రా లకు మార్గాన్ని కాపాడుకోవడంలో భారత్ ఇప్పటి వరకూ సమర్థవంతంగా వ్యవహరించింది. అయితే.. చైనా అధికార పత్రికలో వస్తున్న వార్తలు సమీప భవిష్యత్‌పై అనుమానాలు కలిగిస్తున్నాయి. యుద్ధం వస్తుందని ప్రపంచ స్థాయి విశ్లేషకులు చెబుతుంటే.. ఆ మాటలను ఖండించకుండా డొక్లాంలో భారత్ ఉనికిని దండయాత్రగా భావిస్తున్నామని చైనా చెప్పడం యుద్ధమా? లేక సైనిక చర్యనా? అని భారత్‌లో అనుమానాలు వస్తున్నాయి. టిబెట్‌లో చైనా సైనిక విన్యాసాలు భారత్‌ను బెదిరించడానికని



భావిస్తే.. డొక్లాంలో తన సైనికులను 800 వరకూ పెంచి సైనిక చర్యకు సిద్ధమవుతున్నట్లు భారత్‌ను చైనా నమ్మించేలా చేస్తోందని భారత సైనిక వర్గాలు భావిస్తున్నాయి. ఈ లోపే యుద్ధం భయాలు తుడిచివేస్తూ భారత్, చైనాలు సిక్కిం ప్రాంత సరిహద్దు విషయంలో కొత్త ఒప్పందం కుదుర్చుకోవాలని చైనా సైన్యం పీఎల్‌ఏలో సీనియర్ కర్నల్ ఝూవో జియావోఝో చెప్పడం చైనా వ్యూహాలను తెలియజేస్తోంది. మొత్తానికి డొక్లాం భారత్‌ది కాదని, భూటాన్‌ది అయినంత మాత్రాన కల్పించుకోవాల్సిన అవసరం లేదని చైనా చెప్పడం తాజా పరిణామాల ఫలితం. ఇలా ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అవసరాన్ని కూడా చైనా నొక్కి చెబుతోంది. 1890లో అప్పటి గ్రేట్ బ్రిటన్, చైనాల మధ్య కుదిరింది. అప్పటికి ఇంకా ఇప్పటి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఏర్పాటు కాలేదు. భారత్‌కూ స్వాతంత్ర్యం రాలేదు. దీంతో రెండు దేశాలు ప్రస్తుత పరిస్థితులకు సరిపోయేలా ఒప్పందం కుదుర్చుకోవాలని చైనా భావిస్తోంది. చైనా చెబుతున్న ఈ ప్రాంతంలోనే డొక్లాం కూడా ఉన్నందున కొత్త ఒప్పందం పరిధిలోకి ఈ వివాదాన్ని కూడా తేవాలని చైనా వ్యూహంగా కనిపిస్తోంది. ఇలా చెబుతూనే డొక్లాం విషయంలో తాము రాజీ పడబోమని పీఎల్‌ఏ అధికా రులు చెబుతున్నారు. ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్న భారత విలేకరుల బృందంతో పీఎల్‌ఏ అధికారులు పలుమార్లు డొక్లాంలో భారత్‌ది దండయాత్ర అని చెప్పడమే కాకుండా తాము రాజీ పడేది లేదని తెగేసి చెబుతున్నారు. దీంతో దౌత్యపరంగా భారత్ ఒక మెట్టు దిగి వస్తేనే తాము చర్చిస్తామని లేకుంటే ప్రతిష్టంభన కొనసాగడం లేదా ఘర్షణకు దారి తీయడం తప్పదని చైనా చెబుతోంది. తాజాగా తాము భారత్‌ది దండయాత్రగా భావించడం లేదని, తమ ప్రాంతంలోకి ఆ దేశసైనికులు వచ్చారని మాత్రమే చెబుతున్నామని పీఎల్‌ఏలో సినియర్ అధికారి ఒకరు చెప్పారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా భారత్‌కు మద్దతు లభిస్తోంది. డొక్లాం విషయంలో చైనా అతి చేస్తోందని తాజాగా అమెరికా వ్యాఖ్యానించింది. ఆసియాన్ దేశాల్లో ఫిలిప్పైన్స్ తప్పితే మిగిలిన దేశాలు దక్షిణ చైనా సముద్రంలో చైనా తీరు పట్ల గుర్రుగా ఉండి భారత్, అమెరికాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో అంతర్జాతీయ సమాజం మద్దతు భారత్‌కే ఉందన్న విషయాన్ని చైనా గుర్తించింది. అమీ తుమీ తేల్చుకోవడానికి సమయం కోరుకుంటోందో లేదా సమయం కోసం వేచి చూస్తోందో కానీ, భారత్‌ను బెదిరిస్తూ దౌత్యం మార్గాన్ని తెరిచే ఉంచుతూ డబుల్ గేమ్ ఆడుతోంది. తమతో పోలిస్తే భారత్‌ది తక్కువ స్థాయి అని పదే పదే ఏదో ఒక విషయంలో విమర్శిస్తోంది. మైండ్‌గేమ్ ఆడుతోంది.

ఆర్టికల్ 35ఏ చట్టబద్ధత తేల్చండి!

- కేంద్ర హోంమంత్రితో కశ్మీర్ సీఎం సమావేశం
- పలువురు విపక్ష పెద్దల మద్దతుకు భేటీలు!



న్యూఢిల్లీ: జమ్ము-కాశ్మీర్ ప్రత్యేక హోదాకు వీలుకల్పించడంతోపాటు, శాశ్వతనివాసితుల ఎంపిక, ప్రత్యేక హక్కులు, అధికారాల నిర్ణయంలో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్ణయాధికారం కల్పించే ఆర్టికల్ 35 ఏ చట్టబద్ధతకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ పట్టుదలతో కృషిచేస్తున్నారు. గురువారం ఢిల్లీ చేరిన ఆమె కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. ఈ ఆర్టికల్ చట్టవిరుద్ధమంటూ గతంలో (2014)లో ఓ స్వచ్ఛంద సంస్థ సుప్రీంలో వ్యాజ్యం వేసింది. భారత పార్లమెంటులో సవరణ లేకుండానే రాజ్యాంగంలోని 370కి దీనిని రాష్ట్రపతి ఆర్డర్ (1954) ద్వారా జోడించారని సదరు ఎన్జీవో ఆక్షేపించింది. ఇటీవల ఇద్దరు కశ్మీర్ మహిళలు కూడా ఇదే అంశంపై ఢిల్లీ హైకోర్టును, సుప్రీంను ఆశ్రయించారు. దీంతో ఆర్టికల్ 35 ఏ వివాదాస్పదం అయింది. ఒకవేళ ఇది చట్టబద్ధం కాదని సుప్రీం తేల్చినట్లయితే తమ హక్కులు హరించుకు పోతాయని అధికార పీడీపీ వాదిస్తోంది. పనిలోపనిగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, జేడీయూ అధినేత శరద్‌యాదవ్‌లను కలిసి మద్దతు కోరనున్నారు.

అందరి మద్దతూ కూడగట్టండి: ఫరూఖ్

గతవారం ప్రతిపక్ష నేత ఫరూఖ్ అబ్దుల్లాతోనూ ముఫ్తీ భేటీ అయ్యారు. 35ఏ పరిణామాలపై చర్చించారు. సమస్య పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడదామని, ఇందుకు మద్దతివ్వాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఫరూక్ తొలుత ఢిల్లీ పెద్దల మద్దతు కూడగట్టాలని సూచించారని ముఖ్యంగా, ప్రధానమంత్రి, కీలక మంత్రులు, బీజేపీ అధినాయకత్వం, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలను కూడా కలవాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఎన్‌సీపీతోపాటు ఇతర రాష్ట్రపార్టీల నేతలతోనూ ముఖ్యమంత్రి సమావేశమై, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ-పీడీపీ కూటమికి బీటలు?

ఆర్టికల్ 35ఏ వివాదం బీజేపీ-పీడీపీ కూటమి విచ్ఛిన్నానికి దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీనిపై కేంద్రం పట్టీపట్టనట్లుగా ఉండటంపై ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఆగ్రహంతో ఉన్నారు. సమస్యపై పదేపదే విన్నవించినా ప్రధాని నుంచి పరిష్కార హామీ లభించడం లేదని పీడీపీ వర్గాలు అసహనంతో ఉన్నాయి. రాష్ట్ర పౌరుల, పార్టీ రాజకీయ భవిష్యత్‌కు పెనుసవాల్‌గా మారిన ఈ అంశంపై తాడోపేడో తేల్చుకోవాలన్న నిర్ణయానికి ముఫ్తీ వచ్చారని ఆ పార్టీ నేతల సమాచారం.

బ్రహ్మోత్సవాలకు టీటీడీ సమాయత్తం

తిరుమల, కెఎన్ఎన్ : ఈ ఏడాది సెప్టెంబర్ 23 వ తేది నుంచి అక్టోబర్ 1 వ తేది వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు టిటిడి సమాయత్తం అవుతోంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 23న ధ్వజారోహణం, 27 న గరుడోత్సవం, 28 న స్వర్ణరథం, 30 న రథోత్సవం అలాగే అక్టోబర్ 1 న చక్రస్నానం, ధ్వజావరోహణం జరగనున్నాయి. ఈ విశేష ఉత్సవాలను తిలకించేందుకు విచ్చేసే భక్తకోటికి టిటిడి విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతోంది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారు వెలసివున్న దివ్య క్షేత్రంలో ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. నిత్య కల్యాణచక్రవర్తికి ఏడా నిర్వహించే 450 ఉత్సవాల్లో సాక్షాత్తు సృష్టికర్త అయిన బ్రహ్మ నిర్వహించిన ఉత్సవాలుగా బ్రహ్మోత్సవాలు ప్రసిద్ధికెక్కాయి. తిరుమల - తిరుపతి దేవస్థానంలో అత్యంత భారీ ఎత్తున నిర్వహించే ఉత్సవాలివి. బ్రహ్మోత్సవాల కోసం ఆయా విభాగాలు ఇప్పటికే ఏర్పాట్లను ప్రారంభించాయి.

శ్రీవారి పుష్కరిణి మరమత్తు పనులు ఆగస్టు 1 న ప్రారంభించిన విషయం విదితమే. ప్రణాళికా బద్ధంగా ఈ పనులు జరుగుతున్నాయి. ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటి నుంచే విద్యుత్ అలంకరణ కోసం ప్రాథమిక పనులు చేపట్టారు. ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఈ సారి మరింత ఆకర్షణీయంగా ఫలపుష్ప ప్రదర్శన, ఇతర పుష్పాలంకరణ చేపట్టనున్నారు. ఇందుకోసం ఫలపుష్ప ప్రదర్శనలో ఏర్పాటు చేసే వివిధ సెట్టింగులకు సంబంధించి పౌరాణిక అంశాలను ఖరారు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు టిటిడి పలు సూచనలు చేసింది.

ఒంటిమిట్ట రామాలయానికి హంగులు

- టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్

కడప, కెఎన్ఎన్ : టీటీడీకి అనుబంధంగా గల కడప జిల్లా ఒంటిమిట్టలోని ప్రాచీనమైన శ్రీ కోదండరామాలయానికి వచ్చే వార్షిక బ్రహ్మోత్సవాల నాటికి నూతన హంగులు సమకూరుస్తామని టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. టీటీడీ ఈఓ గురువారం తిరుపతి జేఈఓ పోల భాస్కర్‌తో కలిసి ఒంటిమిట్టలోని కోదండరామాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈఓ మీడియాతో మాట్లాడుతూ ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి భారత పురావస్తు శాఖ నుంచి అనుమతులు లభించాయని తెలిపారు. ఇందుకోసం ఒక సంవత్సరం పాటు న్యూఢిల్లీలోని ఆ శాఖ అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు చేపట్టామని వివరించారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్ డిజైన్లు 15రోజుల్లో పూర్తవుతాయని, ఆ తరువాత రెండు దశల్లో పనులు చేపడతామని తెలిపారు. మొదటి దశలో భక్తులకు పటిష్ట దర్శన ఏర్పాట్లు, టికెట్ కౌంటర్లు, తాగునీటి వసతి, ఆలయ పరిసరాల్లో మొక్కల పెంపకం, పుష్కరిణి, విశ్రాంతి గృహాలు, లాకర్లు, మరుగుదొడ్లు, తదితర అత్యవసర పనులను వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి పూర్తి చేస్తామన్నారు. ఇతర అభివృద్ధి పను లను రెండోదశలో చేపడతామని తెలిపారు. అంతకు ముందు నిర్మాణంలో ఉన్న యాత్రికుల వసతి సముదాయం పనుల నాణ్యతను పరిశీలించారు. నిర్ణీత వ్యవధిలో ఈ పనులను పూర్తి చేయాలని చీఫ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు.

విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారు

- ప్రభుత్వంపై ఏబీవీపీ ఆగ్రహం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి అయినా విద్యారంగాన్ని పట్టించుకోకుండా భ్రష్టు పట్టించిందని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబివిపి) రాష్ట్ర అధ్యక్షులు ఎల్ అయ్యప్ప విమర్శించారు. రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీలను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఆయా కాలేజీల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం, అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబివిపి బుధవారం చేపట్టిన చలో కలెక్టరేట్ల ముట్టడిలో పాల్గొన్న వారిపై అక్రమంగా కేసులు పెట్టి, అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా బంద్‌ను చేపట్టినట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 1700 కోట్లు ఉన్నాయని తెలిపారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని అయ్యప్ప డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన సర్కార్ ఇప్పటి వరకు ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటి వరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా కేవలం 4 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని విమర్శించారు. టిఎస్‌పిఎస్సీ ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడం కోర్టుల చుట్టూ తిరగడమే సరిపోతుందని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చలో కలెక్టరేట్లలో పాల్గొన్న విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

డ్రగ్స్ వాడుతుంటే సరిచేసుకుంటాం

- తెలుగు చిత్రపరిశ్రమపై దగ్గుపాటి సురేష్‌బాబు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగు సినీ ఇండస్ట్రీలో డ్రగ్స్ వాడకం ఉంటే తప్పకుండా సరిచేసుకుంటామని ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు వ్యాఖ్యానించారు. గురువారం ఉదయం తిరుమలకు వచ్చి శ్రీవెంకటేశ్వరుని దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్కూల్ పిల్లలకు డ్రగ్స్ చేరకుండా, రాష్ట్రంలోకి డ్రగ్స్ రాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. మత్తు మందుల వాడకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు చేపట్టే కార్యక్రమాల్లో తెలుగు సినీ పరిశ్రమ ముందుంటుందని, పెద్దలంతా పాల్గొంటారని తెలిపారు.



పాట్నాలో కురిసన భారీ వర్షానికి రోడ్లు నదులై పారడంతో స్కూటీ అదుపు తప్పడంతో ఇబ్బంది పడుతున్న యువతి

డ్రగ్స్ డొంక కదులుతోంది



హైదరాబాద్‌లో నివసిస్తున్న నైజీరియన్ల వీసా, పాస్‌పోర్టులను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డ్రగ్స్ మూలాల డొంక కదులుతోంది. లేడీ డాన్ సంగీత ఇచ్చిన సమాచారం మేరకు ఓ వైపు నైజీరియన్‌కు చెందిన గాబ్రియేల్‌తో సహా అతడి ప్రియురాలు పట్టుబడిన నేపథ్యంలో.. పోలీసులు నగరంలో సోమాలియా, నైజీరియన్ దేశస్తుల ఉంటున్న పలు ప్రాంతాలలో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వీసా గడువు పూర్తయినా వెళ్లకుండా ఇక్కడే పలువురు నైజీరియన్లు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. భాగ్యనగరంలో మొత్తంగా ఆరు వేల మంది నైజీరియన్లు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరి ధిలోనే నాలుగు వేల మంది నైజీరియన్లు ఉన్నారని సమాచారం. దీంతో, వీరిలో ఎంతమంది డ్రగ్స్ సరఫరాదారులుగా ఉన్నారు? అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న విషయాన్ని కనుగొనేందుకు తద్వారా డ్రగ్స్ మూలాల డొంక కదిలే దిశగా పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నిఘా కారణంగా నైజీరియన్ల డ్రగ్స్ దందా తగ్గిందని భావించిన పోలీసులకు ప్రస్తుత పరిస్థితులు విస్మయాన్ని కలిగిస్తున్నారు. వీసా గడువు ముగిసినప్పటికీ ఇక్కడే తిష్టవేసిన కొం దరు నైజీరియన్లు డ్రగ్స్ సరఫరాదారులుగా ఉన్నారని తెలుస్తోంది. నైజీరియన్‌కు చెందిన గాబ్రియేల్ పట్టుబడిన తరుణంలో ఈ విషయం బహిర్గతమవడంతో పోలీసులు పలు ప్రాంతాలలో కార్డాన్‌సెర్చ్‌లు నిర్వహించడమే కాకుండా కొందరు అనుమానిత నైజీరియన్ దేశస్తులతో పాటు ఇతర దేశస్తులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆసిఫ్‌నగర్, బంజారాహిల్స్, రాజేంద్రనగర్ పీఎస్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసుల కార్డాన్ సెర్చ్ జరిగింది.

రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో పది మంది నైజీరియన్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జులై 2న పట్టుబడ్డ లేడీ డాన్ సంగీత వెల్లడించిన వివరాల ఆధారంగా డ్రగ్స్ సరఫరాదారులలో నైజీరియన్ల పాత్ర ప్రముఖంగా ఉందని వెల్లడించినట్లు సమాచారం. ఎంతో కాలంగా తిష్టవేస్తున్న సోమాలియా, నైజీరియన్ల దేశస్థులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు, ఇమ్మిగ్రేషన్ అధికారులు కార్యాచరణకు దిగారు. ఆయా ప్రాంతాలను చుట్టుముట్టి అక్కడ నివసించేవిదేశీయులను గుచ్చి గుచ్చి ప్రశ్నించారు. వారి వీసాలు తదితర వాటిని పరిశీలించి అనుమానం వచ్చిన వారిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ప్రధానంగా వారిలో డ్రగ్స్ సరఫరాదారులెవరు? ఎవరెవరికి వారు డ్రగ్స్ సరఫరా చేసేవారు? ఇత్యాది విషయాలు వారి నుంచి పోలీసులు రాబట్టే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో నగరంలో అత్యధిక శాతంలో డ్రగ్స్ విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడింది నైజీరియన్లేకావడం గమనార్హం. మరోవైపు లేడీ డాన్ సంగీత నుంచి పోలీసులు విలువైన సమాచారాన్నే పోలీసులు రాబట్టిన సంగతి తెలిసిందే. లేడీ డాన్ సంగీత డ్రగ్స్ దందా నడపడటమే కాకుండా అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేసి వారి న్యూడ్ ఫోటోలు తీసి బెదిరించి వారిని వ్యభిచారంలోకి దింపేదన్న విషయం కూడా పోలీసుల దర్యాప్తులోనే వెలుగుచూసింది. పోలీసు కస్టడీలో సంగీత ఇంకానేక విషయాలను వెల్లడి చేసింది. దీంతో సంగీత ఇచ్చిన కీలక సమాచారం పోలీసులకు ఉపయుక్తమైంది. తనకు అవసరమైన రీతిలో డ్రగ్స్ దందా కొనసాగించడంలో సంగీతది అందెవేసిన చేయి. నైజీరియన్ ఒజూకాస్మోస్‌తో సహజీనవం చేసి డ్రగ్స్ దందాతో పాటు పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డ సంగీత నైజీరియన్‌కు చెందిన గాబ్రియేల్‌తో కొంతకాలం సహజీవనం కొనసాగించి తన దందాను యథేచ్ఛగా కొనసాగించింది. తిరిగి ఒజూ కాస్మోస్ పంచన చేరింది లేడీ డాన్ సంగీత. ప్రస్తుతం పోలీసుల కార్డాన్‌సెర్చ్‌లో పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వారిని విచారిస్తే ఇతర డ్రగ్స్ మాఫియాల సమాచారంతో పాటు డ్రగ్స్ మూలాల డొంక కదలడం తథ్యమని పోలీసులు భావిస్తున్నారు. ఈ కార్డాన్‌సెర్చ్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎస్వోటీ పోలీసులతో పాటు స్థానిక పోలీసులు పాలు పంచుకుంటున్నారు. హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా తద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజిన పరిరక్షించాలన్న ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా డ్రగ్స్ మూలాల డొంక కదిలే విధంగా పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే పూర్తిస్థాయిలో జల్లెడపడుతున్నారనే చెప్పవచ్చు. మరోవైపు ఎక్సైజ్ సిట్ తన దూకుడును పెంచింది. తమ విచారణకు హాజరై రక్తనమూనాలు ఇచ్చేందుకు అంగీకరించని సినీ స్టార్స్ రక్తనమూనాలను కోర్టు అనుమతి ద్వారా తీసుకునే విధంగా యత్నిస్తోంది. మొత్తంగా డ్రగ్స్ మూలాల డొంక కదిలే విధంగా పోలీసు చర్యలు ఉంటున్నాయి. ఇంకోవైపు కాల్విన్, కమింగా లిస్టులో వెల్లడైన మరికొం దరు సినీ ప్రముఖులు, ఇతర రంగాలకు చెందిన వారిని సైతం త్వరలో ఎక్సైజ్ సిట్ ప్రశ్నించే వీలుం ది. అయితే, ఈ మారు పక్కా ఆధారాల సేకరణతో ఎక్సైజ్ సిట్ రంగంలోకి దిగే అవకా శం ఉంది. మొత్తంగా డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించి వేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని చెప్పవచ్చు.

గాబ్రియేల్ అరెస్టు

ఇటీవల నైజీరియన్లతో పట్టుబడ్డ విజయవాడకు చెందిన లేడీ డాన్ సంగీత ఇచ్చిన సమాచారం ఆధారంగా డ్రగ్స్ రాకెట్‌లో కీలక నిందితుడు నైజీరియన్‌కు చెందిన గాబ్రియేల్‌ను బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు గాబ్రియేల్ నుంచి 20 గ్రాముల కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లేడీ డాన్ సంగీత తొలుత ఒజుకు కాస్మోస్‌తో కలిసి సహజీవనం చేస్తూ డ్రగ్స్ దందాను ప్రారంభించింది. ఆ తరువాత హైదరాబాద్‌లో కొంతకాలం గాబ్రియేల్‌తో కలిసి సహజీవనం చేసి దందా చేసిందని, ఆ తరువాత మళ్లీ ఒజు కాస్మోస్‌తో సహ జీవనం ప్రారంభించిందని పోలీసులు తెలిపారు. గాబ్రియేల్ పాత నేరస్తుడేనని పోలీసులు తెలిపారు. గతంలో ఈస్ట్ మారేడ్‌పల్లి పోలీసులకు 10 గ్రాముల కొకైన్‌తో చిక్కిన గాబ్రియేల్ బెయిల్ పొందిన అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. నైజీరియన్లు ఎక్కువగా హెరాయిన్, కొకైన్ తదితర డ్రగ్స్‌ను గోవా నుంచి తీసుకువచ్చి డ్రగ్స్ మాపియాలకు సరఫరా చేసేవాడని సిట్ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కౌకూరులోని ఓ అపార్టుమెంట్‌లో ఉన్న గాబ్రియేల్‌తో పాటు అతడి ప్రియురాలిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


గత రెండేళ్లుగా బిజినెస్ వీసాపై గాబ్రియేల్ నగరానికి వచ్చి వెళ్తున్నాడు. గాబ్రియేల్ ఇచ్చిన సమాచారం నైజీరియన్ డ్రగ్ రాకెట్ వ్యవహారంలో కీలకం అవుతుందని పోలీసులు భావిస్తున్నారు. గోవాలో ఎవరి దగ్గర డ్రగ్స్‌ని తీసుకునివచ్చేవారు? ఇక్కడ ఎవరికి సరఫరా చేశాడు? అన్న విషయాలపై గాబ్రియేల్ ఇంట్లో దొరికిన ల్యాప్‌టాప్‌ను విశ్లేషిస్తున్నారు పోలీసులు. లేడీడాన్ సంగీత ఇచ్చిన సమాచారంతో గాబ్రియేల్ కదలికలపై నిఘా వుంచిన పోలీసులు ఢిల్లీ నుంచి గాబ్రియేల్ వచ్చినట్లు సమాచారం తెలుసుకున్నారు.

చంద్రబాబువి మోసాలు, అన్యాయాలు..

ఉరితీసినా తప్పులేదు

• బాబు చేస్తే ఒప్పు.. మేం చేస్తే తప్పా • మూడేళ్లలో ఒక్కహామీ అమలు కాలేదు

• రెండవరోజు రోడ్‌షోలో జగన్ భావోద్వేగం • బాబుపై మళ్లీ అనుచిత వ్యాఖ్యలు



నంద్యాల, ఆంధ్రప్రభ : గత మూడు సంవత్స రాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మాట మీద నిలబడకపోతే నిలదీయడమే తమ విధానమని, అనేక మోసాలు చేసిన వ్యక్తిని ఏమీ అనకుండా ఎలా వుంటామని ప్రశ్నించారు. అనేక అన్యాయాలకు పాల్పడుతున్న వ్యక్తికి ఉరిశిక్ష విధించినా తప్పులేదని అంటామని పేర్కొన్నారు. రెండవ రోజు రోడ్‌షో లో భాగంగా ఆయన గురువారం నంద్యాల పట్టణం, రూరల్, గోస్పాడు ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి ప్రసంగిస్తూ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట తప్పితే తప్పు కాకపోతే మరేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న అన్యాయాలకు శిక్ష వేయాలని గట్టిగా అడుగుతూనే ఉంటామని అన్నారు. చేసిన నేరాలకు, మోసాలకు ఏ శిక్షను విధించినా తక్కువే అని చెబుతూనే ఉంటామని పేర్కొన్నారు. తాము ఏదైనా మాట్లాడితే తప్పు, అధికార పక్షం చేస్తే ఒప్పా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రజలను మోసం చేసినప్పుడు తప్పు అనిపించలేదా అని అడుగుతున్నానని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తికి ఉరిశిక్షవిధిస్తే తప్పు లేదని అంటే చాలా గింజుకుంటావని, దిష్టిబొమ్మలు కాల్చేలా ప్రోత్సహించడం జరుగు తోందన్నారు. ఎందుకు దిష్టిబొమ్మలు దగ్ధం చేసేలా బాబు చేస్తాడో ఎవరికీ అర్థం కాదన్నారు. మడమ తప్పడం మాట తప్పడం చంద్రబాబుకు అలవాటేనని , బాబులా అబద్దాలు చెప్పే అలవాటు తనకు లేదని పేర్కొన్నారు. టీడీపీ అధినేత మాదిరిగా మోసం, అన్యాయం చేయడం తనకు చేతకాదన్నారు. తాను మాట ఇస్తే తప్పనని, మడమ తిప్పనని జగన్మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. అవినీతితో సంపాదించిన డబ్బు మూటలను పట్టుకొని చంద్రబాబు వస్తున్నారని, రూ. 5 వేలు ఇచ్చి దేవుడు ఫోటో చూయించి ప్రమాణం చేయించు కుంటారని వ్యాఖ్యాంచారు. అలాంటి సమయంలో దేవుడుని ప్రార్థించి లౌక్యం గా ఓటు వేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కర్నూలులో గత ఆగస్టు 15న చంద్రబాబు హామీలిచ్చారంటూ రైల్వే వ్యాగన్ల మరమ్మతుల ఫ్యాక్టరీ తీసుకొని రావడంతోపాటు మైనింగ్ స్కూల్, ఎయిర్‌పోర్టు, ఫుడ్ పార్కు, స్మార్ట్ సిటి, త్రిపుల్ ఐటి, హైదరాబాద్ - బెంగుళూరు పారిశ్రామికకారిడార్, అవుకు వద్ద ఇండస్ట్రియల్ సిటి ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాట తప్పారని చెప్పారు. ఆదోని - ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ క్లస్టర్లు, అపేరల్ పార్కులు ఏర్పాటు, కోవెలకుంట్లకు సిమెంట్ ఉత్పత్తుల హబ్ వంటి హామీలను ఇంత వరకు నెరవేర్చలేదని ఆరోపించారు. మాట మీద నిలబడకపోతే నిలదీయవద్దని అంటారని, 21 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినప్పటికి మాట్లాడవద్దా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయకపోతే, కొందరిని మంత్రులను చేస్తే ఎందుకు ప్రశ్నించకూడదన్నారు. బాబు చేసినవన్నీ కరెక్ట్ అయినప్పుడు తాము ప్రశ్నిస్తే తప్పేలా అవుతుం దన్నారు. తాను అబద్దాలు చెబితే ఎప్పుడో గద్దెనెక్కే వాడినని జగన్మోహన్‌రెడ్డి నాన్న మాదిరిగానే నవ రత్నాలతో పేదల జీవితాల్లో వెలుగునింపు తానని ప్రకటించారు. దళితుల పట్ల ప్రభుత్వం వివక్షత చూపుతుందని, వారి భూములు కూడా లాక్కునేందుకు వెనుకాడటం లేదని, నంద్యాల గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు. అమరావతి రాజధాని నిర్మాణంలో కూడా పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందోని, అయినప్పటికి విపక్షాల ఫిర్యాదులను కూడా పట్టించుకునే పరిస్థితుల్లో చంద్రబాబు నాయుడు లేరన్నారు. డ్వాక్రా మహిళలను, రైతులను, యువతను తప్పు దోవ పట్టిస్తున్నారని, హామీలను నెరవేర్చకుండా మళ్లీ ఓటు అడిగే హక్కే లేదని అన్నారు. నంద్యాల ఉప ఎన్నిక కాబట్టి మళ్లీ టేప్‌రికార్డు అన్ చేశారని ఓటర్లంతా ధర్మం వైపు నిలబడాలని నంద్యాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, అనుభవజ్ఞుడైన శిల్పా మోహన్‌రెడ్డి ఓటు వేసి గెలిపించాలన్నారు.తమ వల్లే నంద్యాల అభివృద్ధి జరుగుతుందని, తాము లేకుంటే చంద్రబాబు నాయుడు ఈ నియోజకవర్గం వైపు చూసే వారు కాదని వ్యాఖ్యానించారు. కోట్లాది రూపాయలు డబ్బులు వెదజల్లి గెలుపు కోసం ప్రయత్నాలు ప్రారంభించారని, వాటిని తిప్పి కొట్టాలని ఓటర్లను కోరారు. రాబోయే రోజుల్లో నవరత్నాల పథకాలు ప్రతి ఇంటికి చేరాలని అప్పుడే పేదవారు అనేవారు ఉండరని పేర్కొన్నారు. విలువతో కూడిన రాజకీయం చేయడమే తన విధానమని, అందరి జీవితాల్లో గెలుపులు నింపడమే లక్ష్యమన్నారు. ఈ క్రమంలోనే ఓటర్లు ఆశీర్వదించాలని, విజయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కుల మత పార్టీలకు అతీతంగా అందరికీ అండగా ఉంటానన్నారు. ఈ రోడ్ షోలో అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

22.5 కిలో మీటర్ల రోడ్ షో

గురువారం మొత్తం 22.5 కిలో మీటర్ల మేర రోడ్ షో కొనసాగింది. నంద్యాల పట్టణ పరిధిలోని నూనెపల్లె క్రాస్, నంద్యాల రూరల్ పరిధిలోని చాబోలు, చాబోలు టెక్కె, గోస్పాడు పరిధిలోని సాంబవరం, దీబగుంట్ల, కానాలపల్లె, ఎస్ నాగులవరం, నెహ్రునగర్, సత్యనారాయణాపురం, జిల్లెల్ల, అయ్యలూరు మెట్ట, అయ్యలూరుప్రాంతాల్లో రోడ్ షో జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి జగన్ రోడ్ షోకు మంచి స్పందన లభించింది.



నంద్యాల పోలింగ్‌లో వివిపాట్స్

ఎవరికి ఓటేశారో స్లిప్‌లో వస్తుంది



నంద్యాల, ఆంధ్రప్రభ ప్రతినిధి : నంద్యాల ఉప ఎన్నికల్లో అధికారులు నూతన విధానాన్ని అలంభిస్తున్నారు. ఈ నెల 23వ తేదీన జరిగే ఎన్నికల్లో ఈవీఎం మిషన్లతోపాటు నూతనంగా వివిపాట్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఓటరు ఓటు వేసిన వెంటనే తాను ఏ పార్టీకి ఓటు వేసింది స్లిప్ రూపంలో మూడు సెకండ్ల పాటు కనబడే విధంగా కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టబోతున్నారు. అనంతరం ఆ స్లిప్ ఒక బాక్స్‌లో పడుతుంది. ఈ విషయంలో అధికారులు తుది నిర్ణయం తీసుకున్నారు. రాజకీయ పార్టీలకు దీనిపై అవగాహన కల్పించే దిశగా కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు ఉన్న నేపథ్యంలో ఒకే ఈవీఎంను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎప్పటిలా నోటా సౌకర్యం కల్పిస్తున్నారు.

ఈసీ నిఘా

• తరలివెళ్లిన ఇంటెలిజెన్స్ • ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితులపై వివరాల సేకరణ

అమరావతి, ఆంధ్రప్రభ: రాజకీయ వేడెక్కిస్తున్న నంద్యాల ఉప ఎన్నికల్లో తాజా పరిణామాలను సేకరించేందుకు నిఘా అధికారులు, సిబ్బంది తరలివెళ్లారు. నియోజకవర్గంలోని వాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరు వెళ్లారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలంటూ ఉన్నతాధికారుల నుంచి వీరికి ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఈ నెల 23న జరిగే నంద్యాల ఉప ఎన్నికలను అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తరుపున మంత్రి అఖిలప్రియతోపాటు పలువురు మంత్రులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎన్నిలక నోటిఫికేషన్‌కు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం నంద్యాలలో రెండు రోజుల పాటు పర్యటించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ సైతం నంద్యాలలో పర్యటించగా మరోసారి ముఖ్యమంత్రి, లోకేష్ కూడా పర్యటనకు వెళ్లనున్నారు. మరోపక్క శిల్పా మోహనరెడ్డి తరుపున ఒకసారి భారీ బహిరంగ సభ నిర్వహించిన జగన్మోహన రెడ్డి, మూడు రోజులుగా అక్కడే రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు కూడా విస్తృతంగా నంద్యాల నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇరుపార్టీల మధ్య గెలుపు ప్రతిష్ఠాత్మకంగా మారడంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహ, ప్రతివ్యూహాలు పొందుతున్నారు. ఈ క్రమంలోనే అక్కడి పరిస్థితులపై ఇంటిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. సమాచార సేకరణల నిపుణులైన అధికారులు, సిబ్బందిని నంద్యాల పంపారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన సమర్థులైన అధికారులు, సిబ్బందిని ఎంపిక చేసి పంపినట్లు తెలిసింది. అక్కడ ఓటర్ల నాడీతో పాటు రాజకీయ పార్టీలు అనుసరించే వ్యూహాలపై కూడా ఇంటిలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఏయే ప్రాంతాల్లో ఏ పార్టీకి మద్దతు ఉంది, ఎక్కడెక్కడ ఆయా పార్టీలు బలహీనంగా ఉన్నాయి, సరిచేసుకునేందుకు పార్టీల నేతలు అనుసరిస్తున్న పద్ధతులను ఇంటిలిజెన్స్ వర్గాలు సమగ్రంగా సేకరిస్తున్నాయి. ఇప్పటికే ఆయా అంశాలపై సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఎన్నికలు పూర్తయ్యే వరకు కూడా వీరిని అక్కడే ఉండి వివరాలు సేకరించాలని ఆదేశాలు ఇవ్వడంతో తదనుగుణంగా వీరు సమాచార సేకరణలో నిమగ్నమయ్యారు.

'కోడ్' ఉల్లంఘిస్తే కొరడా

• జగన్ వ్యాఖ్యలపై కలెక్టర్‌ను వివరణ కోరా

• అన్ని గ్రామాలు సమస్యాత్మకమైనవే • ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వీడియోగ్రఫీ

• కేటీఆర్‌పై వచ్చిన ఫిర్యాదును ఈసీకి పంపించా: భన్వర్‌లాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదులు వచ్చాయని, వీటిపై జగన్ సంజాయిషీ ఇచ్చారని తెలిపారు. అయితే కర్నూలు జిల్లా కలెక్టర్‌ను కూడా దీనిపై వివరణ కోరామని ఆయన చెప్పారు. ఆ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) నివేదిక పంపిస్తామని గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. అలాగే మంత్రులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని, వీటిని కూడా పరిశీలిస్తామని భన్వర్‌లాల్ చెప్పారు. మంత్రులు, రాజకీయ నాయకులు హుందాగా వ్యవహరించాలని, వ్యక్తిగత విమర్శలు సరికాదని ఆయన అన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, అయితే విధానాలు, కార్యక్రమాలకే పరిమితమైతే బాగుంటుందని ఆయన సూచించారు. నాయకులు చేసుకునే విమర్శలను ప్రజలు గమనిస్తుంటారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో మంత్రులు గెస్ట్‌హౌస్‌లు, ప్రభుత్వ కార్లను వినియోగించవద్దని, అలాగే అధికారుల సేవలను వాడుకోవద్దని భన్వర్‌లాల్ స్పష్టంచేశారు. నంద్యాల నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని భన్వర్‌లాల్ చెప్పారు. ఎన్నికల నిర్వహణకు ఎనిమిది కంపెనీల కేంద్ర బలగాలను కోరామని, దీనికి తోడు రాష్ట్రం నుంచి ప్రత్యేక పోలీసులు కూడా బందోబస్తులో పాల్గొంటాయని ఆయన చెప్పారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వీడియో తీస్తామని, ప్రతి ఓటరును ఫోటోతీసి పోలింగ్ బూత్‌లోకి పంపిస్తామని భన్వర్‌లాల్ తెలిపారు. అలాగే 173 మంది ఫ్లయింగ్ స్క్వాడ్లు, 33 చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మంత్రులు, రాజకీయ నాయకులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని ఆయన చెప్పారు. నంద్యాల నియోజకవర్గంలో ఒక జాతీయ పార్టీ, రెండు ప్రాంతీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేశారని చెప్పారు. అలాగే ఆరుగురు అభ్యర్థులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి, మరో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు రంగంలో ఉన్నారని భన్వర్‌లాల్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఇంతవరకు రూ.10.75 లక్షల నగదు, నాలుగు మోటార్ సైకిళ్ళు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలు డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేస్తే 9223166166 ఫోన్ నెంబర్ ద్వారా తమకు ఫిర్యాదు చేయవచ్చునని, అలాగే ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ స్టేషన్‌లో ఉందో తెలుసుకునేందుకు ఇదే నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చునని చెప్పారు. తెలంగాణ ఐటిశాఖ మంత్రి కేటీ రామారావుపై వచ్చిన ఫిర్యాదును ఎన్నికల సంఘానికి పంపించానని ఓ ప్రశ్నకు సమాధానంగా భన్వర్‌లాల్ చెప్పారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన డాక్యుమెంట్లు న్యాయపరమైనవని, వాటిని ఎన్నికల సంఘమే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు.

ఎన్నికల పోరు.. బెట్టింగ్‌ల జోరు

• ఉత్కంఠ రేపుతున్న ఉప ఎన్నిక

• కర్నూలు, నంద్యాల అమరావతిలో లక్షల్లో పందాలు

కర్నూలు, కెఎన్ఎన్ బ్యూరో : నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలపై అప్పడే ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. హైదరాబాద్, కర్నూలు, నంద్యాల, అమరావతిలో బెట్టింగ్‌ల జోరు ఊపందుకుంది. లక్షల్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సమాచారం. నంద్యాల ఉప ఎన్నికను టీడీపీ, వైసీపీ రెఫరెండంగా భావిస్తుండటంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగనుంది. ఈ నేపథ్యంలో కొందరు బెట్టింగ్ రాయళ్లు రహస్యంగా పందెలు కాస్తున్నారు. లాడ్జిలు,పెద్ద హోటళ్ళు, ప్రత్యేక భవనాలను అద్దెకు తీసుకొని బెట్టింగ్ కొనసాగిస్తున్నట్లు సమాచారం. కాయ్ రాజా కాయ్ అంటూ వందకు పది వేలు, పది వేలకు లక్ష, లక్షకు కోటి అంటూ బెట్టింగ్‌ల జోరు సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. పోటీలో కాంగ్రెస్, రాయలసీమ పరిరక్షణ పార్టీ వంటివి ఉన్నా ప్రధాన పోటీ మాత్రం టీడీపీ, వైసీపీల మధ్యనే ఉండనుంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌లు ముఠాలు రంగంలోకి దిగి లక్షల్లో బేరసారాలకు దిగుతున్నారు. పోలీసులు కూడా నంద్యాల ఉప ఎన్నికలో బిజీగా ఉండడంతో బెట్టింగ్‌ల వైపు దృష్టి సారించక పోవడంతో బెట్టింగ్‌లు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ బెట్టింగ్ వ్యవహారం చిన్న చిన్న వారికే పరిమితం కాకుండా ఈ బెట్టంగ్‌లను రాజకీయ నాయకులు సైతం వేసుకుంటుండడం గమనార్హం. టీడీపీ ఎట్టి పరిస్థితుల్లో గెలుస్తుందని కొందరు, లేదు లేదు వైసీపీ గెలుస్తుందని కొందరు ఈ బెట్టంగ్‌లకు దిగుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఉండడం వలన వైసీపీని ప్రజలు గెలిపిస్తారని కొందరు, అధికార టీడీపీకే నంద్యాల ప్రజలు పట్టం కడతారని టీడీపీ శ్రేణులు చెబుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లకు ప్రాధాన్యత ఏర్పడింది. గతంలో ఈ బెట్టింగ్‌ల ముఠాలు క్రికెట్ వంటి వాటికే పరిమితం కాగా ,ఇప్పడు నంద్యాల ఉప ఎన్నికలకు పాకింది. బెట్టింగ్‌లు ఒక్కొక్క సారి ప్రాణాలు పోయే పరిస్థితులు కూడా కల్పించే ప్రమాదాలు ఉన్నాయి. గతంలో అనేక మంది యువత బెట్టింగ్‌లకు ప్రాణాలు తీయడం వంటి ప్రమాద సంఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా ఆస్తులు కూడా పోగొట్టుకున్న వారు సైతం ఉన్నారు. అయినప్పటికీ ఈ బెట్టింగ్‌లు ముఠాలు మాత్రం తమ పనులు రహస్యంగా నడిపించుకుంటున్నారు. కంప్యూటర్ల ద్వారా రహస్య కోడ్ విధానంతో ఈ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా నంద్యాల, అమరావతి, హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ఈ బెట్టింగ్ వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీ గెలిస్తే ఇంత అని వైసీపీ గెలిస్తే మరి కొంత అంటూ వేలల్లోనే ఈ దందా సాగుతోంది. కొంత మంది అమాయకులు దగ్గర నుంచి మరి కొందరు చదువుకున్న వారు సైతం బెట్టింగ్‌లలో డబ్బులు ఎక్కువగా వస్తాయని ఆశపడి అప్పలు చేసి మరీ బెట్టింగ్‌లకు దిగుతున్నారు. బెట్టింగ్‌ల నిరోధానికి పోలీసులు ఒక వైపు చెక్‌లు పెడుతున్నప్పటికీ ఏదో ఒక రూపంలో ఈ బెట్టింగ్‌లు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా పోలీస్ అధికారులు బెట్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ప్రచారంలో బాబు ముద్ర

• నిత్యం కేడర్‌తో టచ్‌లో ఉన్న అధినేత

• ప్రణాళికాబద్ధమైన దిశానిర్దేశం

• సీఎం వాకబుతో నేతల్లో దడ

నంద్యాల, ఆంధ్రప్రభ : నంద్యాల శాసనసభ నియోజకవర్గంలో ఇప్పటికే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకత్వం భారీ మెజారిటీ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రత్యేకించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు రోజులకు ఒకసారి నంద్యాలలో క్షేత్రస్థాయి నాయకుల తోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ కేడర్‌తో ఫోన్లలో, కాన్ఫరెన్స్‌ల ద్వారా సంప్రదిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. నంద్యాల పట్టణంతోపాటు గోస్పాడు, నంద్యాల రూరల్ ప్రాంతాలపై ఇప్పటికే పూర్తి అవగాహన వున్న ముఖ్యమంత్రి అన్ని స్థాయిలలో కేడర్‌ను అప్రమత్తం చేసేలా వ్యూహరచన చేశారు. నంద్యాల మునిసిపాలిటీలో వార్డుల వారీగా, మండలంలో గ్రామాలవారీగా రోజూ జరుగుతున్న ఎన్నికల ప్రచారాన్ని చంద్రబాబు పర్యవేక్షిస్తున్నారు. రోజు రోజుకూ ప్రచారంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకోవాలని కోరుతున్నారు. సమస్యల పరిష్కార సాధనలో ఓటర్లకు భరోసా కల్పించాలని, ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ప్రకటించిన అభివృద్ధి పనులపై కూడా ప్రజలలో ప్రచారం చేయాలని కోరుతున్న ముఖ్యమంత్రి వాటి అమలు తీరుపై కూడా దృష్టిసారించాలని నేరుగా ఫోన్ల ద్వారా, టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులను కోరుతున్నారు. ఈ సందర్భంగా ఆయన గృహ నిర్మాణం, పెన్షన్లు, రోడ్ల విస్తరణ, డ్రైనేజి, రేషన్ కార్డులు, ఇళ్ళ నిర్మాణం వంటి పనులను ఉదహరిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందు వ్యూహాత్మకంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. పలు సందర్భాలలో రాష్ట్ర సచివాలయంలో కూడా రాయలసీమ మంత్రులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేయడం జరిగింది. ఆ పనుల కొన సాగింపపై ఆయన నిరంతరం నంద్యాల కేడర్‌తో టచ్‌లో వుంటూ శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ఎన్నికలను ముఖ్యమంత్రే నేరుగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. స్వర్గీయ భూమా నాగిరెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు రోడ్డు విస్తరణ జరిగింది. బాధితులలో అసంతృప్తి లేకుండా చేయాలని ఇప్పటికే పార్టీ శ్రేణులను చంద్రబాబునాయుడు ఆదేశించారు. దీంతో కూల్చివేతకు గురైన భవనాల యజమానులకు నష్టపరిహారం అందించాలని కూడా ముఖ్యమంత్రి యోచిస్తున్నారు. ఎన్నికలలో ఎక్కడా సమన్వయ లోపం వుండరాదని, ప్రణాళికాబద్ధంగా ప్రచారం జరగాలని ఆయన



నిర్దేశించారు. తాను నంద్యాల ప్రచారానికి వచ్చేలోగా ఎన్నికలలో సాధించనున్న మెజారిటీపై స్పష్టతకు రావాలని నిర్దేశిస్తున్నారు. ఈ నెల 19, 20 వ తేదీలలో నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని సూచనప్రాయంగా వెల్లడించారు. ప్రస్తుతం ఉప ఎన్నికలు ప్రతిష్ఠాత్మకమైనవని, ప్రభుత్వ పనితీరుకు ఈ ఎన్నికలు అద్దం పట్టాలని కేడర్‌తో అన్నారు. తానొక్కడినే రాష్ట్రా భివృద్ధికి, నంద్యాల అభివృద్ధికి కష్టపడితే సరిపోదని, అందరూ సమష్టికృషితో ముందుకు సాగాలని పిలుపునిస్తున్నారు. నవ్యాంధ్ర నిర్మాణానికి కంకణ బద్ధులయినట్టుగానే, నంద్యాలలో కూడా విజయం కోసం రాజీలేని విధంగా అధర్మాన్ని ఓడించే లక్ష్యంగా కష్టించి పనిచేయాలని అన్నారు. తన స్థాయిలో నంద్యాల కోసం రాజకీయంగా, అభి వృద్ధి, సంక్షేమ పరంగా లెక్కకు మిక్కిలి అభివృద్ధి చేశానని, ఇంకా చేస్తున్నానని ఆయన కేడర్‌తో అన్నారు.

ఛైర్మన్ పదవిపై ప్రస్తావన

నంద్యాల కేడర్‌తో నిరంతరం టచ్‌లో ఉంటున్న చంద్రబాబు మరోవైపు ఎన్నికలో టీడీపీ విజయం సాధిస్తే ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటానని చెబుతున్నారు. ఇప్పటికే ఎన్నికల నేపథ్యంలోనే ఎమ్మెల్సీ పదవులు, కార్పొరేషన్ ఛైర్మన్ పదవులపై ఇచ్చిన మాటను నెలబెట్టుకున్న ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ ఎన్.ఎం.డి. ఫరూఖ్ కు కేబినెట్ హోదాతో కూడిన ఎ.పి.శాసనమండలి ఛైర్మన్ పదవిని కూడా ఇస్తామంటూ టెలికాన్ఫరెన్స్‌లలో చెబుతున్నారు. ఫలితంగా ఎన్నికల అనంతరం కూడా మంత్రి పదవితో సమానమైన ఛైర్మన్‌గా ఫరూఖ్ అందుబాటులోవుంటారని, వచ్చే రెండేళ్ళలో కూడా ఎక్కడా అభివృద్ధి ఆగే అవకాశాలు కూడా లేవని ముఖ్యమంత్రి చంద్రబాబు విడమరిచి చెబుతున్నారు. ముఖ్యంగా నంద్యాల నియోజకవర్గంలో మైనారిటీలపై ప్రత్యేక ఫోకస్‌ను పెట్టాల్సిందిగా పార్టీ ముఖ్యులకు అధినేత చెబుతున్నారు. అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని గెలిపించడమే ఏకైక మార్గమనే రీతిలో ముఖ్యమంత్రి కేడర్‌కు హితోపదేశం చేస్తున్నారు.

నిధుల జాప్యానికి వైకాపా కారణం



ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఏపీ మంత్రి లోకేష్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వైకాపా ఎంపీల ఫిర్యాదులతోనే ఉపాధి హామీ నిధుల చెల్లింపులో కేంద్రం జాప్యం చేస్తోందంటూ ఆంధ్రప్రదేశ్ ఐటీ మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఏదో గోల్‌మాల్ జరుగుతోందని లేనిపోని ఆరోపణలు చేస్తూ వైకాపా ఎంపీలు అవినాష్ రెడ్డి, విజయసాయి రెడ్డి పార్లమెంటులో ప్రశ్నలు అడగడంతో పాటు సంబంధిత శాఖా మంత్రులకు ఉత్తరాలు రాశారని ఆయనన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న లోకేష్ తన శాఖకు సంబంధించి పలు పెండింగ్ అంశాలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ భేటీ అయ్యారు. పార్లమెంటు భవనంలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో లోకేష్‌తో పాటు ఎంపీలు కొనకళ్ల నారాయణ, ముత్తంశెట్టి శ్రీనివాస రావు (అవంతి), కేశినేని నాని, మాగంటి బాబు, నిమ్మల కిష్టప్ప, తోట సీతారామలక్ష్మి తదితరులు కూడా పాల్గొన్నారు. అనంతరం పార్లమెంటులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లోకేష్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధుల విడుదల జాప్యమవడానికి వైకాపా నేతలే కారణమని చెప్పారు. తన కంటే ముందు అయ్యన్నపాత్రుడు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కేంద్రానికి లేఖలు రాశారని, ఆ తర్వాత తాజాగా ఆ పార్టీకే చెందిన ఎంపీలు అవినాష్ రెడ్డి, విజయసాయి రెడ్డి కూడా అదే పని చేస్తున్నారని లోకేష్ చెప్పుకొచ్చారు. ఎవరైనా ఆరోపణలు చేసినప్పుడు వివరణ అడగడం సాధారణమని, కేంద్రం కూడా వివరణ కోరగా తాము సమాధానమిచ్చామని ఆయన తెలిపారు.

ఉపాధి హామీ పథకాన్ని దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేశామని లోకేష్ అన్నారు. మెటీరియల్ బడ్జెట్ కింద ఈ మొత్తంతో పాటు లేబర్ బడ్జెట్ కింద మరో రూ. 600 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందని తెలిపారు. ఈ బకాయిల చెల్లింపుల విషయంలో ఆలస్యం జరగకుండా చూడాలని తాను కేంద్ర మంత్రిని కోరినట్టు ఆయన వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి 24 గంటల్లోపే పెండింగ్ చెల్లింపులన్నీ క్లియర్ చేస్తామని హామీ ఇచ్చినట్టు లోకేష్ వెల్లడించారు. ఈ క్రమంలోనే విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా వైకాపా ఎంపీల లేఖల కారణంగానే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు.

కేంద్ర మంత్రిని కలవడానికంటే ముందు పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి జితేందర్ సింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అమర్జీత్ సిన్హాతో కృషి భవన్లో సమావేశ మయ్యారు. ఉపాధి హామీ బకాయిల విషయంతో పాటు గ్రామీణ రహదారుల గురించి చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో 2,207 నివాస ప్రాంతాలకు రోడ్డు సదుపాయం లేకపోయినా కనెక్టెడ్ హ్యాబిటేషన్స్‌గా కేంద్రానికి తప్పుడు సమాచారమిచ్చారని అధికారులకు వివరించారు. వాటిని రోడ్ సదుపాయం లేని నివాస ప్రాంతాలుగా తిరిగి గుర్తిం చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 4,772 కి.మీ. గ్రామీణ రహ దారుల నిర్మాణం కోసం రూ. 3,185 కోట్లు ఖర్చవు తుందని, దీనికి కేంద్రం సహాయం చేయాలని కోరారు. వీటితో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్‌కు రావాల్సిన 2వ విడత నిధులు రూ. 165 కోట్లు విడుదల చేయాలని నారా లోకేష్ కోరారు.

వెంకయ్య మార్గదర్శకత్వం కోరాను

బుధవారం రాత్రే ఢిల్లీ చేరుకున్న నారా లోకేష్ గురువారం ఉదయం గం.10.30 ని.కు అబ్దుల్ కలాం రోడ్డులోని వెంకయ్య నాయుడు నివాసంలో ఆయన్ను కలిశారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత మర్యాద పూర్వకంగా కలిసిన లోకేష్, ఈసందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వెంకయ్య నాయుడు భారతదేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడం ఒక విధంగా రాష్ట్రానికి లోటే అయినా, గర్వకారణమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి వెంకయ్య నాయుడు ఎనలేని సహాయ సహకారాలు అందించారని, ఆయన కృషి ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని అన్నారు. అలాంటి నేత నుంచి మార్గదర్శకత్వం కావాలని అడిగానని, యువనేతగా తాను ఆయన నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని లోకేష్ వ్యాఖ్యానించారు.

క్రాస్ ఓటింగ్ దడ

• ప్రధాన పార్టీల్లో వణుకు

• మైనార్టీ ఓటు బ్యాంక్‌పై అందరి కన్ను

కర్నూలు, కెఎన్ఎస్ బ్యూరో : నంద్యాల ఉప ఎన్నిక ప్రచార పర్వంలో టీడీపీ, వైసీపీలు దూసుకుపోతున్నాయి. బడా బడా నేతలంతా నంద్యాల్లోనే మకాం వేసి ప్రచారం చేపడుతున్నారు. ఒక వైపు ప్రచారాలు చేసుకుంటూనే మరో వైపు విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రచార సెగలు వేడి పుట్టిస్తున్నాయి. ఇప్పటికే వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి మద్దతుగా అధినేత వైఎస్ జగన్ మూడు రోజులుగా నంద్యాలలోనే మకాం వేసి రోడ్‌షోలతో ప్రచారంలో వేగం పెంచగా ఆయన వెంట ఎమ్మెల్యేలు ఉన్నారు. మరో వైపు టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి మద్దతుగా అక్క మంత్రి భూమా అఖిల ప్రియ, ఉప ముఖ్యమంత్రి కేఈ క్రిష్ణమూర్తి, మంత్రులు కాల్వ శ్రీనివాసులు, మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వంటి హేమాహేమీలు ప్రచారం చేస్తున్నారు. గెలుపుపై అటు టీడీపీ, ఇటు వైసీపీ పూర్తి భరోసాగా ఉన్నాయి. అయితే అంతర్గతంగా ఆయా పార్టీల నేతల్లో క్రాస్ ఓటింగ్ ఆందోళనలు కనిపిస్తున్నాయి.ఎవరి ఓట్లు ఎవరికి పడతాయన్న కోణంలో విశ్లేషణలు చేసుకుంటున్నారు. ఇప్పటికే అంచనాలు వేసుకున్న పార్టీలకు చివరికి క్రాస్ ఓటింగ్ కొంపలు ముంచనున్నాయా అన్న అనుమానాలు వెంటాడుతున్నాయి. నంద్యాల బరిలో 15 మంది అభ్యర్థులు ఉండగా అందులో ప్రధాన పోటీ టీడీపీ, వైసీపీల మధ్యనే ఉండే అవకాశాలు ఉన్నాయి. అయితే ఈ రెండు పార్టీల గెలుపు కూడా అంత సులభంగా లేదన్న భావనలు కూడా వ్యక్తమవుతోంది. టీడీపీ, వైసీపీలకు రాయలసీమ పరిరక్షణ పార్టీ, కాంగ్రెస్ పార్టీల నుంచి చీలే ఓట్లు ఏ పార్టీకి లాభం చేకూరవచ్చుననే ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఎవరికి వారు పలానా ఓటు మనకే పడతాయంటూ గాలిలో మేడలు కట్టి ఊహాగానాలు చేసుకుంటున్నప్పటికీ క్రాస్ ఓటింగ్ చివరికి వారి ఏ పార్టీని పాతాళ గంగలోకి విసురుతాయో చెప్పలేని రాజకీయ పరిస్థితి నెలకొంది. ఉప ఎన్నికలలో టీడీపీకి, వైసీపీలు బలమైన పార్టీలే అయినప్పటికీ రాయలసీమ పరిరక్షణ పార్టీ,కాంగ్రెస్ పార్టీలను తక్కువగా అంచనా వేయడానికి వీలు లేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు తనకు లాభిస్తుందని వైఎస్ఆర్‌సిపి భావిస్తున్నప్పటికీ అది అంత తేలికైన విషయం కాదని మరికొందరు వాదిస్తున్నారు. ఒక వేళ ప్రభుత్వ వ్యతిరేక ఓటు శాతం 10 శాతం ఉన్నా అది వైఎస్ఆర్‌సిపికి నష్టమే కల్గించవచ్చునని భావిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంక్ విషయంలో యువత కొందరు రాయలసీమ పరిరక్షణ పార్టీ వైపు మళ్లే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే వైఎస్ఆర్‌సిపికి మేలు చేసే అవకాశాలు లేవని భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ అనేక సంవత్సరాలుగా ఉన్న పార్టీ కావడంతో ఆ పార్టీకి ఎంతో కొంత ఓటు బ్యాంక్ ఉంది. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పరిస్థితి బాగా లేక పోయినప్పటికీ నంద్యాల ఉప ఎన్నికల నాటికి కొంత మెరుగు కావచ్చునని భావిస్తున్నారు. ప్రత్యేక హోదా విషయంలో అటు బీజేపీ, ఇక్కడ టీడీపీ విఫలం చెందాయంటూ ఆ పార్టీ ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే.

రూ.12వేల కోట్లతో బీఆర్‌శెట్టి మెడిసిటీ

- అమరావతిని నాలెడ్జి కేంద్రంగా మెడికల్ హబ్‌గా చేస్తా
- ప్రపంచంలోని తెలివైన వారిని అమరావతికి రప్పిస్తా
- రైతుల వల్లే అమరావతిలో రాజధాని నిర్మాణం
- నాపై నమ్మకంతో 35వేల ఎకరాలిచ్చారు
- రైతుల నమ్మకాన్ని వమ్ము చేయను
- గన్నవరం నుంచి దుబాయ్‌కు నేరుగా ఎమిరేట్స్ విమానం



హైదరాబాద్/అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్ర రాజధాని అమరావతిని మెడికల్ హబ్‌గా, నాలెడ్జి కేంద్రంగా తయారు చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. రాష్ట్రానికి చెందిన తెలివైన వారంతా విదేశాల్లో స్థిరపడ్డారని, వారిని అమరావతికి రప్పిస్తానని ఆయన తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో రూ.12,000 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బీఆర్‌శెట్టి మెడిసిటీకి చంద్రబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గల్ఫ్‌దేశాల్లో అనేక ఆసుపత్రులు, మెడికల్ కేంద్రాలను నిర్వహిస్తున్న బీఆర్‌శెట్టి సంస్థ ప్రతిష్టాత్మకమైన మెడిసిటీ నిర్మాణాన్ని చేపట్టడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ సంస్థ నిర్మాణం వల్ల ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని రూ.12 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. ఈ సంస్థ మెడికల్ వర్సిటీ, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, వైద్యపరికరాల తయారీ కేంద్రం, నేచురోపతి, యోగా కేంద్రం నిర్మిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారంటే అది చాలా ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఇక్కడ హెల్త్‌కేర్ వస్తుంది. టూరిజంలో పెట్టుబడులు పెడతారన్నారు. ఇప్పుడైతే మనవాళ్లు ప్రపంచమంతా వెళ్లారు కానీ ప్రపంచం మొత్తం మన దగ్గరికే వచ్చే రోజు తొందర్లో ఉందని ఆయన చెప్పారు. మనవాళ్లు పోయే పనిలేదు.. వీలైతే ప్రపంచంలో ఉండే తెలివైన వాళ్లు మన అమరావతిలో పనిచేసే అవకాశం వస్తుందని హామీ ఇస్తున్నానని తెలిపారు.మేము ఈ సిటీని ఓ నాలెడ్జిహబ్‌గా తయారు చేయాలను కుంటు న్నామన్నారు. ఒక హెల్త్‌సిటీగా ప్రపంచానికే కేంద్రంగా తయారు చేయాలను కుంటున్నామని ఆయన తెలిపారు. మొత్తం విజయవాడ, గుంటూరు, అమరావతి కేంద్రంగా మనం పెద్ద ఎత్తున మెడికల్ హబ్‌గా తయారు చేస్తున్నామని ఆయన చెప్పారు. రైతుల వల్లే అమరావతిలో రాజధాని నిర్మాణం అనే చరిత్ర మొదలవుతోందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఎంతోమంది అమరావతిలో పెట్టుబడులు పెట్టబోతున్నారని, ప్రపంచస్థాయి పెట్టుబడులు అమరావతికి రాబోతున్నాయని ఆయన తెలిపారు. త్వరలో అమరావతిలో ఇండో-యూకే ఆసుపత్రికి శంకుస్థాపన చేయబోతున్నామని ఆయన తెలిపారు. రైతాంగం దూరదృష్టితో ఆలోచించారని, తానిచ్చిన పిలుపుతో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాజధానికి భూములను అప్పగించారని ఆయన చెప్పారు. ప్రభుత్వం భూములు కొనే పరిస్థితి లేదని, ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని అయినా రైతాంగం దూరదృష్టితో ఆలోచించి తన మీద నమ్మకంతో ఒక పైసా తీసుకోకుండా 35 వేల ఎకరాలను ఇచ్చారని తెలిపారు. బీఆర్‌శెట్టి తన ఆహ్వానాన్ని మన్నించి అమరావతి అభివృద్ధిలో భాగస్వామ్యులవుతున్నారని చెప్పారు.

పచ్చదనంలో నెంబర్ వన్

- రెండేళ్లలో 54.97కోట్ల మొక్కలు నాటిన తెలంగాణ
- 7.53 హెక్టార్లలో కొత్తగా మొక్కలు నాటిన ఏకైక రాష్ట్రం
- 230 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందడుగు



హరితహారం కార్యక్రమంలో భాగంగా డీజీపీ కార్యాలయంలో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న రోడ్‌సేఫ్టీ, రైల్వేస్ డీజీపీ టి.కృష్ణప్రసాద్.

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అడవుల పెంపకం, పచ్చదనం అభివృద్ధి పర్చడం, మొక్కలు నాటడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. జాతీయ అటవీ విధానం లోని గ్రీన్ మిషన్, మొక్కల పెంపకం విభాగాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉంది. 2016 -17లో దేశ వ్యాప్తంగా నాటిన మొక్కల్లో తెలంగాణ 26 శాతం వాటా సాధించింది. కేంద్ర ప్రభుత్వం 2016 -17లో తెలంగాణ రాష్ట్రానికి 80,446 హెక్టార్లలో పచ్చదనాన్ని అభివృద్ధి చేసే లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటి వరకు తెలంగాణ 4,36,913 హెక్టార్లలో ఫ లితాలను సాధించింది. ఇది నిర్దేశిత లక్ష్యం కంటే ఐదు రెట్లు ఎక్కువ. 2015 -16లో 59,970 హెక్టార్లలో మొక్కలు నాటాలనేది లక్ష్యం కాగా 2,36,598 హెక్టార్లలో ఫలితాలను సాధించారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా అడవులు పెంచడం, పచ్చదనం అభివృద్ధి పర్చడంలో తెలంగాణకు దరిదాపుల్లో కూడా లేదు. ఆంధ్రప్రదేశ్ 2.45 లక్షల హెక్టార్లు, ఒడిశా 1.97 లక్షల హెక్టార్ల లో పచ్చదనం అభివృద్ధి పర్చడం జరిగింది. 2016 -17లో దేశ వ్యాప్తంగా పచ్చదనం అభివృద్ధి, అడవుల పెంపకంలో లక్ష్యా లను మించిన ఫలితాలు వచ్చాయి. మొత్తం 10.89 లక్షల హెక్టార్లలో అడవులు పెంపకం, పచ్చదనం అభివృద్ధి లక్ష్యాన్ని పెట్టుకోగా 16.83 లక్షల హెక్టార్లలో ఫలితాలను సాధించారు. ఈ ఫలితాల్లో ఒక్క తెలంగాణ వాటాయే దాదాపు 26 శాతానికి పైగా ఉంది. తెలంగాణకు 80,446 హెక్టార్లలో పచ్చదనం అభివృద్ధి లక్ష్యం ఇవ్వగా డిసెంబర్ నాటికి 4,36,913 హెక్టార్ల లో ఫలితాలను సాధించింది. ఇది సుమారు 543 శాతం ఎక్కువ పచ్చదనం సాధించిన ఘనతగా రికార్డుల్లో నమోదయింది. గత రెండేళ్లుగా మొక్కల పెంపకంలో తెలంగాణ రికార్డు సృష్టించింది. హరిత హరం ఇప్పటికే రెండు విడతలుగా పూర్తి చేసుకొని మూడవ విడత రాష్ట్రం అంతటా జోరుగా సాగు తుంది. దేశ వ్యాప్తంగా 2016 -17లో 70.82 కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యం కాగా 133.43 కోట్ల మొక్కలను నాటారు. అందులో ఒక్క తెలంగాణ లోనే 36.73 కోట్ల మొక్కలను నాటడం జరిగింది. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రానికి 5.22 కోట్ల మొక్కల లక్ష్యాన్ని మాత్రమే ఇచ్చారు. అయినప్పటికీ 9 నెలల వ్యవధిలోనే 36.73 కోట్ల మొక్కలను నాటారు. 2015 -16లో కూడా 3.89 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి 13.78 కోట్ల మొక్క లను నాటి దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ఇది లక్ష్యానికి మూడు రెట్లు ఎక్కువ. దేశం మొత్తం మీద నాటిన మొక్కల సంఖ్యతో పోలిస్తే ఒక్క తెలంగాణ రాష్ట్రం వాటానే 27.52 శాతంగా నమోదయింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భా వం తర్వాత2014 జూన్ మొదలు2016 డిసెంబర్ వరకు రెండు సంవత్సరాల మూడు మాసాల కాలంలో రాష్ట్రంలో 54.97 మొక్కలు నాటారు. ఇప్పటి వరకు అదనంగా 7,53, 957 హెక్టార్లలో పచ్చదనాన్ని సాధించింది. తెలంగాణకు హరి తహరం కార్యక్రమంలో మొత్తంగా 230 కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యంతో తెలంగాణ ముందుకు సాగుతుంది. మొక్క లు నాటే కార్యక్రమాన్ని మహోద్యమంగా నిర్వహిస్తుంది. అన్ని వర్గాలను కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తుంది. మూడవ విడతలో 40 కోట్ల మొక్కలు నాటే లక్ష్యం ఇప్పటికే సగానికి చేరుకుంది. మొక్కల పెంపకంలో పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. మొక్కలునాటి పెంచి పెద్ద చేసిన కుటుంబాలకు పాడి పశువులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా ప్రకటించి గ్రామీణ పేదలను మొక్కల పెంపకానికి ప్రోత్సహిస్తున్నారు. కొండ ప్రాంతాల్లో మొక్కలు పెంచేందుకు సీడ్ బాల్స్ విధానాన్ని అమలు జరుపుతున్నారు. తెలంగాణలో 24 శాతంగా ఉన్న అడవులను 33 శాతానికి అభివృద్ధి పర్చడానికి హరితహారం కార్యక్రమాన్ని కొనసాగిసు న్నారు. మూడవ విడతలో 40 కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 35 శాతానికి పైగా మొక్కలు నాటారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌ను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. రాజధానికి మణిహా రంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును పచ్చదనంతో కళక ళలాడేలా ప్రణాళిక అమలు జరుపుతున్నారు. పట్టణా ల్లో కాలుష్యం నుండి ఉపశమనం కోసం అర్బ న్ పా ర్కులను అభివృద్ధి పరుస్తున్నారు. ప్రభు త్వం అత్యం త ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని అమలు జరుపు తున్నందుననే దేశంలోనే తెలంగాణ పచ్చద నాన్ని అభివృద్ధి పర్చడంలో నెంబర్ వన్‌గా నిలిచింది.

సుఖోయ్ విమానాల సామర్థ్యం పెంపు

న్యూఢిల్లీ: సుఖోయ్-30 యుద్ధ విమానాల శక్తి సామర్థ్యాన్ని భారతదేశం పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. కొత్త విమానాలకు నిఘా ప్యాడ్లు కలిగిఉంటాయి. కొత్త విమానాల్లో మందుగుండు సామాగ్రిని పెంచి , శక్తి వంతంగా కాల్పులు జరిపేందుకు వీలుగా సుఖోయ్ -30యుద్ధ విమానాల్లో నిఘా ప్యాడ్లుఉంటాయి. పాకిస్తాన్,చైనా సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొని ఉండటంతో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. వీటి కోసం భారత ప్రభుత్వం మూడు వేల కోట్ల రూపాయిలను ప్రతిపాదించింది. ఈ నిఘా ప్యాడ్లు పర్వతాలు, గుహల్లో, ఇతర మారు మూల ప్రాంతాల్లోని నక్కిన తీవ్రవాదులను గుర్తించడానికి ఉపయోగపడుతాయి. భూభాగంలో శత్రువులు విధ్వంసం సృష్టించేందుకు అమర్చిన వాటిని గుర్తించి వాటిని తొలగించడానికి ఈ నిఘా ప్యాడ్లు ఉపయోగ పడుతాయి. అనుమానం ఉన్న ప్రాంతాలను సోదా చేయుటలో కీలక పాత్ర వహిస్తాయి. కార్గిల్ యుద్ధ సమయంలో ఇటువంటి ప్యాడ్లు అందుబాటులో లేవు. దీంతో పాకిస్తాన్‌సైన్యం మరియు తీవ్రవాదులు



చిన్న చిన్న గుహల్లో దాక్కున్నారు. ప్రపంచ స్థాయిలో అవసరమైన సేవలందించేందుకు సుఖోయ్ యుద్ధ విమానాలు మోహరించేందుకు భారత వైమానిక దళం అడుగులు వేస్తోంది.

సత్ఫలితాలు ఇస్తున్న హరితహారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరి తహారం కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుం దని తెలంగాణ ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. దేశంలో నాటిన మొత్తం మొక్కల్లో 26 శాతం తెలంగాణలోనే ఉన్నాయని గురువారం ఆయన ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేప ట్టిన ఎస్‌ఆర్‌ఎస్‌పి పునరు జ్జీవం ప్రాజెక్టు లక్షలాది మంది రైతులకు ప్రాణధా రగా నిలుస్తుంద న్నారు. రాష్ట్రంలో కోటి ఎకరాలకు నీరందించాలని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు లక్ష్యంగా పెట్టుకున్నారని, అందుకు తగ్గట్టుగా అడుగులు వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ముందుకు వచ్చిన అమేజాన్ డాట్ కామ్‌కు కేటీఆర్ ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త జిల్లాలకు కలెక్టరేట్లు

కలెక్టర్లతో ఎస్.పి.సింగ్ వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్లు, ఎస్పి కార్యాలయాలను నిర్మించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి. సింగ్, పోలీసు డైరెక్టర్ జనరల్ అనురాగ్ శర్మలు గురువారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్, ఎస్పి కార్యాలయాల నిర్మాణాల కోసం భూ సేకరణ, ఇప్పటికే గుర్తించిన భూములను స్వాధీనం చేసుకోవడం, అన్ని అనుమతులు పొందిన పక్షంలో భవన నిర్మాణాలు చేపట్టడం లాంటి అంశాల పైన ప్రధానంగా చర్చించారు. సాధ్యమైనంత త్వరలో భూ సేకరణ జరిపి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్ర భుత్వ భూములను గుర్తించడానికి ప్రాధాన్యతను ఇవ్వాలని, ప్రభుత్వ భూములు అందుబాటులో లేని జిల్లా కేంద్రాల్లో ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలని కోరారు. భూ వివాదాలు పరిష్కరించుకోవాలని సూచించారు. సూర్యాపేట, కొత్తగూడెం, భూపాలపల్లి, మెదక్ జిల్లాల్లో భూ సేకరణలో ఉత్పన్నమైన అంశాలను ఈ సందర్భంగా చర్చించారు. నిర్దిష్ట కాల వ్యవధిలో కార్యాలయాలు అందుబాటులోకి వచ్చే విధంగా కలెక్టర్లు చొరవ చూపాలని కోరారు.

బీసీ సమస్య పరిష్కారానికి వినతి

- ప్రధాని మోడీని కలిసిన బీసీసంఘం నేత ఆర్ కృష్ణయ్య



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రధాన డిమాండ్ సహా పలు ఇతర డిమాండ్లతో ఢిల్లీలో ఆందోళన చేపట్టిన బీసీ సంఘాల జాతీయ నేత ఆర్. కృష్ణయ్య గురువారం పార్లమెంటులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిశారు. తెలుగుదేశం ఎంపీలు కొనకళ్ల నారాయణ, నిమ్మల కిష్టప్పతో పాటు ప్రధానిని కలిసిన కృష్ణయ్య బీసీ సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. రాజకీయ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని అన్నారు. అలాగే పదోన్నతుల్లో రిజర్వేషన్లు, 14 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, తదితర 14 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మోదీకి అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆర్. కృష్ణయ్య అన్నారు. బీసీలకు చెందాల్సింది చాలా ఉందని మోదీ వ్యాఖ్యానించినట్టు కృష్ణయ్య తెలిపారు.

బీసీల్లోనూ సమర్థత ఉంది: నిమ్మల కిష్టప్ప

బీసీల్లో సమర్థవంతమైన నాయకత్వం ఉంది. చదువుకున్నవారు ఉన్నారు. కానీ చట్టసభల్లో మాత్రం ప్రాతినిధ్యం లేదు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వండి అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీర్మానం చేసింది. దీన్ని పార్లమెంటు కూడా ఆమోదించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటికీ చట్టసభల్లో బీసీలు 10-15 శాతాని మించి లేరు. 50 శాతానికి పైగా జనాభా ఉన్నా అందుకు తగ్గట్టు రాజకీయ ప్రాతినిధ్యం లేదు. చట్ట సభల్లో రిజర్వేషన్లు కచ్చితంగా అవసరం. అప్పుడే వారి కష్టాలు తీరతాయి. బీసీలంతా వృత్తిపై ఆధారపడ్డ కులాలే. వృత్తుల్లో చాలా సమస్యలున్నాయి. కొన్ని సమస్యలపై మాట్లాడే పరిస్థితి కూడా లేదు. పార్లమెంటే అందరికీ వేదిక కావాలి. వ త్తుల సమస్యలు పరిష్కారం కావాలి.

బీసీల ప్రాతినిధ్యం నామమాత్రమే: కొనకళ్ల నారాయణ

50 శాతానికి పైగానే బీసీల జనాభా ఉన్నా రాజకీయ ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ఇంకా చెప్పాలంటే నామ మాత్రంగానే ఉంది. చట్ట సభల్లోనూ రిజర్వేషన్లు అమలు చేసిన నాడే ఇతర కులాలతో సమానంగా ఎదగగల్గుతారు. ప్రధానితో ఇదే విషయం చెప్పాం.

బీసీ రిజర్వేషన్లకోసం పోరాటం

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బీసీ కమిటీలు ఏర్పాటు చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, సబ్ ప్లాన్ ఏర్పాటుకై పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ బీసీ విభాగం సమావేశం గురువారం గాంధీభవన్‌లో జరిగింది. బీసీ సెల్ చైర్మన్,మాజీ ఎమ్మెల్యే చిత్తరంజన్ దాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాలను కేసీఆర్ సర్కార్ మాటలతోనే మోసం చేస్తోందని,ఈ విషయాన్ని గ్రామగ్రామాన చాటాలని కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ, జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీల రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరంఉందని, ఈ విషయం ప్రభుత్వం మాట్లాడకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాష్ట్రా నికి చెందిన ఎందరో బీసీలు జాతీయ స్థాయి నాయకులుగా ఎదిగారని చెప్పారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవి, నాగయ్య, అధికార ప్రతినిధి మహేష్ కుమార్ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్లశారద, ఇతర నాయకులు నిరంజన్, ప్రేమ్‌లాల్, సురేష్‌షెట్కర్, బొమ్మ వెంకన్న, సత్యనారాయణ గౌడ్,కొమిరెడ్డి రాములుతో పాటు 29 జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

నేరెళ్ల ఘటనలో ఎస్ఐ సస్పెన్షన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డీఐజీ రవివర్మ నివేదిక ఆధారంగా ఎస్ఐ రవివర్మపై సస్పెన్షన్ వేటు వేసింది. నేరేళ్ళలో ఇసుక లారీలను తగులబెట్టారనే కారణంగా ఈ ఘటనకు పాల్పడిన వారిపై పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. అంతేకాదు, దళితులను కూడా చూడకుండా దాడులకు పాల్పడ్డారని పోలీసుల తీరుపై విమర్శలు చెలరేగాయి. విపక్షాలు నేరేళ్ళ బాధితులను పరామర్శించి వచ్చిన తర్వాత మంత్రి కేటీఆర్ వేములవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై డీఐజీతో విచారణ జరిపిస్తామని మంత్రి కేటీఆర్ రెండురోజుల క్రితం బాధితులను పరామర్శించిన తర్వాత ప్రకటించారు. మంత్రి హామీ మేరకు ఈ ఘటనపై డీఐజీ రవివర్మ విచారణ చేశారు. ఈ ఘటనకు సీసీఎస్ ఎస్ఐ రవీందర్ అత్యుత్సాహమే కారణమని డీఐజీ రవివర్మ డీజీపీ అనురాగశర్మకు నివేదిక సమర్పించారు. ఎస్ఐ రవీందర్ అతిగా వ్యవహరించినట్లు నివేదికలో వెల్లడించారు. దీంతో ఎస్ఐ రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ ఐజీ నాగిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నేరేళ్ళ ఘటనకు సంబంధించి డీఐజీ నివేవదిక ఆధారంగా ఎస్ఐను సస్పెండ్ చేసినట్లు మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.


‘నేరెళ్ల’తో తెరాస పతనం

బాధితులకు న్యాయం కోసం అఖిలపక్ష పోరు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : నేరెళ్లలో దళితులు, బీసీలను చిత్రహింసలకు గురి చేసిన పోలీసలపైచర్యలు తీసుకోవా లని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్‌పైవిప క్షాలు ఏకమయ్యాయి. టీఆర్ఎస్ మినహా ఇతర పార్టీలు, ప్రజాసంఘాలు ఈ అంశంపై కలిసి పోరాటం చేయాలని నిర్ణయించాయి. తొలి దశ ఉద్యమ కార్యాచరణను ప్రక టించాయి. రాష్ట్రంలో దళితులపై దాడులు, నేరెళ్ల ఘటనపై గురువారం ఇక్కడ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. టీపీసీసీ ఎస్సీసెల్ ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో టీడీపీ,బీజేపీ, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఆప్, తెలంగాణ పొలిటికల్ జేఏసీతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు రూ.10లక్షలు ప రిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసింది. రాష్ట్ర చరిత్రలోనే నేరెళ్ల లాంటి ఘటన జరగలేదని చెప్పాయి. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎస్సీసెల్ చైర్మన్ ఆరేపల్లి మోహన్ సమన్వయకర్తగా వ్యవహరించారు.




నేడు డీజీపీతో భేటీ:ఉత్తమ్



టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్ కు మార్ రెడ్డి మాట్లాడు తూ, నేరెళ్లలో దళితులను థర్డ్ డిగ్రీ పద్ధతిలో పోలీసులు వేధించినప్పటికీచర్యలు తీసు కోవడంలో ప్రభుత్వం విఫల మైందని, ఈ విషయాన్ని వ దిలే ప్రసక్తిలేదన్నారు. నేరెళ్ల ఘటనతోనే టీఆర్ఎస్ ప్రభుత్వం పతనం ప్రారంభమైం దని చెప్పారు. దళిత, గిరిజనులు కేసీఆర్‌ను వదిలే ప్రసక్తిలేదని, కేసీఆర్‌ను రాష్ట్రం నుంచి తరిమికొడతారని హెచ్చరించారు. రాష్ట్రా న్ని జాగీరుగా భావిస్తున్నారని మండిపడ్డారు .


మీరాకుమార్‌ను అవమానిస్తారా



తెలంగాణ కోసం పెప్పర్ స్ప్రేను భరించి బిల్లు ఆమో దానికి కృషి చేసిన తల్లి లాంటి మీరాకుమార్‌ను అవమా నించడం సీఎం కేసీఆర్‌కు తగదని టీటీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ రేవంత్ రెడ్డి అన్నారు. విలేఖరుల సమావేశంలోఆమెను అగౌరవంగా మాట్లాడినందుకు క్షమాపణ చెప్పి ఉంటే కేసీఆర్ గౌరవంపెరిగేదన్నారు. కేసీఆర్ కుటుంబమే ఇసుక మాఫి యాను నడుపుతోందని, ఆయన కుటుం బానికి తెలియకుండా పోలీసులు అమా యకులను చిత్రహింసలు పెడతారా?అని ప్రశ్నించారు. గతంలో ఇసుక క్రయవిక్రయాలు పంచాయతి రాజ్ శాఖ ద్వారా నడి చేదని, ఈ ప్రభుత్వం వచ్చాక మైనింగ్ శాఖకు అప్పగించారని, కేవలం కోట్లు సంపాదిం చేందుకే శాఖను మా ర్చారని ఆరోపించారు.


తెలంగాణ బిల్లు సంద ర్భంగా 542 మంది ఎంపీ ల్లో కేసీఆర్ ఒక్కరే ఆ పార్టీ తరపున ఉన్నారని,అలాంటి స ందర్భంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తీసుకున్న చొరవ, లోక్‌సభ స్పీకర్‌గా మీరాకుమార్ చాకచక్యంగా వ్యవహరించడంతో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిందని చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరెళ్ల అంశంపై శుక్రవారం డీజీపీని క లవాలని నిర్ణయించిట్లు తెలిపారు. గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను కలుస్తామని, గవర్నర్ కార్యాలయం అపాయింట్‌మెంట్‌ను కోరామని వెల్లడించా రు. ఈ నెల 15 న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ వి గ్రహం వద్ద ప్రభుత్వవైఖరిని నిరసిస్తూ దీక్షలు చేపట్టనున్న ట్లు తెలిపారు.

30న వీహెచ్ ఆమరణదీక్ష



రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల గ్రామా నికి చెందిన దళితులు, బీసీలను చిత్రహిం సలు పెట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీసీసీ మాజీ అధ్యక్షుడు విహనుమం తరావు ఈ నెల 30 న ఆమరణ దీక్ష చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గురు వారం నేరెళ్ల బాధితులను స్వయంగా పరామర్శిం చారు.ఈ సందర్భంగా వారి పరిస్థితిని చూసి ఛలించిన విహెచ్ దీక్షచేపట్టాలని నిర్ణయించారు. ఈ విషయం పీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి కూడా తీసుకు పోతున్నట్లు విహెచ్ ఆంధ్రప్రభకు తెలిపారు.

పరామర్శకు వెళితే టూర్ అంటావా?




నేరెళ్ల బాధితులను పరామర్శించేందుకు విపక్ష పార్టీలకు చెందిన నేతలు వెళితే టూర్‌కు వచ్చారని కేటీఆర్ విమర్శించడాన్ని టీపీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క తప్పుబట్టారు. ఏ కార్యక్రమాన్న యినా రెండు నిమిషాల్లో ట్వీట్ చేస్తావు నేరెళ్లబాధితుల కు న్యాయం చేయడంపై ట్విట్టర్ ద్వారా ఎందుకు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ



రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జన్సీ నడుస్తోందని మాజీ మంత్రి, టీడీపీ నేత మోత్కుపల్లి నర్సిం హులు ఆరోపించారు. రజాకార్ల అకృత్యాలు తాను చూడలేదని, కానీ, కేసీఆర్ పాలన లో అంతక ంటె మించిన దుర్మార్గాలను చూస్తున్నానని చెప్పారు.

ఛాయా చిత్ర ప్రదర్శనను వివరించిన రమణ



నేరెళ్ల ఘటనపై టీడీపీ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన సంఘటన కళ్లకు గట్టినట్లుంది. బాధితులకు కొట్టిన దెబ్బల ఫోటోలను గూర్చి టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ నాయకులకు వివరించారు. కేసీఆర్ పాలనపై విమర్శలు గుప్పించారు. రజాకార్లను తలపిస్తూ కేసీఆర్ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వ హయాంలో దళితులు, గిరిజనులకు రక్షణ లేకుండాపోయిందని ఆరోపించారు. ఇసుక మాఫియాను కేసీఆర్ కుటుంబమే ప్రోత్సహిస్తోందని చెప్పారు.

నిరంకుశత్వం సహించం: చింతా

రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని సహించే ప్రసక్తిలేదని బీజేపీ రాష్ట్ర శాఖ నాయకుడు చింతా సాంబమూర్తి హెచ్చరించారు. నేరెళ్లలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందనీ, ఆ శవపేటికపై కేసీఆర్ పరిపాలన చేస్తున్నారని ఆరోపించారు.

ఐక్యఉద్యమం చేపడతాం: కోదండరాం



నేరెళ్ల ఘటనతో పాటు దళితులు, ఎస్టీలపై జరు గుతున్న అత్యాచారాలు, దాడులకు వ్యతిరే కంగా ఐక్య ఉద్యమం చేపడ దామని తెలంగాణ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం పిలుపనిచ్చారు.మీరా కుమార్ తదితరుల పట్ల కేసీఆర్ మాట్లాడినతీరు పట్లకోదండరాం అభ్యంతరం వ్యక్తంచేశారు. బాధితులు ముందుంటే కడదాకా పోరాటం సాగిద్దామని అన్నారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి: శిరివెళ్ల

నేరెళ్లలో పోలీసుల దాష్టికానికి వ్యతిరేకంగా జరిగే విచా రణ వేగవంతం చేసేందుకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేయా లని ఏఐసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ శిరివెళ్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. సవరించిన ఎస్సీ,ఎస్టీ చట్టం మేరకు 60 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుందని, తీర్పు కూడా 120 రోజుల్లో వచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పోరాటాలు చేబడతాం: బాలమల్లేష్


కేసీఆర్ అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలకై ఏకం కావాలని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు సీపీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల మల్లేష్ పిలుపునిచ్చారు. అన్ని రకాల మాఫియాలను కేసీఆర్ సర్కార్ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు.


హైకోర్టులో కేసు వేస్తాం: ప్రొఫెసర్‌విశ్వేశ్వర్

నేరెళ్ల ఘటనలో బాధితులకు న్యాయం జరిగేందుకు హైకోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయనున్నట్లు ఆప్ పార్ట రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు చెప్పారు. కేసీఆర్, కేటీఆర్‌లపై కూడా ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాల్సి ఉందన్నారు.

ఇంకా బెదరింపులు వస్తున్నాయి: బాధితులు

ఈ సమావేశంలో నేరెళ్ల బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడారు. చెప్యాల బాలరాజు తండ్రి చెప్యాల రాము లు, బత్తుల మహేష్ సతీమణి కవిత, పసుల బాలయ్య భార్య వజ్రమ్మ, గంధం గోపాల్ బావ దేవయ్య తమ బంధువులపై పోలీసులు చేసిన దమనకాండను వివరించారు. అక్రమంగా కేసుల్లో ఇరికించి, చిత్రహింస లకు గురి చేశారని తెలిపారు.





వీడ్కోలు సభలో ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీతో ప్రధాని నరేంద్ర మోడీ, ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్

విమర్శలు వినాల్సిందే


లేకుంటే నిరంకుశత్వమే

వీడ్కోలు సభలో ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ హితవు

న్యూఢిల్లీ: పదేండ్ల పాటు దేశానికి ఉప రాష్ట్రపతిగా సేవలందించిన హమీద్ అన్సారీకి రాజ్యసభ గురువారం ఘనంగా వీడ్కోలు పలికింది. దిగువ సభకు చైర్మన్‌గా పలు ముఖ్యమైన బిల్లుల ఆమోదంలో ఆయన కీలక పాత్ర పోషించారు. దేశ చరిత్రలో తొలి ఉప రాష్ట్రపతిగా నియామకమైన సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత పది సంవత్సరాల పాటు సేవలందించిన వ్యక్తిగా అన్సారీ మిగిలిపోనున్నారు. గురువారం ఆయన పదవికి చివరి రోజు అయినందున అన్సారీతో పాటు ప్రధాని, మాజీ ప్రధాని మన్మోహన్, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తదితరులు రాజ్యసభ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.విమర్శలు లేకుంటే ప్రజాస్వామ్యంలో నిరంకుశ వాతావరణం నెలకొంటుందని భారత ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విధానాలను స్వేచ్ఛగా విమర్శించే పరిస్థితి ఉండాలన్నారు. తన వీడ్కోలు ప్రసంగంలో ఎవరి పేరు ప్రస్తావించకుండా... దేశంలో ప్రతి పౌరుడి హక్కులు రక్షించబడాలన్నారు. భారత రాజ్యాంగం రూపొందించడంలో రాజ్యసభ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ప్రతి సభ్యుడికి ప్రభుత్వ విధానాలను విమర్శించేందుకు హక్కు ఉంటుందని నొక్కి చెప్పారు. అయితే, హక్కుతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని గుర్తు చేశారు. సభలో చైర్మన్ పాత్ర క్రికెట్, హాకీ ఆటల్లో ఎంపైర్ లాగా బాధ్యాతాయుతమైనదని చెప్పుకొచ్చారు.

నిబద్ధత కల్గిన నాయకుడు: ప్రధాని మోడీ

ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ నిబద్ధత కల్గిన నాయకుడని ప్రధాని నరేంద్ర మోడీ అభివర్ణించారు. దిగువ సభ చైర్మన్‌గా సమర్ధవంతంగా వ్యవహరించిన అన్సారీ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ఓ గొప్ప కుటుంబానికి చెందినవారని ప్రధాని పేర్కొన్నారు. ఆయన నాయకత్వాన్ని భవిష్యత్ తరాలు కూడా కోరుకుంటున్నాయన్నారు. దౌత్యవేత్తగా జీవితాన్ని ప్రారంభించిన అన్సారీ ఆయనకంటూ ప్రత్యేక ధోరణి (వ్యానరిజాన్ని) అలవర్చుకున్నారనిపేర్కొన్నారు. తాను చేపట్టిన ఎన్నో విదేశీ పర్యటనల్లో హన్సారీ సలహాలు కేంద్ర ప్రభుత్వానికి ఉపయోగపడ్డాయన్నారు. తాను ప్రధాని అయ్యాక ఎన్నో విషయాల్లో ఆయనను నుంచి నేర్చుకున్నానని మోడీ చెప్పారు. గడచిన పది సంవత్సరాలూ రాజ్యాంగానికి లోబడే హన్సారీ పని చేశారని అభినందించారు. ఆయన మధురమైన జ్ఞాపకాలతో రాజ్యసభను వీడుతున్నారన్నారు. సభ ఔన్నత్యాన్ని పెంపొందించడంలో ఆయనిచ్చిన తోడ్పాటు మరువలేనిదన్నారు. పలు అంశాల్లో కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాలా అన్సారీ సహకరించారని ఈ సందర్భంగా మోడీ పేర్కొన్నారు. అందుకు ఆయనకు మోడీ ధన్యవాదాలు తెలిపారు. అన్సారీ సేవల్ని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కూడా గుర్తు చేసుకున్నారు. తాను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయనతో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందన్నారు. భారత ఉప రాష్ట్రపతిగా రెండు పర్యాయాలు సేవలందించిన హమీద్ అన్సారీ సేవలను మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కొనియాడారు. ఉర్దూ పద్యాన్ని ఉపయోగించి ఆయనను ప్రశంసించారు. రాజ్యసభకు ఆయన సేవలు అభినందనీయమన్నా రు. ఎన్నో సవాళ్ళు పట్టి పీడిస్తున్నప్పటికీ దేశాభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. అన్సారీ తనకు అత్యంత సన్నిహితుడని చెప్పారు.



ప్రశ్నించేందుకు డబ్బడిగిన కేసులో 11 మంది ఎంపీలపై విచారణ

న్యూఢిల్లీ: 2005 నాటి క్యాష్ ఫర్ క్వశ్చన్ కేసు గుర్తుందా? పార్లమెంటులో ప్రశ్నలడగడానికి కొందరు ఎంపీలు డబ్బులు డిమాండ్ చేసారు. అప్పట్లో ఒక వెబ్ పోర్టల్‌కు చెందిన ఇద్దరు విలేకరులు ఎంపీలపై స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. సూక్ష్మ కెమెరాలను దుస్తుల్లో ఉంచుకుని కొందరు ఎంపీలను పార్లమెంటులో తమ సమస్యలపై ప్రశ్నలడగాలని అభ్యర్థించారు. అందుకు ఎంపీలు అలా చేయాలంటే తమకు డబ్బివ్వాలని డిమాండ్ చేసారు. ఈ వ్యవహారాన్నంతా రికార్డు చేసినవిలేకరులు దానిని ప్రచురించారు. దీంతో వారి మీద కేసు దాఖలైంది. తాజాగా ఈ కేసును విచారిస్తున్న స్పెషల్ కోర్టు 11 మంది ఎంపీలపై అవినీతి, నేరపూరిత కుట్ర ఆరోపణలపై విచారణకు ఆదేశించింది. వీరి నేరానికి ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని కోర్టు అభిప్రాయబడింది. ఆ 11 మంది ఎంపీలు.. ఛత్రపాల్ సింగ్ (బీజేపీ), అన్నా సాహెబ్ ఎంకే పాటిల్ (బీజేపీ), మనోజ్ కుమార్ (ఆర్జేడీ), చంద్ర ప్రతాప్ సింగ్ (బీజేపీ), రామ్ సేవక్ సింగ్ (కాంగ్రెస్), నరేంద్ర కుమార్ (బీఎస్పీ), ప్రదీప్ గాంధీ (బీజేపీ), సురేశ్ చందేల్ (బీజేపీ), లాల్ చంద్ర కోల్ (బీఎస్పీ), వైజీ మహాజన్ (బీజేపీ), రాజా రామ్‌పాల్ (బీఎస్పీ). వీరితో పాటు వీరిపై స్టింగ్ ఆపరేషన్ నిర్వహించిన విలేకరులపై కూడా కేసు పెట్టినా ఆ తరువాత వారిపై కేసును హైకోర్టు కొట్టేసింది.

కార్తికి లుకవుట్ నోటీసులపై స్టే



చెన్నై: మాజీ కేంద్ర మంత్రి పి చిదంబరం కుమారుడు కార్తితో పాటు మరి నలుగురిపై సీబీఐ జారీ చేసిన లుకౌట్ నోటీస్‌పై మద్రాస్ హైకోర్టు స్టే విధించింది. కార్తి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ దురైస్వామి సదరు నోటీసులపై మధ్యంతర స్టే విధించారు. తనపై జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని కార్తి కోరగా, వాటిపై కోర్టు మధ్యంతర స్టేను విధించింది. దీంతో కార్తితో పాటు సీబీఎన్ రెడ్డి, రవి విశ్వనాథన్, మోహనన్ రాజేశ్, ఎస్ బాస్కర్ రామన్‌లకు కూడా తాత్కాలిక ఊరట లభించింది. తనపై లుకవుట్ నోటీసులను కేంద్ర ప్రభుత్వం కక్ష పూరిత వైఖరితో జారీ చేస్తోందని కార్తి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తాను సమన్లకు స్పందించినప్పుడు లుకవుట్ నోటీసులెందుకని ప్రశ్నించారు.

అకల్ తఖ్త్ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు

లక్నో: అకల్ తక్త్ ఎక్స్‌ప్రెస్‌లోని టాయిలెట్‌లో ఒక బాంబు బయటపడింది. గురువారం బయల్పడిన ఈ బాంబుతో పాటు లష్కరే తాయిబా మిలిటెంట్ అబు దుజానా మృతికి ప్రతీకారం తీర్చుకుంటామన్న లేఖ కూడా బయటపడిందని జమ్మూ కశ్మీర్ పోలీసులు చెప్పారు. అకల్‌తఖ్త్ ఎక్స్‌ప్రెస్‌లోని బీ3 కోచ్‌లో ఈ బాంబు బయటపడింది. టాయిలెట్‌లో అనుమానాస్పదంగా ఒక ప్యాకెట్ కనబడడంతో ప్రయాణికులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. అర్థరాత్రి 1.14 గంటలకు యూపీలోని అమేథి జిల్లా అక్బర్ గంజ్ స్టేషన్లో రైలును అధికారులు ఆపారు. బీ3 కోచ్‌లో బాంబును కనుగొన్నారు.

బీజేపీ నేత కుమారుడికి పోలీస్ కస్టడీ



చండీగఢ్: హర్యానా బీజేపీ అధ్యక్షుడి కుమారుడు వికాస్ బరాలాను కోర్టు రెండు రోజుల పోలీసు కస్టడీకి పంపింది. గురువారం ఒక ఐఏఎస్ అధికారి కుమార్తె వర్ణిక కుందును వెంబడించి కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారన్న కేసులో ఆయనను పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. వికాస్‌ను రిమాండ్‌కు పంపిన కోర్టు రెండు రోజుల పోలీస్ కస్టడీని కూడా ఇచ్చింది. కోర్టులో హాజరు పరిచే ముందు పోలీసుల విచారణలో తాము వర్ణికను వెంబడించలేదని, వేధించలేదని, వికాస్, సహనిందితుడు ఆశిష్ కుమార్ చెపెఆరు. వర్ణిక ఒక హోటల్‌లో డీజేగా పని చేస్తోంది. తన డ్యూటీ పూర్తయ్యాక ఇంటికి వెళుతుండగా ఆమె కారును వికాస్, ఆశిష్ తో కలిసి వెంబడించారన్నది ఆరోపణ. వర్ణిక కారుకు తమ కారును అడ్డంగా ఆపి, ఆమెను బయటకు లాగడానికి ప్రయత్నించారని ఆమె ఆరోపిస్తోంది. ఈ కేసులో తాము నిర్లిప్తంగా ఉండబోమని, విచారణ పూర్తిగా చేస్తామని చండీగఢ్ పోలీస్ కమిషనర్ తేజేంద్ర లుథ్రా చెప్పారు.

55 ఏళ్ల మహిళపై అత్యాచారం, హత్య

ముజఫ్ఫర్‌నగర్ (యూపీ): ఉత్తరప్రదేశ్‌లో 55 ఏళ్ల మహిళపై అత్యాచారం చేసి హత్య చేసారు. గురువారం ఆమె మృతదేహాన్ని కనుగొన్న పోలీసులు పోస్టుమార్టంకు పంపి విచారణ చేస్తున్నారు. మరో కేసులో 20 ఏళ్ల యువకుడిని బూత్‌కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కాల్చి చంపారు.

చైనా భూకంపంలో 20కి చేరిన మృతుల సంఖ్య

చెంగ్డు (చైనా): చైనాలోని నైరుతి ప్రాంతంలో సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 20కి చేరింది. గురువారం నాటికి దాదాపు 60,000 మందిని తరలించగా, రిక్టర్ స్కేలుపై 6.5 తీవ్రతతో మరోసారి భూకంపం సంభవించింది. భూకంపం సంభవించిన ప్రాంతం పర్యాటక ప్రాముఖ్యం కలిగినది కావడాన, అక్కడి స్థానికులతో పాటు పర్యాటకులను కూడా తరలించాల్సి వస్తోంది. భూకంపం తరువాత గురువారం వరకూ చిన్న చిన్న ప్రకంపనలు 1,000 వరకూ వచ్చాయని అధికారులు తెలిపారు.

లోక్‌సభ ఇలా జరిగింది

పీయూష్‌ను ప్రొఫెసర్ అనాలి: స్పీకర్



న్యూఢిల్లీ: కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను ఇక నుంచి ప్రొఫెసర్ అంటూ సంబోధించాలని లోక్ సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పేర్కొన్నారు. విద్యుత్ రంగంపై అతనికున్న అనుభవం అపారమైనదని ఆమె కొనియాడారు. గురువారం లోక్‌సభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి గోయల్ పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. గ్రామాలను పూర్తిగా విద్యుద్దీకరించడం కోసం బీజేపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన సభకు వివరించారు. గోయల్ ప్రసంగం అద్భుతంగా సాగడంతో సభ్యులంతా ఆసక్తిగా విన్నారు. అనంతరం స్పీకర్ మహాజన్ మాట్లాడుతూ విద్యుత్‌పై ఉన్న అపార జ్ఞానానికి పీయూష్ గోయల్ నుంచి ఇక నుంచి ప్రొఫెసర్ అని సంబోంధించాలని వ్యాఖ్యానించడంతో సభంతా ఘొల్లుమంది.

2022 లోపు అన్ని ఇళ్లకు కరెంట్




దేశంలోని అన్ని ఇండ్లకు 2022 లోపు కరెంట్ సరఫర అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం గడవు విధించుకొని పని చేస్తుందని ఆయన గురువారం లోక్‌సభకు తెలిపారు. పేర్కొన్న సమయం కంటే ముందే పూర్తి చేస్తామని ఆయన హామీనిచ్చారు. రాష్ట్రాల్లోని డిస్కంలు నష్టాల్లో ఉన్నాయని సభకు వివరించారు. అందుకు కొన్ని కీలక కారణాలున్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై తాము అధ్యయనం చేస్తున్నామన్నారు. త్వరలో అన్ని డిస్కములను లాభాల్లోకి తీసుకువస్తామని చెప్పారు. కరెంట్ ఉత్పత్తిని కూ డా పెంచుతామని ప్రకటించారు.

అదనపు నీటి నిల్వల కోసం ఏర్పాట్లు



భవిష్యత్ తరాలకు నీటి నిల్వల కోసం ఏర్పాట్లు చేస్తామని కేంద్ర ప్రభు త్వం వెల్లడించింది. దేశంలో వర్షాలు సకా లం రావడం లేదని కేంద్ర జల వనరులు, నదీ జలాల శాఖ మంత్రి ఉమా భారతి పార్లమెంట్‌లో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రధానమంత్రి కృషి సిచాయ్ యోజన పథకంలో భాగంగా అదనంగా నీటి నిల్వల కోసం ప్రత్యే కంగా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. మెటరలాజిక్ విభాగం సూచన మేరకు తాము చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే కేంద్ర జల వనరుల సంఘం 91 రిజర్వార్లలో నీరు నిల్వ చేస్తుందన్నారు.

క్రీడా వర్సిటీ ఏర్పాటుకు లోక్‌సభలో బిల్లు



దేశంలో క్రీడ లను మరింత ప్రోత్సహించేందు కు క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని కేంద్ర పేర్కొంది. ఈ మేరకు లోకసభలో గురువారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి ఎస్ఎస్ అహ్లూవాలియా క్రీడా బిల్లు ప్రవేశపెట్టారు. ఈ యూనివర్సిటీలో ఇండోర్, అవుట్‌డోర్, అథ్లెటిక్స్ తదితర ఆటలకు సంబంధించిన అంశాలపై బోధన జరుగుతుందని ఆయన పార్లమెంట్‌కు వివరించారు. అయితే, ఇప్పటికే పలు ప్రైవేటు సంస్థలు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న క్రీడలకు శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే.

682 టెక్స్‌టైల్ మిల్స్ మూసివేత



జూన్ నెలఖాకరు వరకు దేశవ్యాప్తంగా 682 టెక్స్‌టైల్ మిల్లులు మూతపడ్డాయని కేంద్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి స్మృతి ఇరానీ పేర్కొన్నారు. అధికంగా తమిళనాడు నుంచి 232 మిల్లులు మూతపడ్డాయన్నారు. గురువారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో 112, హర్యానాలో 42, మహారాష్ట్రలో 135 మిల్లులు మూసివేయబడ్డాయన్నారు. అయితే తమ ప్రభుత్వం టెక్స్‌టైల్ పరిశ్రమను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ ఫండ్ స్కీమ్ (ఏటీయూఎఫ్ఎస్) కింద టెక్స్‌టైల్ మిల్లులకు పన్ను రాయితీలు ఇస్తామన్నారు.

క్రీడలు, సినిమాల్లో మహిళలకు సమాన అవకాశాలివ్వాలి



జాతీయ క్రీడలు, సినిమాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అప్పుడే మహిళలు అన్ని రంగాల్లో ఎటువంటి వివక్ష లేకుండా రాణించగలుగుతారని ఆ పార్టీ ఎంపీ శతాబ్ది రాయ్ అభిప్రాయపడ్డారు. క్రీడాకారుల ప్రతిభపై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్రీడలతో పాటు సినిమాల్లో కూడా మహిళలకు మగవాళ్ళతో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. మహిళా క్రీడాకారులు, సినీ నటులు అద్భుత ప్రతిభ కనబర్చుతున్నప్పటికీ మగవాళ్ళ కంటే ఎక్కువగా ఫేమ్‌ను పొందలేకపోతున్నారన్నారు.

తారలిద్దరూ ఒకేచోట

మురసోలి వేడుకలో కమల్, రజనీ



చెన్నై: రెండు తారలు ఒకో చోట కలిసాయి. తమిళ వెండితెర వేల్పులు రజనీ కాంత్, కమల్ హాసన్ డీఎంకే వేడుకలో ఒకే వేదికపై మెరిసారు. ఆ పార్టీకి సంబంధించిన పత్రిక మురసోలి 75 వ వార్షికోత్సవ సంబరాలకు గురువారం ఇరువురూ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించే వారిలో కమల్ హాసన్ కూడా ఉన్నారు. స్టాలిన్ పక్కన కమల్ కూర్చోగా, మొదటి వరుసలో రజనీ కాంత్ కూర్చున్నారు. వీరిద్దరూ తమిళనాడులో ప్రతిపక్ష పార్టీ డీఎంకే సంబరాలకు హాజరు కావడం రాజకీయ ఊహాగానాలకు తెరలేపింది. ఇద్దరు నటుల వ్యాఖ్యలూ రాజకీయ రంగప్రవేశాన్ని ఇటీవల సూచించిన నేపథ్యంలో వీరి హాజరు ప్రముఖమైంది. తాను రాజకీయాల్లోకి రావడానికి ఆలోచిస్తున్నానని ఇంకా నిర్ణయం తీసుకోలేదని, నిర్ణయం తీసుకుంటే ప్రకటిస్తానని రజనీ జూన్‌లో చెపపారు. యుద్ధానికి సిద్ధం కమ్మని ఆయన తన అభిమానులకు చెప్పడం గమనార్హం. అలాగే కమల్ కూడా తమిళనాడులో పళనిస్వామి ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. అదే సమయంలో డీఎంకే పార్టీ ఆయనకు ఆహ్వానం పంపింది. డబ్బు తీసుకుని తమ బాధ్యతను మరిచిపోయే వారు తనను పన్ను కేసుల్లో ఇరిస్తామని బెదిరిస్తున్నారని కమల్ ట్వీట్ చేసారు కూడా. దీంతో ఆయన డీఎంకే సంబరాలకు హాజరు కావడం ఆయన ఎటువైపున్నారో చెప్పకనే చెప్పింది. కాకుంటే ప్రసంగీకుల జాబితాలో రజనీ లేకపోవడం ఇరువురూ ఒకే పార్టీతో లేరన్న అనుమానాలు తలెత్తేలా చేసింది.

నేడే వెంకయ్య ప్రమాణం

రాజ్యసభ ఛైర్మన్‌గా మూడో తెలుగువాడు




న్యూఢిల్లీ: ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరొందిన భారత్‌కు 13వ ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు గురువారం (ఆగస్టు 11వ తేదీన) ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)లో సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన విద్యార్థి సంఘం నాయకుడు, ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్, జాతీయ అధ్యక్షుడు వంటి ఎన్నో ముఖ్యమైన పదవులను అలంకరించి వాటి ఔన్నత్యాన్ని పెంచారు. ఇటీవల జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో యూపీఏ పక్షాలు, వామపక్షాల మద్దతుతో బరిలోకి దిగిన మహాత్మాగాంధీ మనవడు గోపాలకృష్ణ గాంధీపై 272 ఓట్ల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. అయితే, ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు పలు వేదికల్లో మాట్లాడుతూ... తన కంటే ముందు ఉప రాష్ట్రపతిగా వ్యవహరించిన ప్రముఖులు ఎంతో సమర్ధవంతంగా సేవలందించారని వ్యాఖ్యానించారు. తాను కూడా ఆ మహాభావుల స్ఫూర్తితో మరింత సమర్ధవంతంగా విధులు నిర్వర్తిస్తావని ఆశాభావం వ్యక్తం చేశారు. తన ఎన్నికకు మద్దతు ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా తదితర పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉప రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న వెంకయ్యకి ప్రధాని మోడీ ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు. నాయుడు హయాంలో సభ ప్రజాస్వామ్యయుతంగా మెలగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఆయన పదవి కాలం ప్రజాస్వామ్యవంతంగా కొనసాగి ఫలప్రదం కావాలని ఆకాంక్షించారు. జాతి నిర్మాణంలో ఆయన చర్యలు పెద్ద ఎత్తున ఉపయోగపడాలని అభిప్రాయపడ్డారు. వెంకయ్య నాయుడుతో కలసి పని చేసిన రోజులను ఈ సందర్భంగా మోడీ గుర్తు చేసుకున్నారు. పలు కీలక విషయాలపై తాము కలసి చేయడం తనకెంతో ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు. వెంకయ్య తెలుగు రాష్ట్రాలకు చెందిన నేత కావడంతో ఆయనకు అభినందనల వెల్లువ కొనసాగుంది.

మూడో తెలుగు ఉప రాష్ట్రపతిగా...

భారతీయ జనతా పార్టీలో సీనియర్ నాయకుడిగా పేరొందిన వెంకయ్య నాయుడు మూడో తెలుగు ఉప రాష్ట్రపతిగా పదవిని చేపట్టనున్నారు. దేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగా సేవలందించిన సర్వేపల్లి రాధాకృష్ణ తిరుపతిలోని జన్మించినా, విద్యాభ్యాసాన్ని మాత్రం మద్రాసులో కొనసాగించారు. ఇక స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రసిద్ధిగాంచిన వరహగిరి వెంకటగిరి ఒడిస్సాలో తెలుగు దంపతులకు నాలుగో సంతానంగా పుట్టారు. దీంతో, ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపడుతున్న వెంకయ్య మూడో తెలుగు వ్యక్తి కానున్నారు. అయితే, ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన మొదటి ఇద్దరు నాయకులు రాష్ట్రపతిగా కూడా సేవలందించారు. దీంతో, వెంకయ్య కూడా భవిష్యత్‌లో దేశాధ్యక్ష పదవిని నిర్వహిస్తారని ట్విట్టర్‌లో పలువురు చమత్కరిస్తున్నారు. చూద్దాం.... మరీ.

డయాబెటీస్‌కు శాశ్వత నివారణ!



లండన్: మీరు డయాబెటీస్ బాధితులా? ఆ వ్యాధి నుంచి శాశ్వతంగా ఉపశమనం పొందాలని ఆలోచిస్తున్నారా? అయితే, మీ కోరిక మరికొన్ని రోజుల్లో నెరవేరనుంది. ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న డయాబెటీస్‌కు చరమగీతం పాడేందుకు లండన్ శాస్త్రవేత్తలు తీవ్రంగా దృష్టిసారించారు. ప్రముఖ వైద్యుడు హెల్గెరాడార్ నేతృత్వంలో చేపట్టిన తాజా అధ్యయనంలో ఓ ముందడుగు పడినట్లు ఆయన పేర్కొన్నారు. కొద్ది రోజుల్లో పూర్తి స్థాయి పరిశోధన బహిర్గతం చేస్తామని అధ్యయనకారులు వెల్లడించారు. తమ అధ్యయనంలో భాగంగా చేపట్టిన ప్రయోగాలు సత్ఫలితాలిచ్చినట్లు తెలిపారు. సాధారణంగా షుగర్ వ్యాధిగ్రస్తుల శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి అవడం ఆగిపోతుంది. దాంతో వారు శరీరానికి కృత్రిమంగా ఇన్సులిన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, తాజా అధ్యయనకారులు డయాబెటీస్ పేషెంట్ల శరీరంలో మళ్ళీ ఇన్సులిన్ ఉత్పత్తి అయ్యే విధంగా ఇతరుల రక్త కణాలను ట్రాన్స్‌ప్లాంట్ చేస్తే సరిపోతుందని చెబుతున్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు హెల్త్‌రిపోర్ట్ అనే జర్నల్‌లో ప్రచురితమైనట్లు తెలిపారు.

ఆంధ్రప్రభ
క్రీడాప్రభ
శుక్రవారం 11 ఆగస్టు 2017 | హైదరాబాద్ | 12

ప్రణయ్ @15
ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ: భారత షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో 15వ స్థానానికి చేరుకున్నాడు. బీడబ్ల్యూఎఫ్ తాజా ర్యాంకింగ్స్‌లో అతను రెండు స్థానాలను మెరుగుపరచుకున్నాడు. సౌరభ్ వర్మ కూడా తన ర్యాంకును మెరుగుపరచుకున్నాడు. అతను 32వ స్థానానికి చేరుకున్నాడు. పారుపల్లి కశ్యప్ ఓ స్థానాన్ని మెరుగుపరచుకొని 46వ ర్యాంకుకు చేరుకున్నాడు. కిదాంబి శ్రీకాంత్ ఎనిమిదో స్థానంలోనే కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో పీవీ సింధు, సైనా నెహ్వాల్ 5, 16 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. ఇంతవరకు గాయాలతో సతమతమవుతున్న ప్రణయ్ ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి బయటపడ్డాడు. మళ్లీ ఆటపై దృష్టి పెట్టాడు. ''కెరీర్‌లో అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నానో లేదో తెలియదు. కానీ నాలో సామర్థ్యానికి లోటు లేదు. మరింత మెరుగ్గా ఆడగలను. ఐతే అనేక గాయాల పాలైన నాకు కొన్ని పరిమితులున్నాయి. అందువల్ల కొన్ని ప్రత్యేక శిక్షణ తీసుకోలేను'' అని ప్రణయ్ అన్నాడు.



(సుందర పల్లెకెలె మైదానం)

పల్లెకెలె పిలుస్తోంది

పల్లెకెలె: శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో భారత జట్టు వైట్‌వాష్‌పై కన్నేసింది. ఇప్పటికే రెండు తిరుగులేని విజయాలతో ఊపుమీదున్న కోహ్లిసేనకు మూడో మ్యాచ్‌లోనూ గెలుపు నల్లేరుపై నడకే కావచ్చు. చివరి టెస్టు అందమైన పల్లెకెలె మైదానంలో శనివారం ఆరంభం కానుంది. ఈ మైదానంలో భారత్ ఒక్క టెస్టైనా ఆడలేదు. 2012లో ఓ వన్డే, ఓ టీ20 మాత్రం ఆడింది. పల్లెకెలె మైదానాన్ని హబన్‌టోట స్టేడియంతో పాటు 2011 ఐసీసీ ప్రపంచ కప్ కోసం నిర్మించారు. ఈ మైదానంలో 35 వేల మంది వీక్షించవచ్చు. 2010లో పల్లెకెలె తొలిసారి లంక-విండీస్ టెస్టుకు ఆతిథ్యమిచ్చింది. పెద్దగా పరిచయం లేని మైదానంలో బుధవారం భారత జట్టు పూర్తి స్థాయిలో ప్రాక్టీసు చేసింది. లంకను వారిగడ్డపై 3-0తో వైట్‌వాష్ చేసే సువర్ణావకాశాన్ని జారవిడుచుకోవడానికి భారత ఆటగాళ్లు సిద్ధంగా లేరు. నేపథ్యంలో పచ్చటి కొండలతో అలరారుతున్న పల్లెకెలె మైదానం కాండీ నుంచి అరగంట ప్రయాణ దూరంలో ఉంది. ప్రస్తుతం లంకలోని మైదానాలన్నింటి కంటే ఇది సుందరమైంది. ప్రాక్టీసు కోసం ఔట్‌డోర్‌లో అద్భుతమైన సౌకర్యాలున్నాయి. సౌరభ్ గంగూలీ సారథ్యంలో భారత జట్టు చివరి సారిగా 2001లో కాండీలో టెస్టు మ్యాచ్ ఆడింది. ఆ టెస్టులో గంగూలీ అజేయంగా 98 పరుగులు చేశాడు. ఫలితంగా నాలుగో ఇన్నింగ్స్‌లో 264 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది.



కోహ్లి ఫిట్‌నెస్ మంత్ర

ఫిట్‌నెస్ కోసం విరాట్ కోహ్లి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. నెట్స్‌లో బ్యాటింగ్ తర్వాత స్లిప్ క్యాచింగ్ ప్రాక్టీసు చేశాడు. సిరీస్‌లో రెండు సార్లు స్లిప్‌లో క్యాచ్‌లు విడిచిపెట్టడంతో విరాట్ ఈ ప్రాక్టీసును ముమ్మరంగా చేశాడు. కండిషనింగ్ ట్రెయినర్‌ను కూడా మైదానంలోకి రప్పించాడు. తక్కిన ఆటగాళ్లు అప్పటికే డ్రెస్సింగ్ రూమ్‌లోకి చేరుకున్నప్పటికీ కోహ్లి తన ప్రాక్టీసును లంక ఆటగాళ్లు వచ్చేవరకు కొనసాగించాడు.

నలుపు నేరమా?

నల్లగా ఉంటే నేరమా? ప్రతిభను నిర్ణయించేది రంగా? వర్ణ వివక్ష వేల సంవత్సరాల నుంచి మానవ సమాజంలో పాతుకుపోయిన జాడ్యం. ఆ జాడ్యం క్రీడల్లోనూ లేకపోలేదు. వర్ణ వివక్ష వల్ల ఎంతో మంది అథ్లెట్లు తీవ్రంగా నష్టపోయారు. మన దేశంలో కూడా ఈ మహమ్మారి వెర్రితలలు వేసింది. ఈ జాడ్యంపై ఎందరో పోరాటం చేశారు.. చేస్తున్నారు. తాజాగా వర్ణవివక్షపై భారత జట్టు ఓపెనర్ అభినవ్ ముకుంద్ తీవ్రంగా ధ్వజమెత్తాడు. తన రంగును ఎత్తిచూపి తనను ఎంతగానో అవమానాల పాలు చేశారంటూ ఆవేదన వ్యక్తంచేశాడు. కేవలం తెల్లగా, అందంగా ఉంటేనే గొప్పనుకోవడం న్యాయం కాదంటూ ట్విటర్లో పోస్ట్ చేశాడు. ముకుంద్ ఏమన్నాడంటే...



...''నేను పదో ఏట నుంచి క్రికెట్ ఆడుతున్నాను. ఒక్కో మెట్టు ఎక్కుతు ఈ స్థాయికి వచ్చాను. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గొప్ప గౌరవం. నేనీరోజు సానుభూతి కోసమో, అందరి దృష్టి నా వైపు మళ్లించాలనో ట్వీట్ చేయడం లేదు. నేను తీవ్రంగా పరిగణించే విషయంలో ప్రజల దృక్పథం మారాలన్న కోరికతో మాత్రమే ట్వీట్ చేస్తున్నాను'' అన్నాడు.

తాను టీనేజ్‌లో ఉన్నపుడు తన రంగుపై కొందరు చేసిన వ్యాఖ్యల గురించి మాట్లాడుతూ.. ''15వ ఏట నుంచి నేను దేశ, విదేశాలలో ఎంతో తిరిగాను. నాటినుంచి ప్రజలు నా రంగు గురించి గుసగుసలాడుకునేవారు. అలా ఎందుకు జరిగేదో నాకు అంతుబట్టేది కాదు. నేను ఎక్కువగా ఎండలో, తీక్షణమైన సూర్యుని కింద శిక్షణ పొందేవాడిని. నేను అధికంగా ప్రేమించే క్రికెట్‌ను ప్రాక్టీసు చేస్తున్నాను కాబట్టి నాకు బాధ అనిపించేది కాదు. ఔట్‌డోర్‌లో గంటల కొద్దీ సమయాన్ని వెచ్చించాను కాబట్టే నేను ఎంతో కొంత సాధించగలిగాను. నేను దేశంలోనే వేడిగా ఉండే చెన్నై వాసిని. క్రికెట్ మైదానంలో ఎక్కువ సమయాన్ని గడపటం నాకు ఎంతో సంతోషానిచ్చేది'' అన్నాడు. తనను ఎన్నో పేర్లతో పిలిచి ఎగతాళి చేసేవారని ముకుంద్ ఆక్రోశం వెలిబుచ్చాడు. ''నేను వాటిని పట్టించుకునే వాడిని కాను. నా లక్ష్యాలు వేరు. ఈ ఎగతాళే నాలో మరింత పట్టుదల పెంచింది. ప్రజల గేలికి నేను ఏనాడూ కుంగిపోలేదు'' అన్నాడు. వర్ణవివక్షకు గురైతున్న అనేకమంది కోసం తాను నోరు విప్పానని చెప్పాడు. ఐతే సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఈ వర్ణ వివక్ష జాడ్యం మరింత పెరిగిందని ఆందోళన వ్యక్తంచేశాడు.

''సోషల్ మీడియా బలపడుతున్న కొద్దీ ఈ జాడ్యం మరింత వెర్రి తలలు వేస్తోంది. విచ్చల విడిగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తెల్లగా అందంగా ఉన్నవారే మనుషులనుకోవడం న్యాయం కాదు. మనకున్న రంగునే ఇష్టపడి, లక్ష్యంపై దృష్టి సారించాలి'' అని ముకుంద్ ట్వీట్ ముగించాడు. ఈ ట్వీట్‌కు ప్రతిస్పందనగా వచ్చిన ట్వీట్‌లకు సైతం ముకుంద్ సమాధానమిచ్చాడు. జట్టులోని ఎవరినీ ఉద్దేశించి తానా ట్వీట్ చేయలేదని.. తనకు వచ్చిన వాటికి సమాధానంగానే చేశానని వివరించాడు. తన ట్వీట్‌ను రాజకీయం చేయొద్దని, మార్పు తీసుకురావాలన్న ఉద్దేశంతోనే తానలా చేశానని కూడా ముకుంద్ చెప్పాడు. కాగా ముకుంద్ జట్టు సహచరులు మద్దతు తెలిపారు.



ఏడో రౌండ్లో ఆనంద్ గెలుపు

సెయింట్ లూయిస్ (యుఎస్ఏ): సింక్వీఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో మాజీ ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ ఏడో రౌండ్లో గెలిచాడు. ఆనంద్ ఈ రౌండ్లో రష్యాకు చెందిన ఇయన్ నిపోమ్నియాషిచిపై విజయం సాధించి సంయుక్తంగా అగ్ర స్థానంలో నిలిచాడు. ఆనంద్‌కిది వరుసగా రెండో గెలుపు. ఏడు రౌండ్లు ముగిసిన తర్వాత ఆనంద్ ఖాతాలో 4.5 పాయింట్లు చేరాయి. టోర్నీలో మరో రెండు రౌండ్లు మిగిలివున్నాయి.

అశ్విన్, జడేజాలకు విశ్రాంతి?

- లంకతో పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌కు దూరం





కాండీ: లంకతో టెస్టు సిరీస్‌లో విపరీతమైన బౌలింగ్ భారాన్ని మోసి అలసిన స్పిన్నర్లు అశ్విన్, జడేజాలకు పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల నుంచి విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. స్పిన్నర్ల అలసటను దృష్టిలో ఉంచుకొని చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ నేతృత్వంలోని కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకోవచ్చు. ఈ సిరీస్ 20 నుంచి ఆరంభమవుతుంది. జడేజా, అశ్విన్ సిరీస్‌లో ఇంతవరకు వరుసగా 108.2, 108.3 ఓవర్లు బౌలింగ్ చేశారు. జడేజా 13 వికెట్లు తీసుకోగా, అశ్విన్ 11 వికెట్లు దక్కించుకున్నారు. ఐసీసీ సస్పెన్షన్ వల్ల జడేజా మూడో టెస్టుకు దూరం కావడంతో భారమంతా అశ్విన్‌పై పడవచ్చు. దీంతో అతను టెస్టు సిరీస్ ముగిసే సరికి 150కి పైగా ఓవర్లు బౌలింగ్ చేయాల్సిరావచ్చు. జడేజా స్థానం కోసం యజువేంద్ర చచల్, అక్షర్ పటేల్, క్రునాల్ పాండ్య మధ్య పోటీ ఉండే అవకాశం ఉంది. పరిమిత ఓవర్ల సిరీస్‌కు మాత్రం యార్కర్ నిపుణుడు బుమ్రాకు చోటు ఖాయం. ప్రస్తుతం కాండీలో ఉన్న ప్రసాద్ జట్టు ప్రదర్శనను పరిశీలిస్తున్నాడు. అతని సహచరుడు దేవాంగ్ గాంధీ దక్షిణాఫ్రికాలో భారత్ ఏ జట్టుతో పాటు ఉన్నాడు. వారిద్దరు కాన్ఫరెన్స్ కాల్ ద్వారా మూడో సభ్యుడు శరణ్‌దీప్ సింగ్‌తో సంప్రదింపులు జరుపుతూ ఈనెల 13న పరిమిత ఓవర్ల సిరీస్‌కు జట్టును ఎంపిక చేసే పనిలో ఉన్నారు.



మహిళల ప్రపంచకప్ ఫైనల్ వీక్షకులు 15.6 కోట్లు

దుబాయ్: ఐసీసీ మహిళల ప్రపంచకప్ ఫైనల్లో మిథాలీరాజ్‌సేన ఓడినప్పటికీ టోర్నీని భారత్‌లో రికార్డు స్థాయిలో 15.6 కోట్ల మంది వీక్షించారు. వీరిలో 8 కోట్ల మంది గ్రామీణ ప్రాంతానికి చెందినవారే. ఫైనల్‌ను ఏకంగా 12.6 కోట్ల మంది చూశారు. ప్రపంచం మొత్తంమీద 18 కోట్లమంది ఈ టోర్నీని వీక్షించారని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. భారత జట్టు అద్భుత ప్రదర్శన వల్ల దేశంలో వీక్షణ గంటల సంఖ్య 500 శాతం పెరిగిందని చెప్పింది.

రాణించిన హిమాంశు

- రెండో వన్డేలో భారత్ గెలుపు
- ఇంగ్లాండ్‌తో యూత్ టోర్నీ



హిమాంశు (74)

లండన్: ఓపెనర్ హిమాంశు రాణా (74, 85 బంతుల్లో, 9 ఫోర్లు) అర్ధసెంచరీ చేయడంతో యూత్ టోర్నీ రెండో మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లాండ్ అండర్ 19 జట్టు బౌలర్లు రాయ్ (4/27), చచర్ (3/26) ధాటికి 44.4 ఓవర్లలోనే 175 పరుగులకు ఆలౌటైంది. ట్రెవాస్కిస్ (35) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం భారత్ 33.2 ఓవర్లలోనే 2 వికెట్లకు 177 పరుగులు చేసి గెలిచింది. పీపీ షా (48, 51 బంతుల్లో, 7 ఫోర్లు) కూడా రాణించాడు. గిల్(38), అభిషేక్(0) నాటౌట్‌గా మిగిలారు. హిమాంశుకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

జైపూర్ పింక్ పాంథర్స్, తమిళ తలైవాస్ తొలి గెలుపు



నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ లీగ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్, తమిళ తలైవాస్ తొలి విజయాల్ని నమోదు చేశాయి. రెండో దశలో జరిగిన ఈ రెండు చివరి లీగ్ మ్యాచ్‌లలో జైపూర్.. పునేరీ పల్టాన్‌తో హోరాహోరీగా పోరాడి 30-28 స్వల్ప తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో తమిళ తలైవాస్ 29-24తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. పునేరీకిది మొదటి ఓటమి. గ్రూప్ ఏ పోరులో పింక్ పాంథర్స్‌కు పునేరీ నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనా జైపూర్ అద్భుత ప్రదర్శనతో గెలుపును సొంతం చేసుకుంది. మంజీత్ ఛిల్లర్ 9 పాయింట్లు స్కోరు చేశాడు. పోరు తొలి నిమిషంలోనే రెండు జట్లు పాయింట్ల ఖాతాను తెరిచాయి. తుషార్ పాటిల్, దీపక్ హోండా కూతకు వెళ్లి పాయింట్లతో తిరిగి వచ్చారు. తమ డిఫెన్స్ తొలి టేకిల్ పాయింట్ సాధించడంతో పునేరీ మూడో నిమిషానికల్లా 3-1తో ఆధిక్యంలో నిలిచింది. పునేరీ ఐదో నిమిషానికి 5-2 ఆధిక్యం సాదించింది. తుషార్ పాటిల్ జైపూర్‌కు రెండో పాయింట్ తెచ్చాడు. తొలి అర్ధం ముగిసేసరికి జైపూర్ 14-11 ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్థంలో రెండు జట్లు హోరాహోరీగా పోరాడినా జైపూర్ ఓ దశలో ఆధిక్యాన్ని 20-11కు పెంచుకుంది. ఐతే తర్వాత పునేరీ కూడా వరుస పాయింట్లు సాధించి కోలుకుంది. చివరకు స్వల్ప ఆధిక్యంతో జైపూర్ గెలిచింది. ఈ మ్యాచ్‌లతో లీగ్ రెండో దశ ముగిసింది. శుక్రవారం నుంచి అహ్మదాబాద్‌లో లీగ్ మూడో దశ ఆరంభమవుతుంది.

బెల్జియంతో చేతిలో భారత్ ఓటమి

ఓటమితో ఐరోపా పర్యటనను ఆరంభించిన భారత్ హాకీ జట్టు

న్యూఢిల్లీ: ఐరోపా పర్యటనను భారత హాకీ జట్టు ఓటమితో ఆరంభించింది. బుధవారం భారత్ 0-1తో బెల్జియం చేతిలో ఓడింది. ఆరుగురు కొత్త వాళ్లతో నిండిన యువ జట్టు హోరాహోరీగా పోరాడింది. కెప్టెన్ పీఆర్ శ్రీజేష్ లేకపోవడం కూడా జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపింది. అతని గైర్హాజరీలో మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు సారథ్యం వహించాడు. బెల్జియం ఆటగాడు 60వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. తర్వాత రెండు జట్లు గోల్ చేయలేకపోయాయి.



బెల్జియంతోనే గురువారం జరిగే తదుపరి పోరులో గెలుపుపై భారత్ ఆశలు పెట్టుకుంది. ఐరోపా పర్యటనలో 5 మ్యాచ్‌లాడే భారత జట్టు తర్వాత నెదర్లాండ్స్, ఆస్ట్రియాలతో తలపడుతుంది.

ఫెదరర్, నాదల్ సునాయాస విజయాలు

రోజర్స్ కప్ టెన్నిస్





మాంట్రియల్: టాప్ సీడ్ రఫెల్ నాదల్, ప్రపంచ నెంబర్ 2 రోజర్ ఫెదరర్.. రోజర్స్ కప్ వేటను ఘనంగా ఆరంభించారు. బుధవారం తొలి రౌండ్లో నాదల్ క్రొయేషియా ఆటగాడు బొర్నా కొరిక్‌ను 6-1, 6-2తో మట్టికరిపించాడు. రోజర్స్ కప్‌ను మూడు సార్లు గెలుచుకున్న నాదల్ తర్వాతి రౌండ్లో కెనడా టీనేజర్ డెనిస్ షపోవలోవ్‌తో తలపడతాడు. ఫెదరర్ 6-2, 6-1తో పీటర్ పొలాన్‌స్కీని ఓడించాడు. ఎనిమిదో వింబుల్డన్ టైటిల్ గెలిచిన తర్వాత ఫెదరర్ బరిలోకి దిగడం ఇదే తొలిసారి.

ఒకే ఒక్కడు



లండన్: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పురుషుల 200 మీటర్ల పరుగు సెమీఫైనల్లో చిత్రమైన పరిస్థితి ఏర్పడింది. బుధవారం బోట్స్‌వానా అథ్లెట్ ఇసాక్ మక్వాల ఒక్కడే సెమీస్ పోటీలో నిలిచాడు. క్వాలిఫికేషన్ సమయం 20.53 సెకన్లు కాగా ఇసాక్ 20.20 సెకన్లలోనే గమ్యాన్ని చేరుకుని ఫైనల్ అర్హత సాధించాడు. వైద్య కారణాల రీత్యా అంతకుముందు ఇసాక్‌ను కూడా నిర్వాహకులు బహిష్కరించారు. దీంతో అతను మంగళవారం 400 మీటర్ల ఫైనల్‌తో పాటు సోమవారం 200 మీటర్ల హీట్స్‌లోనూ పోటీ పడలేకపోయాడు. వైద్య కారణాలతో తక్కిన అథ్లెట్లను కూడా బహిష్కరించడంతో బరిలో ఇసాక్ ఒక్కడే నిలిచాడు. వైద్య పరీక్షల అనంతరం అతణ్ని ట్రాక్‌లోకి అనుమతించారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



న్యూ టచ్... హ్యూమన్ లైబ్రరీ

ఆ లైబ్రరీలో... మనుషులే పుస్తకాలు!

ఒక పుస్తకాన్ని చదివితే ఒక మనిషిని చదివినట్టే. మరి మనిషిని చదివితే పుస్తకాన్ని చదివినట్టే అవుతుంది కదా... ఒక మనిషి తన అంతరంగాన్ని నిజాయితీగా వెల్లడిస్తే...అది నిజంగా గొప్ప పుస్తకమవుతుంది. ఎందుకంటే జీవితం కంటే గొప్ప గ్రంథం ఏముంటుంది...సరే ఈ భారమైన ఉపోద్ఘాతమంతా ఎందుకంటే.. పుస్తకాలకు బదులుగా మనుషులు ఉండి... తమ కథలను వినిపించే లైబ్రరీలు వచ్చేస్తున్నాయి. ఇప్పుడు దేశవ్యాప్తంగా కొన్ని నగరాల్లో ఇలాంటివి కనబడుతున్నాయి. మన హైదరాబాద్‌లోనూ ఇలాంటి లైబ్రరీ ఉంది. ఈ లైబ్రరీకి వెళితే కళ్లకు బదులు చెవులు పనిచేయాలన్నమాట....అలాగే హృదయం కూడా. చదవటం ద్వారా పొందే అనుభూతిని సంస్కారాన్ని విషయపరిజ్ఞానాన్ని...ఇంకా ఒక పుస్తకం ద్వారా ఏమేమి పొందగలమో వాటన్నింటినీ మనిషే... తన కథతో కథనంతో వినిపిస్తాడు...లేదా వినిపిస్తుంది. బాగుంది కదూ... ఈ-బుక్స్, ఆడియో బుక్స్ తరువాత ఇలా...మనం... సంభాషించడానికి వీలున్న పుస్తకాలు సైతం అందుబాటులోకి రావటం ఒక వినూత్న పరిణామం. మానవ లైబ్రరీలను గురించి కొన్ని విషయాలు మీకోసం-

★హృదయంతో చదవాల్సిన వాస్తవ జీవిత గాథలు

★మనుషుల మధ్య అడ్డుగోడలు కూల్చే లైబ్రరీలు

లైబ్రరీకి వెళితే ఒక పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని మనకు నచ్చిన చోట కూర్చుని అందులో లీనమై పోతాం. అలాగే హ్యూమన్ లైబ్రరీకి వెళితే...అక్కడ కథలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నవారిలో ఎవరినో ఒకరిని ఎంపిక చేసుకుని వారు చెప్పే స్వీయకథలను వినవచ్చు. కానీ మానవ పుస్తకాన్ని చదవాలనుకునేవారికి గడుపు మాత్రం ఇరవై నిముషాలే ఉంటుంది. పుస్తకాల్లో భిన్నరకాలు ఉన్నట్టుగా...ఇక్కడ ఉండే మనుషులు సైతం విభిన్న కథలను వినిపిస్తారు. అయితే పుస్తకంలో లేని సౌలభ్యం ఒకటుంది. కథ చెబుతున్న వ్యక్తిని మరింత లోతుగా ప్రశ్నలు వేస్తూ.....ఆ వ్యక్తి చెబుతున్న కథనంలో సందేహాలు ఉంటే తీర్చుకునే వీలుంటుంది. ఏదో ఒక సందర్భంలో కథలు చెప్పడమూ, కథలు వినడమూ మన జీవితాల్లో జరుగుతుంటుంది. కానీ ప్రత్యేకంగా వ్యక్తులు లైబ్రరీలో ఉండి తమ కథలను వినిపించడం, సందేహాలుంటే తీర్చడం...ఇవన్నీ మాత్రం నిజంగా కొత్తరకం అనుభూతులు.



కోపెన్‌హెగెన్‌లో మొదలైంది....

2000వ సంవత్సరంలో డెన్మార్క్ రాజధాని కోపెన్‌హెగెన్‌లో రోనీ అబెర్గల్ అనే వ్యక్తి ఊహల్లోంచి హ్యూమన్ లైబ్రరీ సృష్టి జరిగింది. ఇప్పటివరకు 70పైగా దేశాల్లో ఇలాంటి హ్యూమన్ లైబ్రరీలు ఉన్నాయి. మనదేశంలో గత ఏడాది ఇండోర్‌లో తొలుత దీన్ని ప్రారంభించారు. ఆ తరువాత హైదరాబాద్, బాంబే, ఢిల్లీలలో మొదలుపెట్టారు. దీని ప్రారంభం వెనుక ఒక లక్ష్యం ఉంది. సమాజంలో మాట్లాడని గొంతులను, వారి గాథల్లో సమాజం వినని భిన్న కోణాలను... సూటిగా ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో వెల్లడించే అవకాశాన్ని కల్పించడం...అలాంటి కథనాలు జనంలోకి వెళ్లటం... హ్యూమన్ లైబ్రరీ స్థాపనలో ఉన్న ఉద్దేశ్యం. హ్యూమన్ లైబ్రరీలో రచయిత, పాఠకుడు ఎదురెదురుగా ఉంటారు కనుక ఒక్కోసారి చాలా సంక్లిష్టమైన ప్రశ్నలు ఎదురుకావచ్చు. వాటికి సమాధానాలూ దొరుకుతాయి. మానవ పుస్తకాన్ని మనం ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లే అవకాశమైతే ఉండదు కానీ...ఎలాంటి ప్రశ్నలనైనా సంధించే అవకాశం మాత్రం ఉంటుంది. లైబ్రరీలో ఎలాగైతే మనకు నచ్చినపుస్తకాన్ని తీసుకుని చదువుకుంటామో.... ఇందులో కూడా మనకు నచ్చిన మానవ పుస్తకాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఒక్కొక్కరుగా కానీ ఇద్దరు లేక గుంపుగా కానీ...మానవ పుస్తకాలు చెప్పే కథలు వినవచ్చు.

మానవపుస్తకంతో రీడర్ మానసిక దృక్పథం మారిపో తుంది

హైదరాబాద్‌లో హ్యూమన్ లైబ్రరీని హర్షద్ దిన్‌కర్ ఫాద్ ప్రారంభించాడు. అతను అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ విద్యార్థి. అతనికి సినిమా, నాటకాలు, మీడియా లాంటి విషయాల పట్ల ఆసక్తి ఎక్కువ. జనంతో కలిసి మమేకమై చేసే పనులంటే హర్షద్‌కి చాలాఇష్టం. సమాజానికి ఏదో ఒక రూపంలో సేవలు అందించాలనే తపన ఉన్న యువకుడు. అందుకే ఇంటర్నెట్‌లో మానవ లైబ్రరీ గురించి చదివినప్పుడు అబ్బురపడ్డాడు. ఆ కాన్సెప్ట్ విపరీతంగా నచ్చేసిందతనికి. దాంతో హ్యూమన్ లైబ్రరీ స్థాపనకు ప్రయత్నించి విజయం సాధించాడు. పుస్తకాలుగా తమ కథలను చెప్పేవారు ...పుస్తకాల్లా ఒకే చోట ఉండరు కాబట్టి... వారందరినీ ఒక చోట చేర్చి హ్యూమన్ లైబ్రరీని ఒక ఈవెంట్‌లా నిర్వహిస్తున్నాడు.



మనుషుల మధ్య తేడాలు ఉంటాయని, మనుషులను వారి కోణంలోంచి ఆలోచించి అర్థం చేసుకోవాలనే లక్ష్యం ఈ లైబ్రరీ వెనుక ఉందని, మాట్లాడుకుంటే...మాటలు వింటే మనలో ఉన్న ఎన్నో భయాలు అపోహలు తొలగిపోతాయని హర్షద్ అంటాడు. చెప్పడానికి ఒక కథ ఉన్నవారు ఎవరైనా ఇక్కడ లివింగ్ బుక్‌గా మారవచ్చని అతను తెలిపాడు. సమాజంలో మతాలు, ఆచారాలు, జీవన విధానాలు, నమ్మకాల్లో ఉన్న తేడాల వలన ఇతరుల నుండి వివక్ష, విద్వేషం, హింసలను ఎదుర్కొన్నవారు తమ కథలను వినిపించవచ్చు. ఆ కథలను విన్నవారిలో మానసిక దృక్పథమే మారిపోతుందని, సమాజంలో ఉన్న అనేక అసమానతలను వారు అర్థం చేసుకుంటారని హర్షద్ చెబుతున్నాడు. తమలాంటి బాధితులు చాలామంది ఉంటారనే అవగాహన రీడర్స్‌కి కలుగుతోందని..మొత్తానికి వారు మానవ పుస్తకాన్ని చదివాక...ఒక పాజిటివ్ దృక్పథంతో అక్కడినుండి వెళుతున్నారని, అవసరమైతే...తమకు కథ చెప్పిన వ్యక్తికి అందుబాటులో ఉండి సహాయం చేస్తామని చెబుతున్నారని..అంతేకానీ...హేళన చులకన లాంటి భావాలను ఎవరూ వ్యక్తం చేయలేదని హర్షద్ తెలిపాడు.

పెరుగుతున్న ఆదరణ

హైదరాబాద్‌లో మొదటి హ్యూమన్ లైబ్రరీని ఫోనెక్స్ ఎరీనాలో నిర్వహించారు. 10మంది మానవ పుస్తకాలుగా పాల్గొన్నారు. బ్రిటిష్ కౌన్సిల్‌లో రెండో ఈవెంట్ నిర్వహించినప్పుడు ఈ సంఖ్య 20కి పెరిగింది. అలాగే మొదటి ఈవెంట్‌కి 60మంది రీడర్స్ వస్తే...రెండో ఈవెంట్‌కి 100మంది వచ్చారు. బెంగళూరు, ముంబయి, కోల్‌కతా, చెన్నై, గుజరాత్‌లలో కూడా ఇలాంటి లైబ్రరీలు ప్రారంభించే ఉద్దేశంలో ఉన్నాడు హర్షద్. ఢిల్లీలో ఉన్న హ్యూమన్ లైబ్రరీలో 11 విభాగాలకు చెందిన మానవ పుస్తకాలు లభ్యమవుతున్నా(రు)యి. ఇందులో డ్రగ్స్ వ్యసనం నుండి బయటపడిన వ్యక్తి, బుద్ధిజం అనుసరించే వ్యక్తి, రచయితగా మారిన టీ వ్యాపారి, ఓ ఒంటరి మహిళా ప్రయాణికురాలు, క్యాన్సర్‌ని జయించిన వ్యక్తి..ఇలా పలురకాల వ్యక్తులు.... తమ కథలను ఇతరులతో పంచుకునేందుకు ఈ లైబ్రరీలో ఉన్నారు. అలాగే ముంబయిలో మే నెలలో ఒక మానవ లైబ్రరీని నిర్వహించారు. దీనిని నిర్వహించిన యాండలీన్ ఖురేషి...ప్రతినెలా కొత్త పుస్తకాలను చేరుస్తూ ఉంటామని అంటున్నారు. ప్రతిచోటా మానవ లైబ్రరీలకు ఆదరణ పెరుగుతున్నది. ముఖ్యంగా యువత, కాలేజి విద్యార్థులు మరింత ఆసక్తిని చూపుతున్నారు. రాబోయే రోజుల్లో హ్యూమన్ లైబ్రరీలు మరింత విస్తృతంగా కనిపించే అవకాశం ఉంది.

✍ వి.దుర్గాంబ




దుపట్టే ఆభరణం!

పెళ్లిళ్లు ఫంక్షన్లలో రిచ్‌లుక్‌తో మెరవాలంటే..నేటికీ పట్టుని మించినది లేదు. అయితే పట్టుచీరని కట్టటం, దాన్ని ఫంక్షన్ జరుగుతున్నంత సేపు ధరించి ఉండటం... కాస్త శ్రమతో కూడుకున్న విషయమే. పైగా చీరలు అలవాటు లేనివారికి మరింత కష్టంగా అనిపిస్తుంది. అలాంటివారు పట్టుని కట్టకుండానే ఒంటినిండా పట్టుమెరుపుతో మెరిసిపోయే అవకాశంఉంది. ఎలాగంటారా... లెహంగా జాకెట్, పంజాబీ డ్రస్, లాంగ్ ఫ్రాక్...ఇలా ఏ దుస్తులు ధరించినా...పట్టు దుపట్టాని పైన ధరిస్తే చాలు..ఆ డ్రస్‌కే ఒక గ్రాండ్ లుక్ వచ్చేస్తుంది. అయితే వీటి ధర మాత్రం కాస్త ఎక్కువే. వెయ్యి, పదిహేను వందల నుండి ఏడెనిమిదివేల వరకు ఉంటున్నాయి. రెండుంపావు నుండి రెండు ముప్పావు మీటర్ల పొడవులో లభిస్తున్నాయి. అత్యంత పొడవుగా ఉండటం వలన వీటిని ఎన్ని రకాలుగా అయినా ధరించే వీలుంది. వెనుక పైట చెంగులా జీరాడుతున్నా...చేతులపై వేసుకున్నా, తలపై మేలిముసుగులా ధరించినా...అందాన్ని హుందాతనాన్ని తెచ్చే దుపట్టా...ఒక పెట్టని ఆభరణంలా కనబడుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

చింతన

ఉత్తర దిశగా తలపెట్టి ఎందుకు పడుకోరాదు?

మనం ఉత్తర దిశగా తలపెడితే మన పాదాలు దక్షిణం వైపు ఉంటాయి. అప్పుడు శ్రీరంగం, కంచి, తిరుపతి, కాళహస్తి, శ్రీశైలం వైపుకు మన పాదాలు



ఉంటాయి. ఉత్తర దిక్కునకు అధిపతి కుబేరుడు. అతను ధనాధిపతి. కావున ఉత్తర




దిశగా తలపెట్టి నిదురించేవారి బుద్ధిలో ధనమే మెదిలితే ఆ తలను తానే (భగవంతుడు) తీసుకుంటాడని శాస్త్రం. అందుకే ఉత్తరం వైపు తలపెట్టిన ఏనుగు తలను శంకరుడు తీసుకున్నాడు.

- డా॥ కందాడై రామానుజాచార్య

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అణో రణీయాన్, మహతో మహీయాన్



శ్రీ రమణాశ్రమం
22-7-46

ఈ ఉదయం పదిన్నర గంటలకు పట్నం నుండి శౌంఠి రామమూర్తిగారు, వారి భార్య, సోదరుడు, మరికొందరు స్నేహితులతో వచ్చారిక్కడికి. వారు వచ్చేసరికి ఒక భక్తుడు ఏదో గ్రంథం చదువుతూ భగవంతులనిట్లా ప్రశ్నించాడు. ''ఈ పుస్తకంలో 'అన్నము మనము తింటాము. అన్నము మనలను తింటుంది' అని వ్రాశారే. అదెట్లా? మనము అన్నము తింటాము సరే, అన్నము మనలను తింటుందంటే యేమిటి?'' అని అడగటం, భగవాన్ మౌనం వహించటం జరుగుతున్నది. రామమూర్తిగారిదంతా గమనిస్తూ కూర్చున్నారు.

పదినిమిషాలు పలుకకుండా వుండి తమ సోదరుడు భగవద్దర్శనాభిలాషి కావటమే తమ ఈ రాకకు కారణమనీ, పదేళ్ల క్రిందట ఒకసారి దర్శించితిననీ చెప్పి అంతకు ముందే అక్కడి భక్తులడిగిన ప్రశ్నను పురస్కరించుకొని ఇట్లా మనవి చేశారు రామమూర్తిగారు.

''అన్నము వల్లనే (భోగ్యపదార్థముల సహాయము వల్లనే) సర్వభూతములు ఉత్పత్తి స్థితి లయాదులను చెందుచుండుట వలన అన్నమే బ్రహ్మమంటారు. ఆ బ్రహ్మమే అంతటా ఆవరించి వుంటుంది. అన్ని వస్తువులు దాని ప్రతిబింబం కావటం వల్ల, అన్నమని దానికే అనగా ఆ బ్రహ్మమునకే పేరుగాబట్టి ఆ అన్నం మనలను తింటుంది అని గదా అర్థం. ఇప్పుడు వీరడిగిన ప్రశ్నకిదే గదా జవాబు'' అని వారంటే ''అవు''నన్నారు భగవాన్.

ఇంకా వారు సైన్సును బట్టి ఇంగ్లీషులోనే మాట్లాడారు. వారి తమ్ముడున్నూ కొంచెం సేపు ఆటంబాంబును గురించీ, ఇంకా ఏమేమో సైన్సు, సైన్సంటూ ఇంగ్లీషులోనే మాట్లాడారు. నాకేమో, ఇంగ్లీషు రాదాయె. భగవాన్ మాత్రం తెలుగులోనే ప్రత్యుత్తరం చెప్పటం వల్ల తెలిసిందేదో వ్రాస్తున్నాను. సైన్సు ప్రకారం వారు చెప్పినదంతా వినివిని ''అవునండీ, ఇదేదైనా తన్ను విడిచి లేదు గదా? తానున్న వెనుక అన్నీ వున్నవి. తాను లేనని ఎవరూ చెప్పరు. దేవుడు లేడనే నాస్తికుడైనా తానున్నానని ఒప్పుకుంటాడు. అందువల్ల ఏది వచ్చినా తనలో నుంచే రావాలి. తనలోనే అణగాలి. ఏదైనా తనకు భిన్నంగా లేదు. 'అణోరణీయాన్, మహతో మహీయాన్' అన్న శ్రుతి వాక్యాన్ననుసరించి మహత్తుకు మహత్తుగా వుండేది అదే. అణువులో అణువుగా ఉండేదీ అదే నన్నారు భగవాన్. ''ఈ అణువుకు, మహత్తుకు భేదం దేన్ననుసరించి వస్తుంద''దని ప్రశ్నించారు మూర్తిగారు. ''దేహాన్ననుసరించే వస్తుం''దన్నారు భగవాన్. ''మరి లోకంలో ఇన్ని రకాల శక్తులు గోచరిస్తాయే. ఒకదాని ననుసరించి మరొకటిగా, అదేమీ?'' అన్నారు వారు. ''మనస్సేనండీ కారణం. ఆ మనస్సే ఇన్ని రకాల తోస్తుంది. అది పుట్టగానే అన్నీ పుడతవి. పంచభూతాలో, భూతాల కవతల వుండే శక్తులో, ఏవైనా సరే, ఆ మనస్సు పుడితే సరి, అన్నీ పుడతవి. అది అణిగితే అన్నీ అణగుతవి. అన్నిటికీ అదే కారణం'' అన్నారు భగవాన్.

స్వప్నాలు-భ్రాంతులు

శ్రీ రమణాశ్రమం
28-7-46

ఈ మధ్య ఉత్తర హిందూ దేశస్తులొకరు వచ్చి కొన్నాళ్లున్నారిక్కడ. ఒకరోజు మధ్యాహ్నం మూడుగంటలకు భగవత్సన్నిధికి వచ్చి ఒక అరవ భక్తుని ద్వారా తన అనుభవం ఇట్లా నివేదించారు: ''స్వామీ! నిన్న నేనిక్కడి వసతిగృహంలో నిద్రపోతున్నాను. తమరు వచ్చి నాతో మాట్లాడుతూనే వున్నారు. ఇదేమిటి?'' అని అడిగారు. ''నీవు నిద్రపోతున్నావు గదా. ఇక మాట్లాడే దెవరితో?''నన్నారు భగవాన్. ''నాతోటే''నన్నారు వారు. అందరికీ నవ్వు వచ్చింది.

''మీరు నిద్రపోతున్నానన్నారు. నిద్రపోయే వారితో ఏమి మాటలు? కాదు, మాట్లాడానంటున్నారు. అంటే శరీరం నిద్రపోతున్నా నీవున్నా వన్న మాట. ఆ నీవెవరో తెలుసుకో ముందు. ఆ వెనుక నిద్రలో మాట్లాడే విచిత్రాల సంగతి ఆలోచిద్దాం'' అన్నారు భగవాన్. మరి జవాబు లేదు. కరుణా పూర్ణ దృక్కులతో అందరినీ కలయజూచి ''రెండే వుండేది: సృష్టి, నిద్ర, నిద్రపోతే ఏమీ లేదు, లేస్తే అన్నీ వున్నవి. జాగ్రత్తతో నిద్రపోవటం నేర్చుకుంటే సాక్షి మాత్రంగా వుండగలుగుతాం. అదే సరైన పంథా'' అన్నారు భగవాన్.

ఇట్లాగే ఆ మధ్య సుబ్బరామయ్యగారు భగవంతులను చూచి ఏదో ప్రసంగవశంగా ''అస్పర్శరూపం అంటే యేమిటి?'' అని ప్రశ్నించారు. ''రూపం కంటికి కనుపడుతుందే గాని స్పర్శకు అందదన్న మాట. అదే అస్పర్శ రూపం'' అన్నారు భగవాన్. ఛాయారూపమంటే యేమిటని మళ్లీ ప్రశ్న. ''అదే అదే..ఛాయగా కనపడుతుంది. పరికించి చూస్తే ఏమీ వుండదు. దేవుడో, దయ్యమో, స్వప్నమో, ప్రత్యక్షమో, ఆవేశమో ఏదో అనుకోండి. ఇంతకు, చూచేవాడుంటే గదా ఇవన్నీను. చూచేవాడెవడో చూచుకుంటే, ఇవేవీ వుండవు. ఏమీ లేనిదేదో, అన్నిటికీ మూలమైనదేదో, అది తాను, తానెవడో చూడక ఇవన్నీ చూచినందువల్ల ప్రయోజనమేమి?'' అన్నారు భగవాన్.

ఈ మధ్య ఒకరు తమ స్నేహితులు సూక్ష్మశక్తి పరిమాణాలు చూడగల వారున్నారనీ, వారు మహాపురుషుల సూక్ష్మశక్తి పరిమాణాలు చూచారనీ, అందులో శ్రీ అరవిందుల సూక్ష్మశక్తి కాంతి ఏడు ఫర్లాంగుల దూరం వ్యాపించిందనీ, భగవాన్ సూక్ష్మ శక్తి యొక్క కాంతి మూడు మైళ్ల వరకు చూడగలిగితేనే గాని ఆ వెనుక ఎంతవరకు వ్యాపించిందో చూడలేకపోతిననీ, బుద్ధుడు మొదలైన వారిదెవ్వరికీ ఇంతదూరం వ్యాపించలేదనీ, చెప్పినట్లుగా భగవత్సన్నిధిలో నివేదించారు. చిరునవ్వుతో ఆమూలాగ్రంగా విని ''ఇందరి సూక్ష్మశక్తి పరిమాణాలు పరిశీలించుటకు ముందు తన సూక్ష్మమేదో పరిశీలించుకోమని చెప్పండి సూక్ష్మశక్తి పరిమాణాలట, చూస్తారట. తన సూక్ష్మమేదో చూచుకుంటే ఈ గొడవలుండవు'' అన్నారు భగవాన్. తన్నుదా గన్నవానికి ఇవన్నీ భావనా మాత్రములు గదా!


- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

ప్రత్యేకతల నకులుడు

మహాభారత యుద్ధంలో నకులుడు శత్రు పక్షంలోని చాలా మంది వీరులను హతమార్చాడు. పాండవుల పక్షాన పోరాడిన ఏడు అక్షౌహిణుల సేనలో ఒక అక్షౌహిణికి ఆయన నాయకత్వం వహించాడు. యుద్ధంలో సైతం అతను వీరవిహారం చేశాడు. కత్తి యుద్ధంలో నేర్పరి. అసాధారణ ఆయుధాలు వినియోగించడంలో దిట్ట.



మహాభారతం గురించి తెలిసినవారెవరికైనా నకుల, సహదేవుల గురించి తెలిసే ఉంటుంది. నకుల, సహదేవులు పంచపాండవులలోని చివరి ఇద్దరు. వారు పాండురాజు రెండవ భార్య అయిన మాద్రికి అశ్వినీ దేవతల అనుగ్రహంతో పుట్టినవారు. పాండు రాజు మరణించాక మాద్రి ఆయనతో సహగమనం చేసిన సంగతి తెలిసిందే . భారతంలో నకుల సహదేవుల గురించి ఉన్నా వారి వివరాలు అంతగా ప్రచారంలో లేవు. నకుల సహదేవుల మామ (తల్లి సోదరుడు) మద్ర దేశాధిపతి అయిన శల్యుడు. అందువల్ల శల్యునికి నకుల సహదేవులపై మక్కువ ఎక్కువ. అయితే మహాభారత యుద్ధంలో శల్యుడు కౌరవుల పక్షాన పోరాడాడు. శకుని మాయోపాయంతో శల్యుని నుంచి వారి పక్షాన ఉంటానని మాట తీసుకోవడంతో ఆయన ఆ పక్షాన ఉండిపోవాల్సి వచ్చింది. అయినప్పటికీ కౌరవుల్లో మహా వీరుడైన కర్ణునికి సారథిగా పనిచేసి అతన్ని దెప్పి పొడుస్తూ యుద్ధంలో ఏకాగ్రత లేకుండా చేస్తూ వచ్చాడు.

శల్యునికి కుమారులున్నా నకుల సహదేవులను తన రాజ్యానికి వారసులను చేస్తానని అనేవాడు. కాగా పాండవుల అరణ్యవాస కాలంలో జటాసురుడనే రాక్షసుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి మాయోపాయంతో నకుల, సహదేవ, ద్రౌపది, ధర్మరాజులను, వారి ఆయుధాలను ఎత్తుకుపోయాడు. భీముడు వీరందరినీ రక్షించాడు. అసురుణ్ని చంపేసాడు. అప్పుడు జరిగిన యుద్ధంలో నకులుడు క్షేమంకరుడు, మహామహుడు, సురతుడనే వారిని సంహరించాడు. అజ్ఞాత వాస కాలంలో నకులుడు విరాటుని కొలువులో దామగ్రంధి పేరుతో అశ్వ సంరక్షకునిగా చేరాడు.

మహాభారత యుద్ధంలో నకులుడు శత్రు పక్షంలోని చాలా మంది వీరులను హతమార్చాడు. పాండవుల పక్షాల పోరాడిన ఏడు అక్షౌహిణుల సేనలో ఒక అక్షౌహిణికి ఆయన నాయకత్వం వహించాడు.

యుద్ధంలో సైతం అతను వీరవిహారం చేశాడు. వాటి వివరాలు ఈ విధంగా చెబుతారు. అతను యుద్ధం మొదటి రోజున దుశ్శాసనుని ఓడించాడు. భీముని ప్రతిజ్ఞ ఉన్న కారణంగా అతనిని చంపకుండా వదలివేశాడు. యుద్ధంలో 11వ రోజున అతను శల్యుడి రథాన్ని ధ్వంసం చేయడం ద్వారా అయనను ఓడించాడు. 13వ రోజున ద్రోణుడు పన్నిన పద్మ వ్యూహంలోకి నకులుని ప్రవేశాన్ని జయద్రథుడు (సైంధవుడు) అడ్డుకున్నాడు. 14వ రోజున నకులుడు సహదేవునితో కలిసి శకునిని, అతని కుమారుడు ఉలూకుణ్ని ఓడించాడు. 15వ రోజున నకులుడు దుర్యోధనుని చేతిలో ఓడిపోయాడు. అయితే చేకితానుడు అతనిని రక్షించాడు. 16వ రోజున కర్ణుడు నకులుణ్ని ఓడించాడు. 17వరోజున నకులుడు శకుని కుమారుడైన ఉలూకుణ్ని సంహరించాడు. యుద్ధానంతరం ధర్మరాజు నకులసహదేవులను మద్ర దేశానికి రాజులను చేశాడు. చివరగా స్వర్గారోహణ పర్వంలో ద్రౌపదితో సహా పాండవులు అన్నీ వదలుకుని హిమాలయాలకు వెడతున్నపుడు ధర్మరాజు మినహా ద్రౌపదితో సహా పాండవులందరు ఒకరి తర్వాత ఒకరు పడిపోయారు. ఆ క్రమంలో నకులుడు పడిపోయినపుడు అతనెందుకు పడిపోయాడని భీముడు అడిగినపుడు నకులునికి తనంత అందగాడు ఎవరూ లేరన్న అహంకారం ఎక్కువని ఆ దోషం కారణంగానే అలా జరిగిం దని ధర్మరాజు జవాబిస్తాడు.



ప్రత్యేకతలు

నకులుడు పాండవులందరిలోకి అందగాడు. ఆయనకు అశ్వ శాస్త్రంలో ప్రవేశం ఉంది. ఆయనకు గుర్రాల వ్యాధు లకు చికిత్స చేసే విధానం తెలుసు. దేవ వైద్యులైన అశ్వినీ కుమారుల అంశతో పుట్టాడు కనుక ఆయనకు వైద్యశాస్త్రంలో ప్రావీణ్యం ఉంది. పాండవులలో ఎవరు ఏ దేవుని అంశతో జన్మించారో వారికి ఆ లక్షణాలు ఉంటుంటాయి. వాయు దేవుడు దేవతలలో బల వంతుడు కనుక ఆయన అంశతో పుట్టిన భీముడు మహా బల వంతుడు, యముని అంశతో పుట్టిన ధర్మ రాజు ధర్మ నిరతిలో శ్రేష్ఠుడు. నకులుడు కత్తి యుద్ధంలో నేర్పరి. అసాధారణ ఆయుధాలు వినియోగించడంలో దిట్ట. ఆయన మంచి దౌత్యవేత్త. నకులునికి జ్యోతిషంలో కూడా ప్రవేశముందని చెబుతారు.

ఆపదోద్ధారకులు

భక్తులను భగవంతుడు ఆపత్సమయాలలో రక్షించడం గురించి ఎన్నో పురాణ కథలు ఉన్నాయి. ఆధునిక కాలంలో ఆ విధంగా భక్తులను కాపాడిన వారిలో పాండురంగడు, షిర్డీ సాయినాథుడు ఉన్నారు. భక్తులను కాపాడిన వారి లీలల్లో రెండు చూద్దాం.

సంత్‌జీ పవార్ పుట్టుకతోనే 'గోవింద, నారాయణ' అనే భగవన్నామ స్మరణ తప్ప అన్యమెరుగడు. హిందూ మతంపై సంపూర్ణ విశ్వాసం కలవాడు. అతనికి వివాహమైంది. భార్య పేరు కాంత.

సంసార సాగరంలో చిక్కుకోక భగవత్ సాక్షాత్కారం కోసం సంసారాన్ని త్యజించి అరణ్యాలలో భగవదన్వేషణ చేస్తూ ప్రశాంత జీవనం కొనసాగించేవాడు. భర్తను వీడి ఉండలేని కాంత అతనిని వెతుక్కుంటూ అరణ్యాలకు వెళ్ళి అతనిని కలిసి పాదాలపై పడి ''నిన్ను వీడి నేనుండలేను. నేను కూడా నీతోనే ఉంటాను'' అని చెప్పి అతనిని ఒప్పించి అతని వెంటనే ఉంటూ చుట్టుప్రక్కల గ్రామాలలో మధుకరి వృత్తిచే (తన శరీరం నిలవడానికి అవసరమైన ఆహారం ఏ రోజుకారోజు భిక్ష ద్వారా సేకరించడం) జీవించ సాగింది.

ఒకనాడు కాంత నదికి ఆవల ఉన్న గ్రామంలో మధుకరి చేసి తిరిగి వచ్చే సమయానికి పెద్దగాలి వాన వచ్చి నది పొంగి పొర్లసాగింది. నదిని ఎలా దాటాలో తెలియక పాండురంగని వేడుకోగా వెంటనే ఒక పడవ వాడు అక్కడకి వచ్చి ''అమ్మా! నా పడవలో ఎక్కు. నిన్ను ఆవల తీరానికి చేరుస్తాను'' అని చెప్పగా ఆమె ఆ విధంగా చేసి భర్త చెంతకు చేరి జరిగిన సంగతి చెప్పగా ఆ పడవవాడు సాక్షాత్తు పాండురంగడేనని తెలుసుకొని ఆమె భర్త తనకు రంగని సాక్షాత్కారం కలగలేదని చింతించాడు.

ఒకసారి ఒక మిఠాయి అంగడి వాడికి రంగడు కలలో కనిపించి రుచికరమైన పదార్థాలను చేసి సంతోబాకు సమర్పించుకొమ్మని చెప్పగా అతను అలాగే చేశాడు. సంతోబా ''నీకు కూడ రుక్మిణి వల్లభుని సాక్షాత్కారం కలిగిందా! మీరందరు అదృష్టవంతులు నేను దురదృష్టవంతుడ''ను అని వాపోవుచుండగా పాండురంగడు అతని ఎదుట ప్రత్యక్షమై ''నీకు ఏమి వరం కావాలో కోరుకోమనగా'' సంతోబా ''నీ సాక్షాత్కారముతో పరిపూర్ణుడనయ్యాను. నాకు ఇంకేమి కోరికలు లేవు'' అనగా భగవంతుడు కూడ అతని వినయ విధేయతలకు ముగ్ధుడయ్యాడు. ఇటువంటి

''లోండా అలా'', షిరిడీ

ఇది షిర్డీ సాయినాథుడు తన భక్తుడిని కాపాడిన లీల. 'లోండా అలా' అనేది మరాఠి పదం. దానికి తెలుగు అర్థం 'ఉప్పెన వస్తోంది' అని. జ్యోతీంద్ర తర్కడ్ షిరిడీలో ఉన్నప్పుడు అతనికి తెల్లవారుజామునే నిద్రలేచి షిరిడీ పొలిమేరలకు వెళ్లి కాలకృత్యములు తీర్చుకుని, స్నానమాచరించి కాకడ హారతికి హాజరవటం నిత్య కృత్యం. ఆ రోజుల్లో షిరిడి పొలిమేరల్లో గోదావరి నది ప్రవహించేది. సంవత్సరంలో అత్యధిక భాగం అది నీరు లేక ఎండిపోయి ఉండేది. వర్షాకాలంలో మాత్రం అందులో నీరుండేది. ఒకసారి వర్షాకాలములో జ్యోతీంద్ర షిరిడిలో ఉండగా తెల్లవారుజామునే టార్చి లైటు తీసుకొని కాలకృత్యాలు తీర్చుకొనేందుకు నది ఒడ్డుకు వెళ్ళాడు. ఆ సమయంలో అతనికి కొద్ది దూరములో ఉన్న ఒక వ్యక్తి ''లోండా అలారే అలా పాల' అని కేకలు వేసి దూరంగా వెళ్లిపొండని చేతితో సైగ చేశాడు. అతనికి మరాఠీ రాకపోవడంతో ఆ మాటలు అర్థం కాలేదు. ('లోండా అలారే అలా పాల' అంటే ఉప్పెన వస్తోంది దూరంగ వెళ్లండి అని అర్థం). జ్యోతీంద్ర తన వద్ద నున్న టార్చి లైటు వేసి చూడగా గోదావరి ఉప్పొంగి ఉరకలేస్తూ వస్తోంది. 7 నుండి 8 అడుగుల ఎత్తున నీటి ప్రవాహం ఉంది. ఆ ప్రవాహానికి పెద్ద పెద్ద వృక్షాలే కొట్టుకు పోతున్నాయి. అది చూసి జ్యోతీంద్ర ''ఈ క్షణంతో నా జీవితం సమాప్తమవుతోంది'' అని భావించి ''బాబా, బాబా,

మహనీయులు

రక్షించు, నేను మరణిస్తున్నాను రక్షించు'' అని ఎలుగెత్తి మనస్ఫూర్తిగా బాబాను ప్రార్థించి కళ్లు మూసుకొని బాబా నామస్మరణ చేయసాగాడు. ఎంతకూ నీటి ప్రవాహం తనను తాకక పోవడంతో కొంత తడవు తరువాత కళ్లు తెరిచాడు. అంత ఎత్తున వస్తున్న నీటి ప్రవాహం తన చెంతకు రాగానే రెండుగా చీలి తనని తాకకుండా ప్రవహించడం చూసి అదంతా బాబా మహిమేనని గ్రహించాడు. కొంత సమయం గడచిన తరువాత నీటి ప్రవాహము తగ్గి మోకాలి లోతులో ప్రవహిస్తుండగా అప్పుడు ఆ ప్రవాహము అతనిని తాకెను. ఆ లోతులో నెమ్మదిగా బసకు చేరి స్నానమాచరించి ద్వారకామాయిలో అడుగిడగానే బాబా ''తెల్లవారుజామున నన్ను ఎందుకు స్మరించావు? నీవు ఆ విధంగా మరణించటానికి నిన్ను షిరిడీకి తీసుకురాలేదు. నీకు ఇప్పట్లో మరణం సంభవించదు. ముందు ముందు నీ చేతుల మీదుగా ఎన్నో సత్కార్యాలు జరగవలసి ఉంది'' అని అనగా ఆ మాటలు విన్న జ్యోతీంద్ర ఒక్క క్షణమైనా ఆలస్యం చేయక బాబా పాదాల మీద పడి కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.


జ్యోతీంద్ర తర్కడ్

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

కల్కి పలుకు

మన భావావేశాల వెనుక ఉన్న అన్ని కారణాల విషయంలో గందరగోళం అనవసరం . ఉన్నవి రెండే రకాలు మంచి భావాలు, చెడు భావాలు.

Sri Amma Bhagavan

వివరణ : కూనపురెడ్డి అరుణ్ కుమార్

భగవద్గీత

కృష్ణభక్తితో భగవద్ధామం



అధ్యాయం 4

శ్లోకం 24:

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః
బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్।
బ్రహ్మైవ తేన గంతవ్యం
బ్రహ్మ కర్మ సమాధినా॥

తాత్పర్యం

కృష్ణభక్తి రసభావనలో సంపూర్ణంగా నిమగ్నుడైన మనుజుడు భగద్ధామాన్ని తప్పక పొంది తీరుతాడు. స్వీకరించేది, అర్పించేది అనే రెండు బ్రహ్మమేయైనటువంటి ఆధ్యాత్మిక కర్మల యందు అతడు తత్పరుడై ఉండటమే అందుకు కారణం.

భాష్యం

కృష్ణ భక్తి భావనతో చేసే కర్మలు ఏ విధంగా అంత్యంలో మానవుణ్ని ఆధ్యాత్మిక గమ్యానికి చేర్చగలవో ఇచ్చుట వివరింపబడినది. ప్రతి వ్యక్తీ ఏదో ఒక కర్మ చేయక తప్పదు. అటువంటి కార్యాలు భౌతిక చైతన్యంతో చేయటం వలన బద్ధుడు అవుతాడు. అట్టి బద్ధ జీవిని భౌతికభావన నుండి విముక్తుణ్ని చేసే విధానమే కృష్ణ భక్తి రస భావన. ఉదాహరణకు పాల పదార్థాలను అధికంగా భుజించటం వల్ల అతిసారవ్యాధి వచ్చినపుడు దానికి విరుగుడుగా పాల పదార్థమే అయిన పెరుగును తీసుకొనునట్లు, విషయ వాంఛలతో రోగగ్రస్తుడైన వ్యక్తిని ఇచ్చుట భగవద్గీతలో తెలుపుచున్న సూత్రాల ద్వారా బాగుపరచ వచ్చును. ఈ పద్ధతినే యజ్ఞము లేదా విష్ణు ప్రీత్యర్థం చేసే కర్మగా పేర్కొంటారు. ''బ్రహ్మం'' అనగా ఆధ్యాత్మికము అని భావము. శ్రీ కృష్ణభగవానుడే పరబ్రహ్మము. అతని దివ్య శరీరకాంతియే ఆధ్యాత్మిక తేజమైన '' బ్రహ్మజ్యోతి''గా పిలువబడుతుంది. సమస్తం ఈ బ్రహ్మజ్యోతి యందే నిలిచి ఉంటాయి. కాని అట్టి బ్రహ్మజ్యోతి మాయచే లేక ఇంద్రియ బోగవాంఛచే కప్పబడినప్పుడు భౌతికమనబడుతుంది. ఆ భౌతిక తెర కృష్ణభక్తి భావనచే తొలగింబడుట వలన ఆ భావన యందు అర్పణము చేయబడుతూ, అట్టి అర్పణము స్వీకరించునది, అర్పణ విధానము, అర్పణము చేయువాడు, దాని ఫలితములు అన్ని బ్రహ్మమే అయి ఉన్నవి.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఆంధ్రప్రభ యాప్‌లో శ్రావ్యమైన ఆడియోతో...



'సిప్'లో పెట్టుబడులు ఇలా...

చాలామంది పెట్టుబడులు పెట్టేది ఎందుకంటే ఆదాయపు పన్ను పడకుండా తప్పించుకునేందుకు లేదా అవసరమైనదానికంటే ఎక్కువ డబ్బు ఉందనే విషయం చెప్పకపోయినా ఆర్థిక ప్రణాళిక నిపుణులకు తెలుస్తుంది. చాలా రకాల పెట్టుబడులు ఎటువంటి లక్ష్యాల్లేకుండా జరిగిపోతుంటాయి. మళ్లీ ఆ డబ్బును బయటకు తీసిన తర్వాత దేనికో ఖర్చు పెడతారు. ఈ మధ్య చాలామంది మిత్రులు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారని తెలిసి ఆ వైపు సైతం మొగ్గు చూపుతున్నారు. అయితే ఒక లక్ష్యం ఉండి పెట్టుబడి పెడితే మంచిది. దీర్ఘకాలిక లక్ష్యం ఉండి ఒక నిర్థిష్టమైన మొత్తాన్ని సాధించాలంటే మ్యూచువల్‌ఫండ్ ''సిప్'' (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్'' ఒకమంచి మార్గం. ఈ విధంగా పెట్టుబడులు పెట్టాలంటే ఎటువంటి ప్రణాళిక అవసరం. ఏయే విషయాలు ఆలోచించి ఉండాలనే విషయం ఇక్కడ తెలుసుకుందాం.

లక్ష్యాల జాబితా

నెలవారీ చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకుంటూ కొంతకాలానికి ఎక్కువ డబ్బు సంపాదించేందుకు మ్యూచువల్ ఫండ్లు బాగా ఉపయోగపడతాయి. మూడు లేదా ఐదు సంవత్సరాల తర్వాత ఒక విదేశీ ప్రయాణం లేదా ఒక కారు కొనుగోలు వంటివి నిర్థిష్టమైన లక్ష్యాన్ని తెలియజేస్తాయి. లేదా పిల్లల ఉన్నత విద్య, వివాహం వంటివి దీర్ఘకాల లక్ష్యాల కిందకు వస్తాయి. ఇప్పుడు మనకు వచ్చే సంపాదనతో మనం కనె కలలు, మన లక్ష్యాలు వెంటనే నెరవేరకపోవచ్చు. కానీ క్రమంగా పెట్టుబడులు పెట్టుకుంటూ పోతే మన ఆర్థిక లక్ష్యాలను సాధించడం పెద్ద కష్టమేమి కాదు. అందుకే మొదట సిప్ ప్రారంభానికి ముందు మీ అవసరాలు, కోరికలు లక్ష్యాల జాబితాను తెలుసుకుని ముందుకు సాగండి.

స్వల్పకాలిక లక్ష్యాలు

ఒకటి, రెండేళ్లలోపు చేరుకునే లక్ష్యాలు స్వల్పకాలిక లక్ష్యాలుగా భావించకండి. ఇలాంటి వాటికోసం సిప్ మార్గంలో పెట్టుబడి పెడితే చాలా భద్రమైన, సురక్షితమైన వాటిలో పెట్టుబడి పెట్టాలి. ఈ సందర్భంలో ఒక్కోసారి మ్యూచువల్ ఫండ్ సిప్‌ల కంటే ఫిక్స్‌డ్ డిపాజిట్లే సూచనీయం కూడా. మూడు నుంచి ఐదేళ్ల కాలానికి పెట్టే పెట్టుబడులు మధ్యకాలిక పెట్టుబడుల కిందకు వస్తాయి. ఇలాంటప్పుడు ఏమీ ఆలోచించకుండా ఈక్విటీ ఫండ్లవైపు మొగ్గు చూపవచ్చు. సమతౌల్యం కోసం డెట్, బ్యాలెన్స్‌డ్ ఫండ్లను ఎంచుకోవచ్చు. గత



పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యంగా రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి ఒకేసారి పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టడం, లేదా క్రమానుగతంగా సిప్ మార్గంలో పెట్టుబడిపెట్టడం. సిప్ పెట్టుబడులు అంటే ఏమో తెలియనప్పటికీ ఈ పదం అయితే చాలామంది వినే ఉంటారు. సిప్ పెట్టుబడి అంటే వారం, నెలవారీ, త్రైమాసిక కాలపరిమితుల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం కల్పించేది. సిప్ మార్గంలో డబ్బు పెట్టుబడి పెట్టేందుకు మార్కెట్‌ను అంచనా వేయాల్సిన అవసరం లేదు. మార్కెట్ ఎలా ఉన్నా సిప్ ద్వారా వచ్చే రాబడుల్లో పెద్దగా మార్పుండదు. ఈక్విటీల్లో పెట్టుబడి పెడుతుంటే మాత్రం ఇది దీర్ఘకాలానికి అని గుర్తుంచుకోవాలి. కనీసం 5 నుంచి 7 ఏళ్ల లక్ష్యం ఉంటేనే ఈక్విటీ పెట్టుబడుల వైపు మళ్లండి.

మ్యూచువల్ ఫండ్ స్కీం

మీరు పెట్టుబడి పెట్టే మ్యూచువల్ ఫండ్ కంపెనీకి మార్కెట్లో ఎంత పేరుందో తెలుసుకోండి. ఫండ్ హౌస్ లక్ష్యం ఏమి ఉంది, మన లక్ష్యాలను సాధించేందుకు అది సరైన దిశలో సాగుతుందో లేదో ఆలోచించుకోవాలి. గత సంవత్సర కాలంలో, మూడేళ్లలో, ఐదేళ్లలో దాని పనితీరు ఎలా ఉందో గమనించాలి. ఈక్విటీ ఫండ్స్ విషయంలో దీర్ఘకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 3-5 ఏళ్ల రాబడులు, డెట్ ఫండ్ల విషయంలో 1,3 సంవత్సరాల వ్యవధిలో వచ్చిన రాబడులను పరిశీలించడం మంచిది. అంతేకాకుండా ఎగ్జిట్ లోడ్, ఎక్స్‌పెన్స్ రేషియో, రికరింగ్ కాస్ట్ వంటివి చూస్తే ఫండ్ గురించి మరింత అవగాహన వస్తుంది.

కొన్నేళ్లలో ప్రభుత్వం తీసుకున్న సంస్కరణల కారణంగా ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండటం, కరెన్సీ స్థిరత్వం వంటి వాటి మూలంగా వీటి ఫలాలు 2020-22 మధ్య పెట్టుబడిదారులకు అందుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుంటే మీ మ్యూచువల్ ఫండ్ రాబడులు సైతం వచ్చే మూడేళ్లలో దాని వల్ల ప్రభావితం అవుతాయని పైసాబజార్.కామ్ మ్యూచువల్ ఫండ్ విభాగాధిపతి మనీష్ కొఠారీ చెప్పారు.

మ్యూచువల్ ఫండ్ రకాలు

సరైన కాలంలో సరైన పెట్టుబడి మార్గాన్ని ఎంచుకోవడం ఆస్తులను పెంచుకోవడంలో ముఖ్యమైనది. మ్యూచువల్ ఫండ్లలో మీరు లిక్విడ్ ఫండ్లు, ఈక్విటీ, డెట్ ఫండ్ గురించి మొదట తెలుసుకోవాలి. లిక్విడ్ ఫండ్లను స్వల్పకాలానికి ఎంచుకోవాలి. మధ్యకాలిక లక్ష్యాల కోసం కొంచెం డెట్, కొంచెం ఈక్విటీ ఫండ్లలోనూ లేదా బ్యాలెన్స్ ఫండ్లలో ఉంచడం ముఖ్యం. అదే దీర్ఘకాలిక లక్ష్యాల కోసం అయితే ఈక్విటీ లేదా ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టొచ్చు.

క్రమశిక్షణతో పెట్టుబడి

క్రమశిక్షణతోకూడిన పెట్టుబడులు అలవాటయ్యేందుకు సిప్ మార్గం ఉపకరిస్తుంది. మ్యూచువల్ ఫండ్లలో

ఐటీఆర్ వల్ల లాభాలు



ఆదాయపు పన్ను శాఖ పన్ను చెల్లించే వారి సంఖ్యను పెంచేందుకు సకల ప్రయత్నాలు చేస్తోంది. ఎందుకంటే మొత్తం జనాభాలో ఆదాయపు పన్ను చెల్లించే వారు ఒక శాతం లోపే ఉన్నారు.
అయకార్ సేతు యాప్, మైట్యాక్స్ యాప్ నుంచి సహజ్ ఫారం వంటి వాటిని అందుబాటులోకి తెచ్చి ఐటీఆర్ ఫైలింగ్ విధానాన్ని సులువుగా చేశారు.
ఇన్సూరెన్స్, క్రెడిట్ కార్డుల దరఖాస్తు కోసం కొన్ని చిన్న బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణ దరఖాస్తుదారుల స్థోమతను తెలుసుకునేందుకు ఐటీఆర్‌లను అడుగుతాయి.
కొన్ని సందర్భాల్లో బీమా సంస్థలు సైతం ఐటీఆర్ డాక్యుమెంట్లను అడుగుతాయి.
ఇప్పటికీ ఐటీఆర్ రిటర్నులు ఎందుకు సమర్పించాలని అని అనుకునేవారు కనీసం ఈ సందర్భాల్లో పనికొస్తుందనే భావనతోనైనా ఐటీఆర్ రిటర్నులను సమర్పిస్తే వారికే మంచిది.

స్థిరాస్తి రిజిస్ట్రేషన్

దేశంలోని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు స్థిరాస్థి కొనుగోలు, రిజిస్ట్రేషన్ సమయాల్లో ఐటీఆర్ ఫారంను అడుగుతున్నాయి. మీరు కొన్న స్థిరాస్తి వివరాలను రిజిస్ట్రేషన్ శాఖ వారు ఆదాయపు పన్ను శాఖకు పంపుతారని గుర్తుంచుకోండి.

వీసా ప్రాసెసింగ్

గత రెండు మూడేళ్ల ఐటీ రిటర్నులను ఫైల్ చేసిన తర్వాత వీసా దరఖాస్తు ప్రక్రియ మొదలవుతుంది. ఎందుకంటే దరఖాస్తుదారు చెల్లించిన పన్నులకు ఒక రుజువుగాను, స్థిర ఆదాయానికి ఒక రుజువుగాను ఇది ఉంటుంది.

బ్యాంకుల నుంచి రుణం

బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు గత మూడేళ్ల ఐటీ రిటర్నుల నకళ్లను ఆదాయం రుజువుగా అడుగుతాయి. ఇది దరఖాస్తుదారు చెల్లింపు సామర్థ్యం మీద ఒక అవగాహనను తెచ్చేందుకు మాత్రమే. అసలు, వడ్డీ కలిపి చాలా అవుతుందని కాబట్టి ఆదాయం ఎంత ఉందనే దాన్ని బట్టి బ్యాంకులు రుణ దరఖాస్తుదారుని గురించి ఒక అవగాహనకు వస్తాయి. దాదాపుగా గృహరుణం, వాహన రుణం దేనికైనా ఐటీఆర్‌ను అడుగుతుంటారు.

ఆదాయాన్ని పెంచే అలవాట్లు

ఆదాయాన్ని, ఖర్చుల మధ్య సమతుల్యతను పాటించే వారు బాగా పొదుపు చేయగలరు. మీరు ఎంత సంపాదిస్తున్నారు అనేది విషయం కాదు. ఎక్కువ ఇబ్బంది పడకుండా ఎంత ఆదాయం చేస్తున్నారన్నదే లెక్క.
ఏదైనా సరే ముందు, ఒక బడ్జెట్ తయారు చేసుకుని, ఖర్చుల ప్రణాళికను వేసుకుని ఒక డైరీని ఏర్పాటు చేసుకోవాలి. మీరు దీనికి సంబంధించి సాంకేతికపరమైన ఒక యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుంటే అది మీ ఖర్చులను అదుపులో ఉంచుకోవడానికి సహాయపడుతుంది. మనం సాధారణంగా చిన్న చిన్న ఖర్చులను లెక్క చేయం. కానీ చివరకు అవి కొంతకాలానికి పెద్ద మొత్తం అయి ఇబ్బంది పెడతాయి.

నిత్యావసర సరుకులు

మీకు కావాలసిన సరుకుల జాబితాను తయారుచేసుకుని బడ్జెట్ వేసుకోండి లేదా మీరు చివరకు అవసరంలేని వస్తువులు కూడా కొంటారు. ఒక జాబితా తయారు చేసుకుంటే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దానివల్ల అవసరంలేని వస్తువులను కొనకుండా ఉండవచ్చు. పండుగ సీజన్లో లేదా అతిథులను ఆహ్వానించినప్పుడు ఒక జాబితాను పరిగణలోకి తీసుకోవాలి. దాని ప్రకారమే కొనుగోళ్లు చేయడం మంచిది.

ఆన్‌లైన్‌లో కొనుగోలు తేడా

మీరు ఆన్‌లైన్ లేదా విడిగా కొనేవాటికి కొంత తేడా ఉంటుంది. మీరు కొనాలి అనుకునే వస్తువులను ఏమైనా ఎక్కువ తగ్గింపు ధరలు ఉన్నాయేమో పోల్చి చూసుకోండి. అంతేకాకుండా ఉదాహరణకు మీరు ఒక మొబైల్ కొనాలి అనుకుంటే ఒక ధర మాత్రమే కాకుండా ఆన్‌లైన్‌లో రివ్యూ కూడా చూడండి. ఎల్రక్టానిక్ వస్తువులపై ఆన్‌లైన్‌లో అప్పుడప్పుడు ఆఫర్లు వస్తుంటాయి. వాటిని వినియోగించుకోండి.
మందులపై ఆదా మీరు మందులు కొనుగోలు చేసేటప్పుడు మీ బిల్‌పై కొంత తగ్గింపు వచ్చే ఫార్మసీ దుకాణాలలో కొనుగోలు చేయండి. ఈ ఫార్మసీలలో కొనుగోలు చేయడం వల్ల మరో ప్రయోజనం ఏమిటంటే, మీ మందులను ట్రాక్ చేసుకోవచ్చు. మీకు అవసరమైన జాబితాని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వారు మీకు ఒక లాగిన్ ఐడి ఇస్తారు. పన్ను రిటర్నులు సమర్పించేటప్పుడు దీన్ని చూపించుకోవచ్చు



ఇటీవల చాలా రాష్ట్రా ల్లో జనరిక్ దుకాణాలు ప్రారంభిస్తున్నారు. వీటిని సైతం కొనుగోలు చేసి మీ బిల్లులను తగ్గించుకోవచ్చు.

తగ్గింపు ఆఫర్లు

మీకు నిజంగా విశ్రాంతి కావాలంటే డిన్నర్ లేదా మూవీకి వెళ్లాలి అనుకుంటే గాబరా పడి వెళ్లవద్దు. ఏ రెస్టారెంట్లలో తగ్గింపు ఆఫర్లు ఉన్నాయో సమాచార జాబితాను కొన్ని వెబ్‌సైట్లలో పరిశీలించుకోండి. మీరు సినిమా టికెట్లు బుక్ చేసే ముందు ఆ ఆపరేటర్ ఏమైనా కార్డ్స్‌పై ఆఫర్లు పెట్టడేమో తెలుసుకోండి. కొన్ని బ్యాంకులకు వీటితో టై అప్ ఉంది.

తనిఖీ

మీరు ఏదైనా పెద్ద వస్తువు మంచిది కొనుగోలు చేయాలంటే ఆఫర్ల కోసం ఎదురు చూడండి. పండగ సీజన్లో ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. పండగ సమయాల్లో ఎల్రక్టానిక్ వస్తువులపై చాలా పెద్ద ఆఫర్లు ఉంటాయి. కొన్ని వస్తుమార్పిడి ఆఫర్లు కూడా ఉంటాయి. పెద్దవస్తువు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతకే ప్రాధాన్యం ఇవ్వండి. ఎందుకంటే దానికోసం మళ్లీ మళ్లీ ఖర్చు చేయాల్సిన అవసరం రాకూడదు.

అవసరంలేని వస్తువులు

డబ్బు సంపాదించడానికి ఇదో మంచి పద్ధతి, కొంతమంది అవసరమైన వస్తువులను అమ్మి డబ్బు సంపాదిస్తారు. అయితే వస్తువులను అమ్మేటప్పుడు తెలివి అవసరం. ఇటీవల ఓఎల్ఎక్స్ లాంటి వెబ్‌సైట్లు పాతవస్తువులను అమ్మడాన్ని సులభతరం చేశాయి.

క్రెడిట్ కార్డు

క్రెడిట్ కార్డు అత్యవసరాల్లోనే వాడండి. అవును, ఇది ప్రతి ఒక్కరికీ చెప్పే అత్యంత సాధారణ చిట్కా. తక్కువ పరిమితి గల క్రెడిట్ కార్డులను ఉపయోగించడానికి ప్రయత్నించడం చాలా కష్టం అని మీరు గమనించే ఉంటారు. క్రెడిట్ కార్డులను వాడకపోవడానికి ప్రధాన ఉద్దేశ ం అనవసరమైన కొనుగోలు చేయకుండా ఉండడం. క్రెడిట్ కార్డు నుంచి ఎక్కువ ఆదా చేయాలంటే మీ క్రెడిట్ పాయింట్లను ట్రాక్‌లో ఉంచితే అవసరమైనప్పుడు వాటిని వాడుకోవచ్చు. ఇంధన స్టేషన్లవంటి సర్ చార్జ్ అప్లయి కాని వాటికి కార్డ్ ఉపయోగించడం మంచిది.

లగ్జరీ వస్తువులు

సాధ్యమైనంత వరకు కారుకు బదులు బైకును వాడండి. నడపడం అనేది అన్నిటికంటే ఇంకా మంచిది. తక్కువ దూరాలకు నడక మార్గాన్ని ఎంచుకోండి. ఇందుకు మీరు సమయ పాలన పాటించడం అవసరం. ఈ చిన్ని చిన్ని అంశాలు మీ ఇంధన చెల్లింపులను తగ్గించి, మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఎఫ్‌డీలు

మీ డబ్బును ఒక పని కోసం, మీ ఆదా కోసం పెట్టుబడి పెట్టండి. అనేక బ్యాంకులు ఆటో స్వీప్ సౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. అంటే మీ అకౌంట్ కొంత మొత్తానికి నిర్దేశిస్తే దానంతట అదే ఆ మొత్తం డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలోకి మళ్లింపబడుతుంది. బ్యాంకులు ఏర్పాటు చేసిన ఎఫ్‌డిలపై వడ్డీ రేట్ల ప్రయోజనాన్ని మనం పొందవచ్చు.

నైపుణ్యాల పెంపు

అవును ఆర్థికపరమైన సమాచారం తెలుసుకుంటే మీరు బ్యాంకు డిపాజిట్లు పెరుగుతు న్నాయా లేదా తగ్గుతున్నాయా లేదా డెబిట్ లేదా క్రెడిట్ కార్డుపై ఏమైనా ఆఫర్లు ఉన్నాయా అనే అనేక మార్గాలను తెలుసుకోవడానికి సహాయపడుతుంది. ఏదైనా ఆర్థిక వస్తువు కొనుగోలు చేసేముందు, ఆ డాక్యుమెంట్ జాగ్రత్తగా చదివి సరైన రీతిలో పెట్టుబడి పెట్టండి.

స్టేట్‌ఫైనాన్స్ కార్పోరేషన్ రుణాలకు అర్హులెవరు?



లఘు పరిశ్రమలను, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలను విస్తృతపరిచేందుకు, సేవారంగాలను మెరుగుపరిచేందుకు, ఆర్థిక రుణాలను మంజూరు చేసే సంస్థగా 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ ఉద్భవించింది. భారతదేశ పారిశ్రామిక రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెప్పుకోతగ్గ స్థానాన్ని సంపాదించి పెట్టడంలో, రాష్ట్ర ఆర్థిక సంస్థ కీలకపాత్ర పోషిస్తుంది. భూమి, భవనాలు, యంత్రాలవంటి స్థిరాస్తులను సమకూర్చుకోవడానికి రాష్ట్రఆర్థిక సాయాన్ని అందిస్తుంది. రూ 10వేల నుండి రూ 150 లక్షల వరకూ ఒక్కో యూనిట్‌కు టెర్మ్‌లోన్‌గా కార్పోరేషన్ నుంచి లభించే అవకాశాలు చాలా ఉన్నాయి. అది కాకుండా సులభమైన వాయిదాల్లో రుణం తీర్చవచ్చు. గత నలభై సంవత్సరాలకు పైగా కొన్ని వేల, లక్షల పరిశ్రమలకు రుణాలను అందించింది. 5 జోనల్ ఆఫీసులను, 25 బ్రాంచి ఆఫీసులతోను, 2 ఫీల్డు ఆఫీసులను కలిగి ఉండి, రాష్ట్రంలోని మూలమూలలకూ ప్రయాణిస్తూ పారిశ్రామికుడి ఇంటితలుపు తట్టి మరీ ఆర్థిక సహాయం చేస్తోంది.
బ్రాంచి ఆఫీసులైతే రూ 10 లక్షల వరకూ మంజూరుచేయవచ్చు. జోనల్ ఆఫీసులైతే రూ 20 లక్షల మధ్య మంజూరు చేయవచ్చు. ప్రధానకార్యాలయం అయితే రూ 20లక్షలకు మించిన రుణాలను మంజూరు చేయవచ్చు.

అర్హత

స్వంత యాజమాన్యం, పార్ట్‌నర్‌షిప్, ఉమ్మడి హిందూ కుటుంబం, రిజిస్టర్ కో ఆపరేటివ్ సొసైటీ (లేదా) పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఏవైనా సరే రాష్ట్ర ఆర్థిక సంస్థ నుండి రుణాలు పొందవచ్చు.

ప్రాజెక్టులకు ఆర్థిక సాయం

- ♦ వివిధ ఉత్పత్తుల తయారీ, నిలువ ఉంచడం ప్రాసెస్ చేయడం.
- ♦ ఖనిజాలు, ఖనిజాల వెలికితీత, అభివృద్ధిపర్చుట.
- ♦ హోటళ్లు రెస్టారెంట్లు, ప్రయాణీకులను గానీ, ఉత్పత్తులను గానీ రోడ్డు ద్వారా/ జలమార్గాల ద్వారా/ వాయు మార్గాల ద్వారా లేదా రోప్‌వే లేదా లిఫ్ట్ లేదా రవాణా చేయడం.
- ♦ విద్యుత్‌ను కానీ మరే విధమైన శక్తిని కానీ ఉత్పత్తి చేయడం, పంపిణీ చేయడం.
- ♦ యంత్రాలు కానీ, వాహనాలు కానీ, మరేవైనా రకానికి చెందిన మోటార్‌బోట్స్, వెసల్స్, ట్రైలర్స్, ట్రాక్టర్స్ వంటి వాటి నిర్వహణ, రిపేర్, టెస్టింగ్, సర్వీసింగ్. యంత్రాల సహాయంతోనైనా లేక విద్యుత్ సహాయంతోనైనా ఏవైనా వస్తువుల ప్యాకింగ్, రిపేరింగ్, అసెంబ్లింగ్
- ♦ పారిశ్రామిక ప్రాంతాలను, పారిశ్రామిక ఎస్టేట్‌లను అభివృద్ధిపరచుట
- ♦ మత్స్య పరిశ్రమ, దానికి అవసరమయ్యే తీర ప్రాంత సౌకర్యాలను కలుగజేయుట
- ♦ వే బ్రిడ్జి సౌకర్యం కల్పించుట
- ♦ పరిశ్రమలకవసరమ్యే ఇంజినీరింగ్, టెక్నికల్, ఫైనాన్షియల్, మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ లేదా ఇతర సేవలను సమకూర్చుట.
- ♦ పాలిష్ చేయడం, ఫినిషింగ్, ఆయిలింగ్, వాషింగ్, పరిశుభ్ర పర్చడం లేదా వస్తువు ఉపయోగాన్ని బట్టీ అమ్మకం, రవాణా, డెలివరీ సౌకర్యాలు కల్పించడం
- ♦ వైద్య, ఆరోగ్య సంబంధ సేవలను అందించడం
- ♦ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ లేదా ఎల్రక్టానిక్స్, శాటిలైట్ లింకేజి, ఆడియో వీడియో కేబుల్ కమ్యూనికేషన్స్ సమకూర్చడం
- ♦ ఏదైనా పారిశ్రామిక వస్తువు లేదా అంశంపై రీసెర్చ్, అభివృద్ధికార్యక్రమాలు చేపట్టుట
- టూరిజంకు సంబంధించే ఎమ్యూజ్‌మెంట్ పార్కులు, సెంటర్లు, రెస్టారెంట్లు, రవాణా సౌకర్యాలు, టూరిస్ట్‌సర్వీస్ ఏజన్సీలు, ప్రయాణికులకు గైడెన్స్, కౌన్సిలింగ్ అభివృద్ధిపరుచుట.
- ♦ రోడ్ల మరమ్మత్తు, అభివృద్ధి, నిర్మాణం, రోడ్లు, బోర్ వెల్ రిగ్గులు వేయటం.
- ♦ అర్హులైన ప్రొఫెషనల్స్ చే ఎకౌంటెన్సీ, మెడిసిన్, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్ ఎంటర్‌ప్రైజెస్‌లను మొదలు పెట్టంచడం.
- ♦ ఫ్లోరీ కల్చర్
- ♦ టిష్యూ కల్చర్, ఫిష్ కల్చర్, పౌల్ట్రీ, హెచరీలు.
- ♦ హోటల్ పరిశ్రమలో భాగంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం పైన పేర్కొన్న జాబితాలో వాటికి దేనికైనా 'ఎస్ఎఫ్‌సి' నుండి రుణ సాయం పొందవచ్చు.

పాన్‌కార్డ్ స్టేటస్ తెలుసుకోవచ్చు

దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పాన్‌కార్డులను కేంద్రప్రభుత్వం రద్దు చేసింది. ఆదాయపు పన్ను శాఖాధికారులు కొంతకాలంగా దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాజా నివేదికల ప్రకారం జులై 27 నాటికి దేశవ్యాప్తంగా 11,44,211 నకిలీపాన్ కార్డులను రద్దు చేసినట్టుగా సమాచారం. అలాగే ఈ నెలాఖరు నాటికి ఆధార్‌తో లింక్‌కానీ పాన్‌కార్డులు రద్దుకానున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులు తమ పాన్ నెంబర్ పనిచేస్తోందో లేదో తెలుసుకోవడానికి ఈ విధంగా చేయండి.

1. ఇన్‌కమ్ ట్యాక్స్ ఈఫైలింగ్ వెబ్‌సైట్ http://www.incometaxindiaefiling.gov.in కు వెళ్లండి.
2. అందులో ఎడమ పక్కన కింద know your pan ఆప్షన్ నొక్కండి.
3. ఇక్కడ వెబ్‌సైట్ కొన్ని వివరాలు అడుగుతుంది. పేరు, పుట్టిన తేదీ వంటి వివరాలు కావాలి. తర్వాత మొబైల్ నెంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది.
4. మీ నమోదిత మొబైల్‌నెంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేస్తే అది తర్వాతి పేజీకి వెళుతుంది. వాలిడేట్ అనే బటన్ నొక్కండి.
5. మీ పాన్ కార్డు పని చేస్తున్నట్లయితే యాక్టివ్ అనే స్టేటస్ కనిపిస్తుంది.




లావణ్యత్రిపాఠి

ఆ ఒక్కటే కొరత...!

భలే భలే మగాడివోయ్, సోగ్గాడే ఛిన్నినాయన వంటి చిత్రాలు లావణ్యత్రిపాఠికి ఎనలేని గుర్తింపునిచ్చాయి. అయితేఎప్పట్నుంచో ఎదురుచూస్తున్న ఆమె కెరీర్ ఒక్కసారిగా మలుపు తిరిగింది. అవకాశాలపై అవకాశాలు వస్తున్నాయే కానీ స్టార్ హీరోల సరసన నటించాలన్న ఆమె ఆశలు ఇంకా ఫలించలేదు. ఆ ఒక్క విషయం మాత్రమే ఆమెకు లోటుగా కనిపిస్తున్నది. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళంలో కూడా నటిస్తూ బిజీబిజీగా ఉంది. తెలుగులో నాగచైతన్య సరసన యుద్ధం శరణంలోనూ, రామ్ సరసన ఉన్నది ఒక్కటే జిందగీలోనూ నటిస్తున్న ఆమెకు తాజాగా సాయిధరమ్‌తేజ కథానాయకుడిగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో రూపొందబోయే చిత్రంలో అవకాశం లభించింది. దీంతో లావణ్య ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. రామ్ నటిస్తున్న ఉన్నది ఒక్కటే జిందగీ కోసం తొలుత మేఘాఆకాష్‌ను ఓ నాయికగా ఎంపికచేశారు. అయితే ఆమె లై చిత్రం చిత్రీకరణలో బిజీగా ఉండటంతో డేట్స్ సర్దుబాటు కాలేదు. దాంతో మేఘాఆకాష్‌కు బదులుగా లావణ్యను వెతుక్కుంటూ అవకాశం వచ్చింది. అలా తెలుగులో మూడు చిత్రాలతో బిజీగా ఉన్న ఆమెకు మరికొన్ని చిత్రాలకు సంబంధించిన చర్చలు కూడా జరుగుతున్నాయట. ఇక తమిళంలో బ్రహ్మన్ చిత్రం ద్వారా ఇప్పటికే అక్కడి ప్రేక్షకులకు పరిచయమైన లావణ్య ఇప్పుడు మాయావన్ అనే తమిళ చిత్రంలో నటిస్తోంది. తెలుగు కథానాయకుడు సందీప్‌కిషన్ ఇందులో కథానాయకుడిగా నటిస్తున్నారు. మొత్తం నాలుగు చిత్రాలతో బిజీబిజీగా ఉన్న ఆమె ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోల చిత్రాలలో కథానాయికగా నటించాలని ఉవ్విళ్లూరుతోంది. అయితే ఆ అవకాశాలు ఎప్పుడు ఆమె దరి చేరతాయో వేచిచూడాల్సిందే.

ఏబీసీ సెంటర్ల ప్రేక్షకులకు నచ్చేలా


నందు, ప్రగ్యాజైశ్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, బోయపాటి శ్రీను, బెల్లంకొండ శ్రీనివాస్, మిర్యాల రవీందర్ రెడ్డి

బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్ ప్రీత్‌సింగ్ జంటగా నటించిన చిత్రం 'జయ జానకి నాయక'. ప్రగ్యా జైశ్వాస్ మరో కీలక పాత్రలో నటించగా...క్యాథరీన్ ట్రెసా స్పెషల్ సాంగ్ చేసింది. నందూ ఓ ముఖ్య పాత్ర పోషించారు. దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ ఈ సినిమాను రూపొందించారు. ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ శుక్రవారం 'జయ జానకి నాయక' తెరపైకి వస్తోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మీడియా ముచ్చటించారు. దర్శకుడు బోయపాటి మాట్లాడుతూ...'బెల్లంకొండ శ్రీనివాస్ ఎంతో కష్టపడి ఇష్టపడి ఈ సినిమాలో నటించాడు. సినిమా చూశాక అందరూ శ్రీనివాస్‌ను అభినందిస్తారు. భద్ర తర్వాత నేను దర్శకత్వం వహించిన ప్రేమ కథ ఇది. నేను చేసిన సినిమాల్లో ఇదొక ఫీల్‌గుడ్ మూవీ. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఏబీసీ సెంటర్ల ప్రేక్షకులు ఒకే వరుసలో కూర్చొని చూసేలా 'జయ జానకి నాయక' ఉంటుంది. ఇలాంటి స్క్రిప్టు దొరకడం అరుదు.' అన్నారు. నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ...'ఇది దర్శకుడు బోయపాటి కెరీర్లో పెద్ద సినిమా. బడ్జెట్ పరంగా నేనీ మాట చెపడం లేదు. ఆయన దర్శకత్వం వహించిన గత ఆరు చిత్రాల్లో ఏదో ఒక విషయం ఉంటుంది. ఇందులోనూ ప్రేమ, కుటుంబ, భావోద్వేగాలు కలిసి ఉంటాయి. తొలి 45 నిమిషాలు ప్రేమ సన్నివేశాలు, తర్వాత కుటుంబ అంశాలు సాగుతుంటాయి. మంచి కథ కుదరడమే ఈ చిత్ర తొలి విజయం. సినిమా విడుదల తర్వాత రకుల్ ప్రతి ఇంటి అమ్మాయి అయిపోతుంది. నిజమైన లవ్ ఎలా ఉంటుందో ప్రేక్షకులు చూస్తారు.' అన్నారు. కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ...'నేపథ్య సంగీతంతో కలిపి సినిమా చూశాను. చాలా భావోద్వేగానికి గురయ్యాను. నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా ఇది. ఇలాంటి చిత్రాన్ని ఇచ్చిన దర్శకుడికి కృతజ్ఞతలు.' అన్నారు. రకుల్ ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ...'ఈ చిత్రంలో జానకి పాత్ర దొరకడం నా అదృష్టం. నటనకు ఇంత ఆస్కారమున్న పాత్ర నేను చేయగలనని నమ్మిన దర్శకుడికి థాంక్స్. సినిమా చూసి బాగా నటించావని చెప్పారు. సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నా.' అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగ్యా జైశ్వాస్, నందు తదితరులు పాల్గొన్నారు.


రానా

మనకు సరిపోయే పాత్ర ఎంచుకుంటే నటుడిగా సగం విజయం సాధించినట్లే అంటారు రానా. 'బాహుబలి', 'ఘాజీ' విజయాల తర్వాత రానా క్రేజ్ పెరిగిపోయింది. బాలీవుడ్ సహా దక్షిణాదిలోనూ ఈ యువ హీరో పేరు తెచ్చుకున్నారు. ఈ విజయాలు ఇచ్చిన ఉత్సాహంతో రానా 'నేనే రాజు నేనే మంత్రి' అంటూ ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. శుక్రవారం తెరపైకి రానున్న ఈ సినిమా విశేషాలను రానా తెలిపారు.

హాలీవుడ్ సినిమాలో నటిస్తున్నా

● చేసే ప్రతి సినిమా ప్రేక్షకులకు చేరాలన్నదే నా ఆలోచన. అందుకే విడుదల ముందు వాళ్ల దగ్గరకు వెళ్లి ఫలానా తేదీన మీ ముందుకొస్తున్నాను చూడండి అని చెబుతాను. లేకుంటే వాళ్లు వేరే పనిలో పడిపోతారు. చాలా పోటీలో నా సినిమా 'నేనే రాజు నేనే మంత్రి' విడుదలవుతోంది. పోటీ ఉండటం మంచిదే. ఈ ఆగస్టు 15న సినిమాల పండగ వాతావరణం ఉంటుంది. మరో రెండు సినిమాలు తెరపైకి వస్తున్నాయి. నా చిన్నతనంలో ఇలా ఒకేసారి మూడు నాలుగు సినిమాలు విడుదలైతే... ఎక్కువ సంతోషపడేవాళ్లం. అన్ని సినిమాలు చూసేవాళ్లం. ఈ వారం అలాంటి సందడి ఉంటుంది.

● ఇది జోగేంద్ర అనే వడ్డీ వ్యాపారి కథ. అనంతపురంలో నివసిస్తుంటాడు. అతని వ్యాపారం, రాధ అనే అమ్మాయితో ప్రేమ, పెళ్లి... ఇలా అతని జీవితం ఆనందంగా సాగుతుంటుంది. ఇలాంటి వ్యక్తి జీవితంలో అనుకోకుండా కొన్నిసంఘటనలు జరుగుతాయి. వాటితో జోగేంద్ర రాజకీయాల వైపు దృష్టి సారిస్తారు. రాజకీయాల్లో ఏమీ తెలియని ఓ వడ్డీ వ్యాపారి అక్కడి పరిస్థితులను ఎలా తట్టుకుని నిలబడ్డాడన్నది కథాంశం. ఓ వ్యక్తి జీవితంలోని అత్యున్నత సంతోషాలు, అత్యంత బాధలనూ ఈ కథలో చూస్తారు.

● 'లీడర్' లో ప్రజలకు ఏదైనా మంచి చేయాలని భావించే నాయకుడి పాత్ర నాది. ఇందులో రాజకీయం ఒక అంశం మాత్రమే సినిమాలో ఎక్కువగా మిగతా అంశాలుంటాయి. క్యారెక్టర్ చెప్పినప్పుడు నాకు సరిగ్గా సరిపోతుందని అనిపించింది. మనకు సరిపోయే క్యారెక్టర్ ఎంచుకుంటే సగం విజయం సాధించినట్లే అని భావిస్తాను.

● తేజ లాంటి దర్శకుడే ఇలాంటి కథలు రాయగలరు. ఆయన జీవితంలో చాలా ఎత్తుపల్లాలు చూశారు. జయాపజయాలు చూశారు. తేజ తనకు తెలిసిన, తను చూసిన వ్యక్తుల జీవితాల ఆధారంగా ఈ చిత్ర కథను రాశారు. వాస్తవానికి జోగేంద్ర పాత్రది సుదీర్ఘమైన కథ. సినిమాకు తగినట్లు మార్చి చెప్పాం.

● నా కెరీర్‌లో భిన్నమైన చిత్రాలు చేస్తూ వచ్చాను. రాజమౌళి లాంటి పేరున్న దర్శకుడితో, సంకల్ప్ రెడ్డి అనే కొత్త వారితో పనిచేశాను. ఇప్పుడు దర్శకుడు తేజతో. ఆయనకు విజయాలు లేవని అంతా అంటున్నారు. కానీ దర్శకుడి ప్రతిభను ఒక్క సక్సెస్‌తోనే చూడలేం. ఫెయిల్యూర్ సినిమాలు చేసినా...మంచి సినిమా చేయగల సత్తా ఆయనలో ఉంది. దర్శకుడు ఎవరన్నది చూడను. కథను ఎంత బాగా చెబుతున్నాడు. దానిలో ఎంత విషయం ఉందనేది గమనిస్తాను.

● కాజల్ తేజ గారితో మొదటి సినిమా చేసింది. ఇప్పుడు యాభయ్యవ చిత్రం చేస్తోంది. ఆమెకు ఇదొక గొప్ప ప్రయాణం. నా భార్య రాధ పాత్రకు ప్రేక్షకులకు బాగా తెలిసిన నాయిక కావాలనుకున్నాం. కొంత పరిపక్వత కనిపించే క్యారెక్టర్ అది. కాజల్ బాగా నటించింది.

● ఓ హాలీవుడ్ సినిమా గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ సినిమా విడుదలయ్యాక ఆ ప్రాజెక్టు గురించి చర్చిస్తాం. ఆంగ్ల చిత్రంలో నటించడం నాకొక కొత్త అనుభూతి.





